ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
బుధవారం 12.03.2025 | సంపుటి : 11 సంచిక : 240 | పేజీలు : 12 వెల: రూ. 4/-




తెలంగాణ
Simultaneously Published from Hyderabad & Karimnagar
ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



నేటి నుంచి

# అసెంబ్లీ సమావేశాలు

## తొలిరోజు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

**చర్చకు రానున్న ఎస్సీ వర్గీకరణ, బిసి బిల్లులతో పాటు అంశాలు**

**ప్రభుత్వాన్ని నిలదీసేలా అస్త్రశస్త్రాలతో ప్రతిపక్షాలు సన్నద్ధం**

**144 సెక్షన్‌తో అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు**

**హైదరాబాద్,మార్చి11(జనంసాక్షి):** బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇకపోతే ఇప్పటికే అధికారులతో స్పీకర్ ప్రసాదరావు సమీక్షించారు. పలు సూచనలు చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది.. తొలిరోజు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జిజష్టదేవ్ వర్మ ప్రసంగిస్తారు. 13న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉంటుంది. 14న హోలీ సెలవు కారణంగా అసెంబ్లీకి కూడా సెలవు ప్రకటించారు. 15న గవర్నర్ ప్రసంగానికి సిఎం రేవంత్ సమాధానం ఇస్తారు. ఎస్సీ వర్గీకరణ, బిసి బిల్లులతో పాటు అంశాలు చర్చకు రానున్నాయి. కెసిఆర్ తొలిరోజు హాజరవుతారని ఇప్పటికే కెటిఆర్ సమాచారం ఇచ్చారు. అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఇప్పటికే అన్ని శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, మంత్రుల సమావేశం జరిగింది. ఆయా శాఖలకు బడ్జెట్ లో నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలు సమర్పించారు. ఈనెల 19 లేదా 20న ఆర్థిక శాఖ మంత్రి

మిగతా 2లో..

## 2014-23 వరకు ఉత్తమ చిత్రాలకు

# గద్దర్ అవార్డులు



**13 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**విధి విధానాలు ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్(జనంసాక్షి)** తెలుగు సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో 2014 నుంచి 2023 వరకూ ఒక్కో ఏడాదికి ఉత్తమ చలన చిత్రానికి అవార్డు ఇవ్వాలని నిర్ణయించింది. అవార్డులకు సంబంధించిన విధి విధానాలను తాజాగా ఖరారు చేసింది. మార్చి 13వ తేదీ నుంచి అవార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించనుంది.నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు, ఫీచర్ ఫిల్మ్, జాతీయ సమైక్యత చిత్రం, బాలల చలనచిత్రం విభాగం, పర్యావరణం, హెరిటేజ్, చరిత్రపై తీసే చిత్రాలకు పురస్కారాలు అందజేయనున్నారు. తొలి ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ ఫిల్మ్, సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్,

మిగతా 2లో..

# రాజీవ్ యువ వికాసం

## రూ. 6 వేల కోట్లతో 5 లక్షల మంది యువతకు స్వయం ఉపాధి పథకాలు

- మార్చి 15 నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 6 నుంచి దరఖాస్తుల పరిశీలన..లబ్ధిదారుల ఎంపిక
- జూన్ 2న ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు
- కార్యాచరణ ప్రణాళికను ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి
- గత దశాబ్ద కాలంగా యువ వికాసాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డ ఉపముఖ్యమంత్రి



**హైదరాబాద్(జనంసాక్షి):**రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులకు రూ.6 వేల కోట్లతో ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి పథకాలు అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్ వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. యువత వికాసం గురించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని, ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం

మిగతా 2లో..

## మరో బాదుడుకు కేంద్రం సిద్ధం!

**యూపిఐ చెల్లింపులపై ఛార్జీలు విధించే యోచన**

**న్యూఢిల్లీ (జనంసాక్షి):**యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు అందరూ అలవాటు పడ్డారు. ప్రజలు నగదు లావాదేవీలను పక్కన పెట్టారు. మోడీ పిలుపుతో అంతా ఆన్‌లైన్‌లకు అలవాటు పడ్డారు. ప్రస్తుతం ఇలాంటి యూపీఐ,

మిగతా 2లో..

హామీల అమలులో

# సర్కారు విఫలం

- ప్రజా సమస్యలపై సభలో నిలదీయండి
- ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం



**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ శాసన సభ, మండలి సభ్యులందరూ నిర్ణీత సమయానికి సభకు హాజరుకావాలని సూచించారు.

మిగతా 2లో..



# సందేహాలొద్దు.. అన్ని సక్రమమే

**ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు కసరత్తు చేస్తున్నాం**

**రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర ఎన్నికల సంఘం పిలుపు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పలు సందేహాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వివిధ సమస్యలను పరిష్కరించి.. ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీనికి సహకరించాలంటూ రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చింది.ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి


మిగతా 2లో..

# గ్రూప్ 2 ఫలితాలు విడుదల



**హైదరాబాద్(జనంసాక్షి)** ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్–2 నోటిఫికేషన్ విడుదలకాగా, 5 లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పరీక్షలకు 46 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి సగం మంది మాత్రమే గ్రూప్–2 పరీక్షలను రాశారు. 2024 డిసెంబర్ 15, 16న పరీక్షలు నిర్వహించారు.

# ఎలాంటి హామీ ఇవ్వలేదు



**ట్రంప్ టారీఫ్ వ్యాఖ్యలపై స్పందించిన కేంద్రం**

**న్యూయార్క్(జనంసాక్షి):**అమెరికాపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే.దీనిపై తాజాగా భారత ప్రభుత్వం నుంచి స్పందన వచ్చింది. సుంకాల తగ్గింపునకు ఎలాంటి హామీ ఇవ్వలేదని స్పష్టం చేసింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి మిత్రులు, శత్రువులు అని తేడా లేకుండా పలు దేశాలపై సుంకాల మోత

మిగతా 2లో..

# రెండునెలల్లో 'ఆర్‌ఆర్‌ఆర్'కు అనుమతులు



**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారు**

**రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణం: మంత్రి కోమటిరెడ్డి**


**న్యూఢిల్లీ,మార్చి11(జనంసాక్షి):**రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు .రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.”సంగారెడ్డి – భువనగిరి – చౌటుప్పల్ వరకు ఆర్‌ఆర్‌ఆర్ టెండర్ల పక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం

మిగతా 2లో..

## డంకీ రూట్‌లో అమెరికా వెళ్లే ప్రయత్నం

# మరో భారతీయుడి మృతి..

అక్కడే చిక్కుకున్న భార్యాబిడ్డలు




**అహ్మదాబాద్(జనంసాక్షి):** అక్రమంగా అమెరికాకు వెళ్తున్న భారతీయులను ఆ దేశం వెనక్కి పంపిస్తున్న విషయం తెలిసిందే. భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తు న్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన డంకీ మార్గాల్లో అగ్రదేశానికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు .ఈనేపథ్యంలోనే

మిగతా 2లో..

# కాలుష్యంలో మనమే టాప్..

**ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలువడే 20 నగరాల్లో 13 భారత్‌లోనే..**

**'ద వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ నివేదిక వెల్లడి**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ దేశంలోని చిన్న నగరాలను సైతం కాలుష్య కోరల్లోకి నెట్టేస్తోంది. ఇప్పటికే దేశ రాజధాని దిల్లీలో కర్బన ఉద్గారాల విడుదల ఆందోళనకర స్థాయికి చేరింది.కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ యంత్రాంగాలు చర్యలు చేపడుతున్నప్పటికీ, దేశంలో పలు నగరాల్లో గాలి నాణ్యత పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

మిగతా 2లో..

# టన్నెల్‌లోకి రోబోలు..

- ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద కొనసాగుతున్న ఆపరేషన్



**నాగర్‌కర్నూలు బ్యూరో(జనంసాక్షి):**ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ 18వ రోజు కొనసాగుతుంది. మంగళవారం రోబోలతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఇప్పటికే టన్నెల్‌లోకి అన్వీ రోబో బృందం వెళ్లింది. డేంజర్ జోన్‌లో రోబోలతో తవ్వే ప్రయత్నం చేశారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన రెండు చోట్ల తవ్వకాలు మొదలు పెట్టారు. కాగా..

మిగతా 2లో..



# దూసుకొచ్చిన మృత్యుశకటం

**అదుపుతప్పి ద్విచక్రవాహనాలను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు ..ఐదుగురి మృతి**

**కర్ణాటకలో చోటుచేసుకున్న ప్రమాదం**

వార్త 2లో



# ఆర్థిక ఇబ్బందులకు కుటుంబం బలి

**ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ భార్యభర్తలు**

**మంచంపై విగతజీవులుగా పడిఉన్న ఇద్దరు పిల్లలు**

**హబ్సిగూడలో విషాద ఘటన**

వార్త 12లో


# పాక్‌లో రైలు హైజాక్

**బందీలుగా వందలమంది ప్రయాణికులు**

**దాడిలో ఆరుగురు మిలిటరీ సిబ్బంది మృతి**



2లో



- కీవ్‌పై పుతిన్ సేనల బాంబుల వర్షం
- 14 మంది మృతి.. అనేకమంది గాయాలు
- మాస్కోపై డ్రోన్లతో ఉక్రెయిన్ ప్రతీకార దాడి
- 60 డ్రోన్లను నేల కూల్చిన రష్యా సేనలు

# ఇటు చర్చలు.. అటు దాడులు

**పరస్పర దాడులతో దద్దరిల్లుతున్న రష్యా,ఉక్రెయిన్**




**కీవ్/మాస్కో(జనంసాక్షి):**రష్యా– ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు ఒకవైపు కీలక భేటీలు జరుగనున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో కీవ్‌పై మాస్కో వైమానిక దాడులతో విరుచుకుపడుతుంది. తాజాగా ఉక్రెయిన్‌కు చెందిన వైమానిక రక్షణవ్యవస్థలే లక్ష్యంగా మాస్కో దళాలు దాడులు చేశాయి. కీవ్ మేయర్ విటాలి కీచ్‌కోస్ ఈ విషయాన్ని వెల్లడించారు.రష్యా తమపై బాలిస్టిక్ క్షిపణులు, బహుళ రాకెట్లను ప్రయోగించిందని కీచ్‌కోస్ తెలిపారు. వీటిని తమ దళాలు అడ్డుకుంటున్నాయని పేర్కొన్నారు. కీవ్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో తమకు పేలుడు శబ్దాలు

మిగతా 2లో..

## రూ.349 లక్షల కోట్లు..

# హాంఫట్



**ట్రంప్ చర్యలతో అమెరికా మార్కెట్లు గజగజ**

స్టాక్స్‌లోని మదుపర్ల సంపద 4 ట్రిలియన్ డాలర్ల (రూ.349 లక్షల కోట్లు) మేరకు ఆవిరైపోయింది. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ భయాలు సూచీలను వెంటాడుతున్నాయి. దీనికి ట్రంప్ అస్థిర విధానాలు తోడయ్యాయి.

వివరాలు పేజీ 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
12.03.2025

## 2014-23 ఉత్తమ చిత్రాలకు గద్దర్ అవార్డులు

డాక్యుమెంటరీ ఫిల్మ్, షార్ట్ ఫిల్మ్ విభాగాల్లోనూ ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. తెలుగు సినిమాపై పుస్తకాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకూ ఈ అవార్డును ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పైడి జయరాజ్, కాంతారావు, ఎం.ప్రభాకర్‌రెడ్డి పేర్లతో అవార్డులు కొనసాగించాలని నిర్ణయించింది.

## డీలిమిటేషన్‌తో సీట్ల సంఖ్య పెరుగుతుంది

**రాజ్‌నాథ్ సింగ్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన అమలుపై దక్షిణాది రాష్ట్రం తమిళనాడు కొంతకాలంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని పార్లమెంట్‌లో సీట్ల సంఖ్య తగ్గుతుందని డీఎంకే ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు."డీలిమిటేషన్ ప్రక్రియ ప్రణాళికబద్ధంగా కొనసాగుతుందని భావిస్తున్నా. దీనిపై అభ్యంతరాలు ఉంటే తమిళనాడు సీఎం ఎమ్‌కే. స్టాలిన్‌కు వాటిని లేవనెత్తే స్వేచ్ఛ ఉంటుంది. ఆ అంశాలపై సంబంధిత అధికారులు చర్చలు జరుపుతారు. నిర్ణయం న్యాయంగా ఉంటుంది. శాసనసభ, లోక్‌సభ అయినా ప్రతి రాష్ట్రంలోనూ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సీట్ల సంఖ్య సహజంగానే పెరుగుతుంది" అని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు."తమిళనాడు సహా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళలో కూడా సీట్ల సంఖ్య పెరుగుతుంది. కేవలం ఉత్తరాది రాష్ట్రాలకే ప్రయోజనం చేకూరుతుందనేది సరైన వాదన కాదు" అని పేర్కొన్నారు. కాగా.. లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే.. రాష్ట్రం లో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే డీలిమిటేషన్ వ్యతిరేకించాలని కోరుతూ స్టాలిన్.. ఏడుగురు ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. తాజాగా ఈ దీనిపై స్పందించిన రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పునర్విభజనపై వ్యక్తం అవుతున్న ఆందోళనలు సరైనవి కావని పేర్కొన్నారు.

## కాశ్మీర్‌లో రెండు తీవ్రవాద సంస్థలపై నిషేధం

**ఉత్తర్వులు జారీచేసిన కేంద్రహోంశాఖ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**జమ్మూ కశ్మీర్ కేంద్రంగా పనిచేస్తున్న రెండు సంస్థలపై కేంద్ర హోంశాఖ కొరడా ఝులిపించింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఆ రెండు సంస్థలపై ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్టు వేర్వేరు ప్రకటనల్లో తెలిపింది. అవామీ యాక్షన్ కమిటీ , జమ్మూకశ్మీర్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎఓ) సంస్థలను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద నిషేధిత సంస్థలుగా ప్రకటిస్తున్నట్టు పేర్కొంది. అవామీ యాక్షన్ కమిటీకి ఉమర్ ఫరూక్ సారథ్యం వహిస్తుండగా, జేకెఐఎంకు మసూర్ అబ్బాస్ సారథ్యం వహిస్తున్నారు. ఏఏసీ, జేకెఐఎంలు జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ భారత వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నాయని ఎంహెచ్ఏ అధికారిక ప్రకటనలో పేర్కొంది. సాయుధ చొరబాట్లు, అంశాంతి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అశాంతి రెచ్చగొడుతున్నట్టు తెలిపింది. జాతి వ్యతిరేక ప్రసంగాల చేయడం, హింసను ప్రేరేపించడం, రాళ్లు రువ్వడం వంటి ఘనటనల్లో ఉమర్ ఫరూక్, ఇతర సభ్యుల ప్రేమయంపై అనేక కేసులు నమోదుకావడాన్ని ప్రస్తావించింది. మసూర్ అబ్బాస్ నేతృత్వంలోని జేకెఐఎం జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ, భారత వ్యత్రిరేక ప్రచారం, ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తోందని తెలిపింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల కోసం ఆ సంస్థ సభ్యులు నిధులు సేకరిస్తున్నటు పేర్కొంది. ఆయా కారణాల దృష్ట్యా 1967 చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద రెండు సంస్థలపైన ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్టు ఎంహెచ్ఏ స్పష్టం చేసింది.

## యుద్ధం ఆగాలంటే ఉక్రెయిన్ భూమిని వదులుకోవాల్సిందే

**అప్పుడు శాంతి ఒప్పందం కుదురుతుంది:అమెరికా**

శాంతిఒప్పందం కోసం 2014 తర్వాత రష్యా ఆక్రమించుకొన్న భూమిపై ఉక్రెయిన్ ఆశలు వదులుకోవాల్సిందేనని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తేల్చిచెప్పారు.అప్పుడే సంధి జరిగి యుద్ధం ఆగుతుందన్నారు. శాంతిచర్చల కోసం ఉక్రెయిన్ అధికారులతో మాట్లాడేందుకు సౌదీ అరేబియా రాజధాని జెద్దాకు చేరుకున్న సందర్భంగా మార్కో రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు. శ్వేతసౌధంలో ట్రంప్–జెలెన్‌స్కీల మధ్య వాగ్వాదం చోటుచేసుకొన్న 10 రోజుల తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు సైనిక సాయం, ఇంటెలిజెన్స్ సమాచారం నిలిపివేసింది.

# నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. ఈసారి మూడు లక్షల 20 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టేఅవకాశం ఉంది. మార్చి 29 వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగించనున్నట్లు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావే శాలకు ముందు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. అసెంబ్లీలో బీఆం ఎస్ అనుసరించాల్సిన వ్యూహం పై ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీక రణ పై చర్చ లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని నిర్ణయించారు. ఆరు గ్యారెంటీలకు బ్జడెట్ కేటాయిం పులపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా చర్చలో పాల్గొనాలని కేసీఆర్ సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన పై ప్రభుత్వ తప్పిదం ఉందంటూ ఎత్తి చూపాలన్నారు. కాళేశ్వరం రిపేర్ చేయక పోవడంతోనే పంటలు ఎండుతున్నాయి అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. రాష్ట్రం లోని వివిధ అంశాలపై వాయిదా తీర్మానాలు ఇచ్చి.. వాటిపై చర్చ కు గట్టిగా పట్టు పట్టాలని ఎమ్మెల్యే లకు కేసీఆర్ సూచించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సంద ర్భంగా రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావే శాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పం పాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని అన్నారు. వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు.

## హామీల అమలులో సర్కారు విఫలం

రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చీల్చి చెండాడాలన్నారు. బీఆర్ఎస్‌పై ప్రభుత్వం చేస్తున్న తప్పుడు నిందలను తిప్పి కొట్టాలన్నారు.రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలు, ఎండిన పంటలు, అందని కరెంటు, అందని సాగునీరు, కాలిపోతున్న మోటర్లు తదితర రైతాంగ సమస్యలపై, మంచినీటి కొరతపై అసెంబ్లీలో, మండలిలో పోరాడాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలని.. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై మాట్లాడాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. మహిళలకు ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చేందుకు కొట్లాడాల న్నారు.ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుస రిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలన్నారు. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు.. విడుదల చేయక పోవడం గురించి.. వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమ స్యలపై ఎండగట్టాలన్నారు. దళితబంధును నిలిపివే యడంపై ప్రశ్నించాలన్నారు. గొర్రెల పెంపకం, చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన దాదాపు మూడు గంటల పాటు ఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రజల పక్షాన గట్టిగా పోరాడాలని సమావేశం నిర్ణ యించింది. సభలో ఇంకా ప్రతిభా వంతంగా ప్రజా సమస్యలపై పోరాడేందుకు సభ్యులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకునేందుకు డిప్యూటీ లీడర్లను నియమించనున్నట్లు కేసీఆర్ తెలిపారు. ఎల్పీ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభ సభ్యులు, మండలి సభ్యులు పాల్గొన్నారు.

### సందేహాలొద్దు.. అన్ని సక్రమమే..

తీసుకురావాలని అన్ని జాతీయ, రాష్ట్ర పార్టీలకు ఈసీ సూచించింది. ఏప్రిల్ 30 నాటికి సలహాలను అందించాలని కోరింది. అందుకు సంబంధించి రాజకీయ పార్టీలకు సూచనలిచ్చింది. ఎన్నికల ప్రక్రియను మరింతగా బలోపేతం చేసేందుకు ఆయా పార్టీల అధ్యక్షుడు, సీనియన్ నేతలతో చర్చలు జరిపేందుకు యోచిస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. పార్టీల సీనియర్ నేతలు అందించే కీలక సూచనలను స్వీకరించనున్నట్లు తెలిపింది. పార్టీలతో సీఈవో, డీఈవో, ఈఆర్‌వోలు సమావేశం కావాలని.. ఆ సమయంలో వారు అందించే సమస్యలు, కీలక సూచనలను స్వీకరించి దానిపై నివేదిక ఏర్పాటు చేసి కమిషన్‌కు సమర్పించాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా, గుర్తింపు కార్డుల అంశంపై ప్రశ్నలు లేవనెత్తాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధ రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ఈసీ స్పందించింది.

## ఎలాంటి హామీ ఇవ్వలేదు

మోగిస్తున్నారు. భారత్ తమ వస్తువులపై భారీగా సుంకాలు విధిస్తోందని ఆరోపించిన ఆయన.. వచ్చేనెల రెండో తేదీ నుంచి తమ ప్రతీకార సుంకాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇటీవల మరోసారి ఇదే అంశాన్ని ప్రస్తావిం చిన ట్రంప్.. భారత్ అత్యధికంగా సుంకాలు వసూలుచేస్తోందని, ఆ దేశంలో ఏ వస్తువు విక్రయించడానికి వీలులేనంత భారంగా ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని లేవనెత్తడం.. భారత్ చర్యలను తాము బహిరంగపరచడం వల్ల సుంకాలను తగ్గించడానికి ఆ దేశం అంగీకరించిందని తెలిపారు. దీనిపై తాజాగా భారత్ స్పందించింది. "సుంకాల తగ్గింపు అంశంపై అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. అమెరికా అధ్యక్షుడు పదేపదే లేవనెత్తుతున్న ఈ సమస్య పరిష్కారానికి సెప్టెంబర్ వరకు సమయం కోరాం" అని పార్లమెంటరీ ప్యానెల్‌కు భారత ప్రభుత్వం వెల్లడించింది. ఈమేరకు జాతీయ మీడియా కథనం పేర్కొంది. భారత్– అమెరికా పరస్పరం ప్రయోజనకరమైన ద్వైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకొనే దిశగా కృషి చేస్తున్నాయని, తక్షణం సుంకాల సర్దుబాటు చేసుకునే బదులు దీర్ఘకాలిక వాణిజ్య సహకారంపై దృష్టిసారించాయని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి వెల్లడించారు.తక్షణం సుంకాల సర్దుబాటు చేసుకునే బదులు దీర్ఘకాలిక వాణిజ్య సహకారంపై దృష్టిసారించాయని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి వెల్లడించారు. ట్రంప్ పాలన, భారత్‌పై సుంకాలు తదితర అంశాలపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల స్పందించిన సంగతి తెలిసిందే. "ప్రపంచంలోని శక్తిమంతమైన దేశాలన్నింటికీ సమాన అధికారాలు ఉండాలనే విధానంలో ట్రంప్ పాలన సాగుతోంది. అది భారత ఆలోచనలకు సరిగ్గా సరిపోతుంది" అని పేర్కొన్నారు.



## రెండునెలల్లో 'ఆర్ఆర్ఆర్'కు అనుమతులు

భూ సేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ – విజయ వాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరా బాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమ వుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు" అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

## టన్నెల్‌లోకి రోబోలు..

సాయంత్రానికి రెండు మృతదేహాలు వెలికితీసే అవకాశం ఉంది. కేరళకు చెందిన క్యాడవర్ శునకాలు మృతదేహాల ఆనవాళ్లు పసిగట్టాయి. దాంతో ఆ ప్రాంతంలో తవ్వితే ఒకరి మృతదేహం బయటకు తీశారు. అతి కష్టం మీద మరో ఐదడుగులు తవ్వారు. ఇంజనీర్ ఆచూకీని కనుగొన్న ప్రాంతానికి కొంచెం అటు ఇటుగా మరో ముగ్గురు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మరో ఇద్దరి జాడ లభించే అవకాశం ఉంది. మిగిలిన వారు సొరంగం చిట్ట చివరి భాగం దగ్గర టీబీఎం కట్టర్ సమీపంలో చిక్కుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం టన్నెల్‌లో టీబీఎం మిషన్ కట్టింగ్, డీ వాటరింగ్ కొనసాగుతుంది.శ్రీశైలం ఎడమ కాలువ ప్రాజెక్టు టన్నెల్ నిర్మాణ సమయంలో 8 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టన్నెల్‌లో గౌరావ్ పెనిట్రేటింగ్ రాడార్ , క్యాడవర్ డాగ్స్ సాయంతో తవ్వకాలు కొనసాగుతున్నాయి. రాడార్, శునకాలు గుర్తించిన ప్రదేశాలను డీ1, డీ2, డీ3 ప్రాంతాలుగా విభజించి అక్కడ తవ్వకాలు చేపట్టారు అధికారులు. ఆదివారం నాడు డీ2 ప్రాంతంలో తవ్వకాలు జరిపిన రెస్క్యూ టీమ్స్ ఓ ఇంజనీర్ మృతదేహాన్ని వెలికితీశాయి. రెస్క్యూ ఆపరేషన్ కు అడ్డుపడుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ కట్టింగ్, నీటి తొలగింపు పనులు కూడా నిరంతరం జరుగుతున్నాయి. కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## డంకీ రూట్‌లో అమెరికా వెళ్లే ప్రయత్నం

తాజాగా గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబంతో సహా డంకీ రూట్‌లో అమెరికాకు వెళ్తూ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసింది. మృతుడిని గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలోని మోయద్ గ్రామానికి చెందిన దిలీప్ పటేల్‌గా గుర్తించారు. దిలీప్ పటేల్ అమెరికాలో స్థిరపడాలనే ఆలోచనతో ఇటీవల ఓ ఏజెంట్‌ను సంప్రదించారు. తన భార్య, చిన్నారితో సహా ముగ్గురిని అమెరికా పంపడానికి రూ.కోటి చెల్లించాలని వారు కోరడంతో తమ భూమిని విక్రయించి.. వచ్చిన రూ.కోటి చెల్లించినట్లు స్థానికులు పేర్కొన్నారు. రెండు నెలల క్రితం అతడు కుటుంబంతో సహా టూరిస్ట్ వీసాపై దుబాయ్ వెళ్లి, అక్కడి నుంచి నికరాగ్వాకు వెళ్లాడు. అక్కడినుంచి డంకీ మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో మధుమేహ వ్యాధిగ్రస్తుడైన దిలీప్ అనారోగ్యానికి గురయ్యారు. ఆ సమయంలో అతడికి మందులు లభించకపోవడంతో అనారోగ్యం తీవ్రమై కోమాలోకి జారుకొని మృతి చెందాడని అధికారులు పేర్కొన్నారు. కాగా మృతుడి భార్యాబిడ్డలు అక్కడే చిక్కుకుపోయినట్లు తెలిపారు.

# రాజీవ్ యువ వికాసం

అధికారంలోకి రాగానే యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించి వారి అభ్యున్నతికి దోహదపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా వివరించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్లను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాలు అందకపోవడంతో ఇబ్బందులు పడ్డారని వివరించారు. ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి 3 లక్షల చొప్పున సాయం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. 5 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సంవత్సరం స్వయం ఉపాధి పథకం అందించడానికి ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. స్వయం ఉపాధి పథకం కొరకు ఆన్ లైన్ లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక



జరుగుతుందన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 02న స్వయం ఉపాధి పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేస్తామని వివరించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి తగిన మార్గదర్శకాలను అధికారులు రూపొందిస్తు న్నారని చెప్పారు. సామాజిక స్పృహ కలిగిన ప్రజా ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడం సామాజిక బాధ్యతగా తీసుకున్నదన్నారు.

**చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి 540 కోట్లు**

వీరవనిత చాకలి ఐలమ్మ యూనివర్సిటీ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం 540 కోట్ల రూపాయలు కేటాయించిందని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దడానికి అద్భుతమైన నిర్మాణాలు చేయడానికి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ డిజైన్ చేసిందని ఈ సందర్భంగా తెలిపారు. యూనివర్సిటీలో ఉన్న హెరిటేజ్ భవనాలను పునరుద్ధరణ చేస్తామన్నారు. యూనివర్సిటీ ప్రధాన ద్వారం మూసి రివర్ ను ఆనుకొని ఉందని మూసి పునర్జీవం అయిన తర్వాత యూనివర్సిటీ ప్రధాన ద్వారా అన్ని తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం 15.5 కోట్లు, అదేవిధంగా నూతన భవన నిర్మాణాలకు తక్షణమే 100 కోట్లు విడుదల చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారుహెరిటేజ్ భవనాలు, పునరుద్ధరణ ప్రణాళికలను అధికారులతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్వయంగా పరిశీలించారు.

# ఇటు చర్చలు.. అటు దాడులు

వినిపి స్తున్నాయని అక్కడి ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. యుద్ధం ముగింపునకు సౌదీ అరేబియాలో ఉక్రెయిన్, అమెరికా అధికారులు కీలక చర్చలు జరపనున్నారు. ఈక్రమంలో రష్యా దాడులు చేయడం గమనార్హం.ఇటీవల సైతం ఉక్రెయిన్‌లోని డోబ్రోపిలియా, ఖార్కివ్ ప్రాంతాల్లోని స్థావరాలపై రష్యా క్షిపణి, డ్రోన్‌లతో విరుచుకుపడింది. ఈ దాడిలో 14 మంది మరణించగా.. అనేకమంది గాయపడ్డారు. ఎనిమిది బహుళ అంతస్తుల భవనాలు, 30కు పైగా వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. రష్యా దాడుల నుంచి ప్రజలను రక్షించేందుకు తమ వైమానిక రక్షణను బలోపేతం చేయాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈసందర్భంగా పిలుపునిచ్చారు. ఇక, రష్యా– ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అటు అమెరికా ఇటు ఐరోపా దశాలు కీలక సమావేశాలు నిర్వహించనున్నాయి.

**మాస్కోపై ఉక్రెయిన్ ప్రతీకార దాడి..**
**60 డ్రోన్లను నేల కూల్చిన రష్యా సేనలు**

రష్యా– ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ఓవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలో ఆ రెండు దేశాలు ఒకదానిపై ఒకటి దాడి చేసుకుంటున్నాయి.ఉక్రెయిన్‌పై రష్యా వైమానిక దాడులతో విరుచుకుపడగా.. తాజాగా ప్రతీకార దాడులు చోటుచేసుకున్నాయి. మాస్కో దిశగా కీవ్ డ్రోన్లను ప్రయోగించింది. అయితే వాటిని కూల్చివేశామని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ వెల్లడించారు.మాస్కో రీజియన్‌లోని రెండు జిల్లాల్లో 11 డ్రోన్లను కూల్చివేసినట్లు మేయర్ తెలిపారు. అయితే మిగిలిన డ్రోన్లను ఏఏ ప్రాంతాల్లో కూల్చివేశారో మాత్రం వెల్లడించలేదు. రష్యా రాజధాని నగరంలోని రెండు విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. క్షతగాత్రులకు సంబంధించి ఎలాంటి వివరాలు వెల్లడికానప్పటికీ.. ఈ దాడుల వల్ల పలు భవనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. తాజా ఘటన కొన్ని నెలల వ్యవధిలో రష్యాపై ఉక్రెయిన్ చేసిన అతిపెద్ద దాడి అని తెలుస్తోంది. ఇదిలాఉంటే.. రష్యా తమపై బాలిస్టిక్ క్షిపణులు, బహుళ రాకెట్లను ప్రయోగించిందని కీవ్ మేయర్ తెలిపారు. వీటిని తమ దళాలు అడ్డుకున్నాయని పేర్కొన్నారు. కీవ్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో తమకు పేలుడు శబ్దాలు వినిపించాయని అక్కడి ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై మంగళవారం కీలక భేటీలు జరగనున్నాయి. అటు అమెరికా, ఇటు ఐరోపా దేశాలు ఈ సమావేశాలను నిర్వహిస్తున్నాయి. యుద్ధాన్ని ముగించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సౌదీ అరేబియాలో ఉక్రెయిన్‌తో అమెరికా చర్చలకు సిద్ధంకాగా.. ఇటు అమెరికా సాయాన్ని నిలిపేసిన నేపథ్యంలో ఉక్రెయిన్‌కు అండగా నిలిచేందుకు, రష్యాను నిలువరించేందుకు ఐరోపా దేశాలు సమావేశమవుతున్నాయి.

# కాలుష్యంలో మనమే టాప్

తాజాగా స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్ కాలుష్యంపై రూపొందించిన 'ద వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024' నివేదిక విడుదలైంది. ఇందులో ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలువడే 20 నగరాల్లో 13 భారత్‌లోనే ఉన్నాయని వెల్లడించింది. అస్సాంలోని బైర్నీహాట్ నగరం తొలిస్థానంలో నిలవగా.. తరువాతి స్థానాల్లో దిల్లీ, ముల్లన్‌పుర్ (పంజాబ్), ఫరీదాబాద్, న్యూదిల్లీ, గురుగ్రామ్, గంగానగర్, గ్రేటర్ నోయిడా, భివాడి, ముజఫర్‌నగర్, హనుమాన్‌గఢ్, నోయిడా ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత రాజధానిగా దిల్లీ (ఆవశ్రీప్త్రతి) తొలి స్థానంలో కొనసాగుతున్నట్లు నివేదిక తెలిపింది. 2023లో ఈ సంస్థ విడుదల చేసిన జాబితాలో ప్రపంచంలోని మూడో అత్యంత కలుషిత వాతావరణ దేశంగా భారత్ నిలవగా.. ప్రస్తుతం విడుదలైన జాబితాలో ఐదో స్థానంలో ఉంది. ఈ కాలుష్యం వల్ల అక్కడి ప్రజల ఆయుర్దాయం దాదాపు 5.2 సంవత్సరాలు తగ్గినట్లు నివేదికలు అంచనా వేశాయి. కాగా.. 2009 నుంచి 2019 వరకు భారత్‌లో ప్రతియేటా కాలుష్య సంబంధిత వ్యాధుల వల్ల దాదాపు 1.5 మిలియన్ల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నట్లు గతేడాది విడుదలైన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ అధ్యయనం పేర్కొంది.ఈ నివేదికలపై చిఊూ మాజీ ప్రధాన శాస్త్రవేత్త, ఆరోగ్య మంత్రిత్వశాఖ సలహాదారు సౌమ్య స్వామినాథన్ మాట్లాడుతూ.. కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లల్లో వంట చెరుకు ఉపయోగించడం వల్ల అక్కడి ప్రజలు అధికంగా కాలుష్య కారక వ్యాధులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వాటిని నివారించడానికి బయోమాస్‌ను ఎల్‌పీజీ సిలిండర్లతో భర్తీ చేయడం వంటి విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు.దీనికోసం భారత ప్రభుత్వం ఇప్పటికే సంక్షేమ పథకాన్ని అమలుచేస్తోందని.. అయితే దీనిని పూర్తిగా నివారించాలంటే అదనపు గ్యాస్ సిలిండర్లపై మరింత రాయితీ ఇవ్వాలని ఆమె సూచించారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యం మెరుగవ్వడమే కాకుండా కాలుష్య స్థాయిలు కూడా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. నగరాల్లో ప్రజా రవాణాను విస్తరించడం, కొన్నిరకాల వాహనాలపై జరిమానాలు విధించడం.. పరిశ్రమలు, నిర్మాణసంస్థలు తగిన నిబంధనలు పాటించడం వంటి చర్యల ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చున్నారు.

## పాక్‌లో రైలు హైజాక్..

**ఇస్లామబాద్(జనంసాక్షి):** పాకిస్థాన్‌లో రైలు హైజాక్‌కు గురైన ఘటన కలకలం సృష్టిస్తోంది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాదులు ప్రయాణికుల రైలుపై దాడి చేశారు వందల మందికి పైగా ప్రయాణికులను బందీలుగా తీసుకున్నామని ప్రకటించుకున్నారు. బలోచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్‌కు రైలు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై వేర్పాటువాదులు భారీస్థాయిలో కాల్పులు జరిపారని బలోచిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రింద్ వెల్లడించారు. ఈ ఘటన గురించి తెలియగానే అత్యవసర చర్యలు తీసుకోవాలని స్థానిక యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. వేర్పాటువాద మిలిటెంట్ గ్రూప్ బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఈ దాడికి బాధ్యత ప్రకటించుకుంది. తాము బందీలుగా తీసుకున్నవారిలో భద్రతాసిబ్బంది కూడా ఉన్నారని తెలిపింది. పక్కా ప్లానింగ్‌తో ఆ గ్రూప్ రైల్వేట్రాక్‌ను పేల్చివేయడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దాంతో మిలిటెంట్లు వెంటనే రైలును తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ప్రయాణికులందరినీ బంధించారు. ఈ దాడిలో ఆరుగురు మిలిటరీ సిబ్బంది మృతి చెందినట్లు బీఎల్ఏ వెల్లడించింది. తమపై ఏదైనా మిలిటరీ ఆపరేషన్‌కు ప్రయత్నిస్తే.. ప్రయాణికులందరినీ చంపేస్తామని బెదిరించింది. ఈ ఘటనలో రైలు డ్రైవర్ గాయపడినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఘటనాస్థలానికి సహాయక, భద్రతా సిబ్బంది చేరుకున్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. బందీలను విడిపిం చేందుకు పాక్ భద్రతాబలగాలు యత్నిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. బలోచిస్థాన్ వేర్పాటువాదులు పాక్‌లో వరుసగా దాడులకు పాల్పడుతున్నారు. పోలీస్ స్టేషన్లు, రైల్వేలైన్లు, వాహనాలపై దాడులు చేస్తున్నారు. సాయుధులు ప్రధాన హైవేను స్తంభింపజేసి బస్సుల్లో నుంచి ప్రయాణికులను కిందకు దించి వారి గుర్తింపు కార్డులను చూసి మరీ కాల్చిచంపిన ఘటనలు చోటుచేసుకున్నాయి.

# మరో బాదుడుకు కేంద్రం సిద్ధం!

రూపే డెబిట్ కార్డులతో చేసే లావాదేవీలపై వ్యాపారులపై ఎలాంటి ఛార్జీల భారం లేదు. అయితే, త్వరలోనే ఈ లావాదేవీలపైనా మర్చెంట్ ఛార్జీలను విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడిం చాయి. ఇప్పటికే జీఎస్టీ తదితర భారాలు తప్పడం లేదు. బ్యాంకు లావాదేవీలపైనా భారం పడుతోంది. ఇవి చాలవ న్నట్లుగా ఇప్పుడు యూపిఐ పేమెంట్లపై మోడీ దృష్టి పడిందని అర్థం చేసుకోవచ్చు. రానున్న రోజుల్లో పెద్ద వ్యాపారులు యూపీఐ ఆధారిత చెల్లింపులకు ఛార్జీలు చెల్లించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందని కథనాలు పేర్కొన్నాయి. వార్షిక ఆదాయం రూ.40లక్షలపైన ఉండే వ్యాపారులకు యూపీఐ చెల్లింపులపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్ ను తిరిగి తీసుకురావాలని ప్రతిపాదిస్తూ బ్యాంకింగ్ ఇండస్ట్రీ ప్రతిని ధులు ఇటీవల కేంద్రానికి అధికారిక ప్రతిపాదన పంపారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని ఓ బ్యాంకర్ వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'వీసా, మాస్టర్‌కార్డ్ వంటి డెబిట్ కార్డులు, ఇతర క్రెడిట్ కార్డులతో చేసే చెల్లింపులకు పెద్ద వ్యాపారులు ఎండీఆర్ ఛార్జీలు చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు వారు యూపీఐ, రూపే డెబిట్‌కార్డు ఆధారిత లావాదేవీలకు ఎందుకు ఛార్జీలు కట్టకూడదు?' అని సదరు బ్యాంకర్ ప్రశ్నించారు. కేంద్రం కూడా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. అయితే, 'టైర్డ్ ప్రైజింగ్ సిస్టమ్' ఆధారంగా ఈ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. అంటే.. రూ.40లక్షల్లోపు వార్షికాదాయం ఉండే వ్యాపారులు యూపీఐ చెల్లింపులను ఉచితంగానే స్వీకరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.అయితే, ఈ ఛార్జీలను తిరిగి తీసుకురావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది.ఆయా లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు ఈ రుసుము చెల్లించేవారు. అది కూడా ఒక శాతం లోపే ఉండేది.

# బొగ్గు, క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లో పరస్పర సహకారం

- ఎన్‌ఎండీసీ, సింగరేణి నిర్ణయం

(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)




బొగ్గు రంగంలో సుదీర్ఘ అనుభవమున్న సింగరేణి దేశ అవసరాల దృష్ట్యా క్రిటికల్ మినరల్స్ మైనింగ్ లోకి అడుగు పెట్టాలని కృత నిశ్చయంతో ఉందని, ఈ నేపథ్యంలో 60 ఏళ్లుగా ఖనిజాల ఉత్పత్తిలో అంతర్జాతీయ అనుభవమున్న జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎండీసీ)తో కలిసి నడిచేందుకు సంసిద్ధంగా ఉన్నామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం సింగరేణి డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి ఎన్ఎండీసీ సీఎండీ అమితావ ముఖర్జీ, ఆ సంస్థ డైరెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విదేశాల్లో క్రిటికల్ మినరల్స్, ఇతర ఖనిజాల మైనింగ్‌లో అపార అనుభవమున్న ఎన్ఎండీసీ సహకారం తమకు ఎంతగానో దోహదపడుతుందని సీఎండీ ఎన్.బలరామ్ అభిప్రాయపడ్డారు. క్రిటికల్ మినరల్స్ మైనింగ్ లో మేథో విజ్ఞానాన్ని పంచుకునేందుకు ఐఐటీ–హైదరాబాద్ తో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సాంకేతికత, మానవ వనరులపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న సింగరేణి వ్యాపార విస్తరణ చర్యలను వివరించారు. ఎన్ఎండీసీ సీఎండీ అమితావ ముఖర్జీ మాట్లాడుతూ దేశ ఇంధన అవసరాలు తీర్చడంలో సింగరేణి, ఖనిజ వనరులను జాతికి అందించేందుకు ఎన్ఎండీసీలు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి సహకరించేందుకు ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటామన్నారు. రానున్న రోజుల్లో తాము చేపట్టబోయే ప్రాజెక్టుల్లో సింగరేణిని సహ భాగస్వామిగా చేసుకునే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. జార్ఖండ్‌లో తమకు దక్కిన బొగ్గు బ్లాక్‌లోనూ అవసరమైతే సింగరేణి సహకారం తీసుకుంటామన్నారు. పరస్పర సహకారంతో ముందుకు వెళ్లడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో ఎన్ ఎం డీ సీ డైరెక్టర్లు విశ్వనాథ సురేశ్ (కమర్షియల్), వినయ్ కుమార్ (టెక్నికల్) , జయ్ దీప్ దాస్ గుప్తా (ప్రొడక్షన్) శ్రీమతి ప్రియదర్శిని గడ్డం(పర్సనల్), సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు(పి అండ్ పి), ఈడీ(కో ల్ మూమెంట్) ఎస్డీ ఎం సుభానీ, జీఎం(ఫైనాన్స్) సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


# మహిళా సాధికారత ఎక్కడుంది?

- సమాజ అధికారాలు దక్కడం లేదు
- విశ్రాంత బ్యాంక్ అధికారి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు పద్మశ్రీ




హైదరాబాద్, మార్చి 11 (జనంసాక్షి) : మహిళా సాధికారత ఎక్కడుందని, సమాజ అధికారాలు దక్కడం లేదని విశ్రాంత బ్యాంక్ అధికారి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు పద్మశ్రీ అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో దోమలగూడలోని చెన్నుపాటి భవన్(యుటియఫ్)లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సదస్సుతో పాటు మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపకం, తమ జీవితాంతం మహిళా అభివృద్ధికి కృషి చేసిన మహిళలను సన్మానం చేశారు. మహిళా సదస్సుకు టాప్ర ఉపాధ్యక్షురాలు, మహిళా విభాగం కన్వీనర్ డాక్టర్ ఎల్.అరుణ అధ్యక్షత వహించగా విశ్రాంత బ్యాంకు అధికారి, సిఐటియు రాష్ట్ర నాయకురాలు పద్మశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని అధికారాలు అందినపుడే మహిళా సాధికారత సాధించినట్లు అవుతుందని, ఏదో ప్రభుత్వ ఉద్యోగులలో తప్ప మిగతా అసంఘటిత రంగ కార్యకలాపాలలో పాల్గొంటున్న మహిళలకు అసలు గుర్తింపే లేదని అన్నారు. పని చేసే చోట సమాన పనికి సమాన వేతనం లభించడం లేదన్నారు. అలాంటపుడు మహిళా సాధికారత ఎక్కడుందని ప్రశ్నించారు. బడ్జెట్ లో మహిళా అభివృద్ధికి కేటాయింపులు ఏ మాత్రం సరిపోవన్నారు. సి.కమల కుమారి మాట్లాడుతూ మహిళలకు కుటుంబంలోనూ, పని ప్రదేశంలోనూ రక్షణ, ఆర్థిక స్వావలంబన, లింగ వివక్షత లేని సామాజిక సమానత్వం కల్పించాలని కోరారు. ఎం.సంయుక్త మాట్లాడుతూ మహిళలకు నిర్ణయాలలో భాగస్వామ్యం, అవకాశాలను ఎంచుకేనే స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం వంటివి సాధికారతకు కొన్ని కొలమానాలన్నారు. గ్రుహ హింస లాంటి చట్టాలు చేసినా మహిళలకు స్వేచ్ఛ దొరకడం లేదన్నారు. యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి శారద మాట్లాడుతూ మన నాయకులు మహిళా అభ్యున్నతి, బేటీ పడావ్ బేటీ బచావ్, నారీ శక్తి , వికసిత భారత్ లాంటి ఊకదంపుడు నినాదాలో తప్ప నిజమైన వికాసం కనబడటం లేదన్నారు. పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మహిళలకు ప్రత్యేక అవకాశాల కొరకు పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేథరీన్, విజయ లక్ష్మి, సుజాత, పద్మ, శకుంతల మరియు రాష్ట్ర నాయకులు నాగేశ్వర్ రావు, ఎ. జనార్ధన్ రెడ్డి, ఎం. నరహరి, నర్సింగరావు, కొండల్ రావు, రమేష్, రామక్రుష్ణ, రాధాక్రుష్ణ, వైకుంఠ రావు, క్రుష్ణా రావు, జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ములుగు ఘటనపై రైతు కమిషన్ సీరియస్



ములుగు, మార్చి 11 (జనంసాక్షి) : ములుగు జిల్లాలో మొక్కజొన్న విత్తన సాగుచేసే రైతులు అకారణంగా అనారోగ్యానికి గురవుతున్నారు. పశువులు చనిపోతున్నాయి. మొక్క జొన్న సాగుచేసే రైతులకే ఈ విధంగా జరగడంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై వ్యవసాయ కమిషన్కు అక్కడి రైతులు లేఖ రాయడంతో.. కమిషన్ సీరియస్ గా తీసుకుంది. మొక్క జొన్న సాగుచేసే రైతుల వివరాలు, వేసిన విత్తనం, వాడిన పురుగుమందుల కంపెనీల వివరాలతో కూడిన సమాచారం వెంటనే కమిషన్ కు చేర్చాలని ములుగు జిల్లా వ్యవసాయ అధికారులకు ఆదేశించింది. దీనిపై రేపు కమిషన్ కార్యాలయంలో సమీక్షించి ప్రభుత్వానికి ఓ నివేదికను తయారుచేసి ఇవ్వనున్నట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఏర్పడినప్పటి నుండి ఈరోజు వరకు చేపట్టిన కార్యక్రమాలు, పర్యటనల వివరాలు సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో పెట్టినట్లు చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.

# పసుపు రైతుల బాధలు పట్టవా... రేవంత్ రెడ్డి?

- క్వింటాలు పసుపుకు రూ 15 వేల ధర కల్పిస్తామన్న హామీ ఏమైంది ?
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్



హైదరాబాద్, మార్చి 11 (జనంసాక్షి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం పసుపు రైతులను చిత్తు చేస్తున్నాయని, పసుపు రైతుల బాధలు, కష్టాలు పట్టవా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పంటకు గిట్టుబాటు ధర లేక పసుపు రైతులు ఆందోళన చేస్తుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గిట్టుబాటు ధరలు లేక నిజామాబాద్ లో పసుపు రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వారికి మద్దతుగా మంగళవారం ఎమ్మెల్సీ కవిత ప్రకటన విడుదల చేశారు. గిట్టుబాటు ధర రాక పసుపు రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నదని నిలదీశారు. మాటలు చెప్పిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ముందుకు రావడం లేదని ఎండగట్టారు. క్వింటాలు పసుపుకు 15 వేల ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు పసుపు కు కనీసం 9 వేలు రాని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇది రైతులను నయవంచన చేయడమే, మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 15 వేల మద్దతు ధర చెల్లిస్తూ పసుపు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు తీసుకొచ్చామని చెబుతున్న బిజెపి, ఎంపీ ధర్మపురి అరవింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదని, పసుపు బోర్డుకు చట్టబద్ధత లేకపోవడంతో రైతులకు ప్రయోజనాలు కలవడం లేదని వివరించారు. పసుపు కు ధరలు పెంచుతామని, మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తామని పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో కేంద్ర బండి సంజయ్ చెప్పారని, కానీ ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చే పసుపు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# శ్రీచైతన్య కాలేజీల్లో కొనసాగుతున్న దాడులు

- 5కోట్ల నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు

హైదరాబాద్, మార్చి10 (జనంసాక్షి) : శ్రీచైతన్య కాలేజీల్లో ఐటీ సోదాలు వరుసగా రెండోరోజూ కొనసాగాయి. మాదాపూర్‌లోని ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు రూ.5 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎపి, తెలంగాణతో పాటు 10 ప్రాంతాల్లో దాడులు చేస్తున్నారు. అడ్మిషన్లు, ట్యూషన్ ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. లావాదేవీల సాఫ్ట్‌వేర్‌ను ఐటీ అధికారులు పరిశీలించారు. శ్రీచైతన్య కాలేజీల ట్యాక్స్ చెల్లింపులపై ఐటీ ఆరా తీస్తోంది. 2020లోనూ శ్రీచైతన్య కాలేజీలపై ఐటీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. గతంలోనూ రూ.11 కోట్లు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. దేశవ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్యాలయాలపై ఐటీ అధికారులు దాడులు చేపట్టారు. విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తూ పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై సహా పలు ప్రాంతాల్లోని శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్పొరేట్ కార్యాలయాలపై ఒక్కసారిగా దాడులు చేపట్టారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తూ రశీదులు ఇవ్వకుండా పెద్దఎత్తున ట్యాక్స్ ఎగ్గొడుతున్నట్లు సోదాల్లో అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ముందుగా హైదరాబాద్ మాదాపూర్‌లోని ప్రధాన కార్యాలయంలో సోదాలు నిర్వహించిన అధికారులు అక్రమ లావాదేవీలు గుర్తించి నట్లు సమాచారం. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య కార్పొరేట్ కార్యాలయాలపై దాడులు చేశారు. ఈ సోదాల్లోనూ పెద్దమొత్తంలో అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు తెలుస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నేరుగా నగదు తీసుకునేందుకు ఒక సాఫ్ట్వేర్.. అలాగే ప్రభుత్వానికి కట్టే ట్యాక్స్ కోసం మరో సాఫ్ట్వేర్ ఏర్పాటు చేసుకున్నట్లు ఐటీ అధికారులు నిర్ధారించారు.

# మానవత్వమే అభిమతంగా మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ సేవలు


- గ్రామీణ ప్రాంత మస్జిద్‌ల ఇమాంలకు ఇఫ్తార్ సామాగ్రి
- ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ వెల్లడి
- హీర ఫౌండేషన్ ద్వారా 120 గ్రామాల మస్జిద్ల ఇమాం లకు పండుగ బట్టలు..30 మారుమూల పల్లెల్లో ఇఫ్తార్ సామాగ్రి పంపిణీ



కరీంనగర్, మార్చి 11 (జనంసాక్షి) : మానవత్వమే అభిమతంగా మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇస్లామిక్ సాంప్రదాయ విద్యను అందించడానికి, సేవలందిస్తుందని మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్ట్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం నగరంలోని రేకుర్తి శేఖాన్ నగర్ లోని మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్లో జిల్లాలోని మారుమూల 120 పల్లెల్లో, గ్రామాల్లో (పస్మాద్ద ఇలాఖా) మస్జిద్లలో పని చేస్తున్న ఇమామ్లకు కుటుంబ సమేతంగా నూతన బట్టలు హీర ఫౌండేషన్ ద్వారా అందించమన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మస్జిద్ ఇమామ్ లకు బియ్యం, వంట సామాగ్రితో పాటు 30 గ్రామాల్లో, మారుమూల పల్లెల్లో నివసించే పేద ముస్లింలను దృష్టిలో పెట్టుకుని ఇఫ్తార్ విందు కోసం పండ్లు, ఖారా, డ్రైఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ మారుమూల ప్రాంతాల్లో పేదలు ఇఫ్తార్ విందులు చేసుకోవడం కష్ట తరమని భావించి ఈ బృహత్తర యజ్ఞం మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గత 25 సంవత్సరాలుగా శ్రీకారం చుట్టిందన్నారు. పవిత్ర రంజాన్ మాసం దాన, ధర్మలా మాసమని, ధనికులపై పేదలకు హక్కు కల్పించిన ధర్మం ఇస్లాం మాత్రమే నన్నారు. ఈనెలలో ఉపవాస దీక్షలు పాటించే ఏవ్యక్తి కైనా మంచి నీళ్లు మొదలు పండ్లు, డ్రైఫ్రూట్స్, వంట సామగ్రి రూపంలో సాయం అందించే వారికి సైతం ఉపవాస దీక్షలు పాటించినంత పుణ్యం లభిస్తుందని మహనీయ మహమ్మద్ ప్రవక్త సల్లం సెలవిచ్చారని చెప్పారు. ఏటా రంజాన్ మాసం సందర్భంగా, గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న మస్జిద్ ఇమాంలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హీర ఫౌండేషన్ కరీంనగర్ ఈబృహత్తర కార్యక్రమాన్ని దాతల సహకారంతో చేపట్టడం, తమకు ఈ పుణ్య కార్యంలో బాగస్వామ్యులు చేయడం సంతోషాదాయకమన్నారు. హీర ఫౌండేషన్ ద్వారా కరీంనగర్ నగర మున్సిపల్ డివిజన్లతో పాటు ఉమ్మడి జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పల్లెల్లో సుమారు1400 కుటుంబాల్లో రంజాన్ వంట సామాగ్రి కిట్లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. హీర ఫౌండేషన్ కరీంనగర్, మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు కరీంనగర్ శాఖలకు పెద్ద ఎత్తున జకాత్, సదాత్, అతియా, ఫిత్రాల రూపంలో విరాళాలు అందించి మారుమూల ప్రాంతాల్లో నివసించే పేదలకు సాయం అందించే యజ్ఞం లో బాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 9346355306ను సంప్రదించాలని కోరారు. ఈకార్యక్రమంలో హాఫిజ్ అహ్మద్ నియాజీ, హాఫిజ్ ఫరీదోద్దీన్, కలీం షరీఫ్, ముఖరం, రాఫె, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో రోడ్డెక్కిన ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు

- మార్కెట్ ధరలకూ భూ పరిహారం చెల్లించాలని డిమాండ్
- నేషనల్ హైవే అథారిటీ కార్యాలయం ముందు ధర్నా







హైదరాబాద్, మార్చి 11 (జనంసాక్షి) : ట్రిపుల్ ఆర్‌లో భూములు కల్పోతున్న బాధితులు హైదరాబాద్‌లో రోడ్డెక్కారు. తమను రోడ్డున పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆర్ఆర్ఆర్ బాధితులు ఆందోళనకు దిగారు. భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలంటూ బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రిజినల్ ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు. చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ విలువ రూ.5 కోట్లకు పైగా ఉంటే ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే చెల్లిస్తోందని...తమ భూములకు మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడేళ్ళ నుంచి న్యాయం చేయాలని అన్ని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించు కోవడం లేదని ఆర్ఆర్ఆర్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీల మధ్యలో నుంచి కాకుండా ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. వరంగల్ హైవే కోసం, కాళేశ్వరం కాలువల నిర్మాణానికి, ఎలక్ట్రిసిటీ హైటెన్షన్ టవర్స్ కోసం, యాదగిరి గుట్ట రోడ్డు అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే తమ భూములు తీసుకుందన్నారు. అభివృద్ధి పేరుతో మళ్లీ తమ భూములను లాక్కుంటే వ్యవసాయం ఎలా చేసుకోవాలని..ఎలా బతకాలని ప్రశ్నించారు. భూముల కోల్పోతున్న బాధిత రైతులకు ప్రత్యామ్నాయం చూపి..సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ట్రిపుల్ ఆర్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా ప్రభుత్వం ట్రిపుల్ నార్త్ పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే దీనికి సంబంధించిన భూసేకరణ పూర్తయింది.

161.518 కిలోమీటర్ల( ట్రిపుల్ ఆర్ నార్త్) రోడ్డును రూ.7104.06 కోట్లతో నిర్మిస్తున్నారు.1వ ప్యాకేజీ: గిర్మాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు 34.518 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ. 1529.19 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు మెయింటెనెన్స్ చేయాలి. 2వ ప్యాకేజీ: రెడ్డిపల్లి నుంచి ఇస్లాంపూర్ వరకు 26 కిలోమీటర్ల 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1114.80 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మెయింటెనెన్స్ చేయాలి.3వ ప్యాకేజీ: ఇస్లాంపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు 23 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1184.81 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి. 4వ ప్యాకేజీ: ప్రజ్ఞాపూర్ నుంచి రాయగిరి వరకు 43 కిలోమీటర్లు నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని 1728.22 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మెయింటెనెన్స్ చేయాలి. 5వ ప్యాకేజీ: రాయగిరి నుంచి తంగడ్ పల్లి వరకు 35 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1547.04 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి ఈ క్రమంలో ఇప్పటికిపి భూసేకరణ మొదలయ్యింది. తమకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని రైతులు హెచ్చరించారు.

# గంజాయిని పట్టుకున్న పోలీసులు



మహదేవపూర్, మార్చి 11 (జనంసాక్షి) : అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మహదేవపూర్ పోలీసులు పట్టుకోని ఆ వ్యక్తిని భూపాలపల్లి కోర్టుకు హాజరుపరిచి రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం తన సిబ్బందితో కలిసి బొమ్మపూర్ క్రాస్ రోడ్డు వద్ద పోట్రోలింగ్ నిర్వహిస్తుండడంతో అనుమానాస్పదంగా నెంబర్ ప్లేట్ లేని ఒక వ్యక్తి బైక్ పై వస్తుండగా తనిఖీ చేయగా అతని దగ్గర గంజాయి కవర్ దొరికిందనిఅన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మహదేవపూర్ గ్రామానికి చెందిన షేక్ లుక్మన్. మహారాష్ట్ర హైరి తాలూకా ఆలాపల్లి గ్రామంలోని మామాజి అనే వ్యక్తి వద్దనుండి 625 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి మహదేవపూర్ కు తీసుకువచ్చి తనకు పరిచయం ఉన్న దగ్గరవ్యక్తులకు అమ్ముకోవడం జరుగుతుందని అతను తెలిపినట్లుఅన్నారు. విచారణ అనంతరం పోలీస్ స్టేషన్లో గంజాయితోపాటు బైక్ ను సీజ్ చేసి ఆ వ్యక్తిని భూపాల్ పల్లి కోర్టు ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

# మొక్కజొన్న రైతులకు న్యాయం చేయండి

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కు వినతిపత్రం అందజేసిన రైతులు...
- విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించిన గవర్నర్..



ములుగు ప్రతినిధి, మార్చి 11(జనంసాక్షి) : ప్రభుత్వం, అధికారులు తమ విధులు సరిగా నిర్వర్తించక పోవడం కారణంగానే అనుమతులు లేని విదేశీ విత్తన కంపెనీలు అన్నదాతలను మోసం చేస్తున్నారని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి అన్నారు. మంగళవారం నర్సింహా మూర్తి మొక్కజొన్న రైతులతో పాటు వెళ్లి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను కొండపర్తి గ్రామంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బహుళ జాతి విదేశీ విత్తన మొక్కజొన్న కంపెనీలు మారు మూల ఏజెన్సీ గ్రామాలను ఎంచుకొని రైతుల చేత గుట్టు చప్పుడు కాకుండా సాగు చేపిస్తున్నారని గవర్నర్ కు తెలిపారు. గుడవర్తి నర్సింహా మూర్తి, మన్యం సురేష్, దనపనేని నాగరాజు, తన్నీరు రాంబాబు లు ఆర్గనైజర్లు గా వ్యవహరిస్తూ కంపెనీలను ఏజెన్సీ ప్రాంతానికి తీసుకొచ్చి రైతులను కోట్ల రూపాయల మేరకు మోసం చేస్తున్నారని రైతులు అన్నారు. అధిక దిగుబడులు వస్తాయని, ధరలు అధికంగా ఇస్తామని ఒప్పంద వ్యవసాయం అని మోసం చేస్తున్నారని వివరించారు. పంట నష్టం జరిగిన రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఆర్గనైజర్లు, కంపెనీలు ముందుకు రావడం లేదన్నారు. రైతులకు ఒప్పంద వ్యవసాయం అని చెప్పి ఎటువంటి ఒప్పంద పత్రాలు ఇవ్వలేదని రైతులు గవర్నర్ ముందు వాపోయారు. కంపెనీ టన్నుకు కల్పించే మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదన్నారు. నష్టపరిహారం ఇవ్వమని ఆర్గనైజర్లను అడిగితే అప్పులు కట్టమని బెదిరిస్తున్నట్లు గవర్నర్ దృష్టి కి తీసుకెళ్లారు. ముందుగా ఆర్గనైజర్ల పైన క్రిమినల్ కేసులు పెట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు రైతులు తెలిపారు. మొక్కజొన్న చేనులో పని చేసిన కూలీలకు, కంకులు తిన్న రైతులకు పక్షవాతం వచ్చి మంచం పట్టినారని అన్నారు. జన్యు మార్పిడి విత్తనాల సాగు చేస్తూ ఉన్నట్టు రైతులు అనుమానం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ చేపట్టి రైతులను మోసం చేసిన మొక్కజొన్న కంపెనీల పైన, సంబంధిత ఆర్గనైజర్ల పైన కఠిన చర్యలు తీసుకోవాలని గవర్నర్ కలెక్టర్ దివాకర టిఎస్ కు సూచించారు. సమస్య సత్వరమే పరిష్కారం అవుతుందని, రైతులకు న్యాయం జరుగుతుందని గవర్నర్ హామీ ఇచ్చారని రైతులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాయం రాంబాబు, నాగుల ప్రవీణ్, లేకం మధు, మిచ్చా ధన, అట్టం సారయ్య, మిచ్చా వెంకట రమణ తదితర రైతులు పాల్గొన్నారు.

# భారత్‌ను ట్రంప్ ఇన్సల్ట్ చేస్తున్నడు




భారత్‌ను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదేపదే అవమానిస్తున్నాడు. భారత్ సహనాన్ని పరీక్షి స్తున్నాడు. భారతదేశం ముసుగు తొలగిస్తానని పేర్కొన్నాడు. వైట్ హౌస్ లో కూర్చుని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడు! భారతదేశ టారిఫ్ ను పెంచుతామని, వారు తమ కు సుంకం తగ్గిస్తామని చెప్పినట్లు అన్నాడు! ఒకవైపు అమెరికాలో అక్రమంగా ఉంటున్న ఇండియన్స్ పేరిట మనవాళ్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడు! కాళ్లకు చేతులకు గొలుసులు బేడీలు వేసి ఇండియాకు పంపిస్తున్నాడు! ఇంతకన్నా అవమానం ఇంకేముంటుంది. మరోవైపు టారిఫ్ ట్రేడ్ అగ్రిమెంట్లు కావలసి ఉందని ఇంకా ఏమీ ఫైనల్ కాలేదని మనవాళ్లు అంటున్నారు.

**అరబ్ దేశాలు తిరగబడుతున్నాయి**

మరోవైపు ఇతర దేశాలకు సంబంధించిన ప్రధానులు అధ్యక్షులు ఆయా దేశాల విషయంలో ట్రంప్ మాట్లాడుతున్న అభ్యంతరకర మాటలపై, విషయాలపై వెంట వెంటనే స్పందిస్తున్నారు ట్రంప్ కు వ్యతిరేకంగా ఒకటి అవుతున్నారు. అరబ్ దేశాలు అన్నీ ఒక్కటి అయ్యాయి!అంతెందుకు గత 2024 నవంబర్ 8న మన బాబా రాందేవ్ ట్రంప్ ను సనాతన వ్యక్తి అని సనాతన సమర్థుడని రకరకాలుగా అతన్ని పొగిడిన సందర్భం ఉండ ఉన్నప్పటికీ ,ఇప్పుడు తాజాగా ట్రంప్ పై రాందేవ్ కూడా ధ్వజమెత్తుతున్నాడు! ఇండియా గురించి పంపు తప్పుగా మాట్లాడుతున్నాడని పేర్కొంటున్నాడు! టారిఫ్ టెర్రరిజం సృష్టిస్తున్నాడని ప్రజాస్వామ్యం పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నాడని ,ఆర్థిక టెర్రరిజం ను తెస్తున్నాడని రాందేవ్ మాట్లాడడం విశేషం! చైనా, రష్యా , కెనడా తదితర దేశాలకు సంబంధించి కూడా రాందేవ్ వ్యాఖ్యలు చేయడం విశేషం.

**విదేశాంగ మంత్రి స్పందన లేదు**

మన విదేశాంగ మంత్రి జయశంకర్ అటు అమెరికా పర్యటనలో మరోవైపు కెనడా పర్యటనలో ఉన్న సందర్భంగా కూడా ట్రంపు భారతదేశం గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు! అయినా కనీసం ట్విట్టర్ లోను ఆ మంత్రి స్పందన లేదు. అక్కడ ఆయన ఉదయం వాకింగ్ ఫోటోలు పెట్టుకుంటున్నాడు! ఇక మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెద్దపులితో ఆడుకుంటున్నాడు! పెద్ద పులి పిల్లలకు పాలు తాగించే దృశ్యాలు కనిపిస్తున్నాయి! కానీ ఎక్కడ కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అభ్యంతరకర మాటలను కనీసం ఆయన ఖండించింది! లేదు మాట్లాడింది లేదు! చిన్న చిన్న విషయాలకు దేశంలో స్పందించడం మాట్లాడడం విమర్శలు చేయడం,చేసే బిజెపి శ్రేణులు కూడా కనీసం ట్రంపు మాటలపై స్పందించడం లేదు.

**రాందేవ్‌కు ఉన్న చొరవ లేదు**

రాందేవ్ ఎప్పటి మాటలు అప్పుడు ఎక్కడి మాటలు అక్కడ మాట్లాడే వ్యక్తి అయినప్పటికీ, ట్రంప్ భారతదేశంలో మాట్లాడుతున్న అభ్యంతరకర మాటలకు కనీసం స్పందించాడు! బిజెపికి పూర్తిస్థాయి సమర్థకుడైన రాందేవ్ ట్రంపు విషయంలో మాట్లాడిన మాటలు ఒక రకంగా బిజెపి శ్రేణులను జాగృతం చేసినట్లుగానే పేర్కొనవచ్చు! ఒకవైపు చైనా, రష్యా, కెనడా భారతదేశాలన్నీ అమెరికా వ్యవహారం పట్ల ఏమా త్రం రాజీధోరణి లో లేవు. సై అంటే సై అనే విధంగా కాలు దిగుతూనే ఉన్నారు ట్రంప్ కు సమాధానం ఇస్తూనే ఉన్నారు. భారతదేశ మార్కెట్ను పూర్తిగా తన ఆధీనంలో పెట్టుకోవాలని భావిస్తున్న అమెరికా వ్యవహారం మనదేశంలోని రైతాంగాన్ని కూడా నష్టాలకు గురి చేసే పరిస్థితి ఉంటుంది. ఎందుకంటే అమెరికాలో రైతులకు ఉన్న ప్రోత్సాహం ప్రభుత్వ సపోర్టు భారతదేశంలో ప్రభుత్వం మన రైతులకు ఇవ్వడం లేదు. మన వద్ద ఇంకా పంటకు కనీస ధర కోసం రైతులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. విషయం జగమెరిగిన సత్యం.

**అమెరికా విధానాలపై క్లారిటీ ఇవ్వాలి**

ఈ నేపథ్యంలో అమెరికా విధానాలు మన దేశంలోని ఉత్పత్తి, ఉత్పాదక కేంద్రాల మీద కూడా ప్రభావం పడుతుంది. మన వాళ్ళు అమెరికా విధానాల పైన క్లారిటీ ఇవ్వాలి!దిగుమతి సుంకం తగ్గించుకోవడం వల్ల భారతదేశానికి చాలా నష్టం కలుగుతుంది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ విషయంలో పదేపదే ఇండియా నుంచి ఎగుమతి అయ్యే సామాగ్రికి సంబంధించి టారిఫ్ పెంచడం జరుగుతుందని బాహాటంగా పేర్కొంటున్నారు. ఈ పరిస్థితి నుంచి భారతదేశం ను కాపాడుకోవాలి. అమెరికా కెనడా ఇలా అనుబంధం 150 ఏళ్ల క్రితం ది అయినప్పటికీ తాము ఎన్నటికీ అమెరికా దేశం భాగస్వామ్యం గా ఉండేది లేదని తమకు అమెరికా గౌరవం ఇవ్వాల్సిందేనని, చాలా స్పష్టంగా కెనడా పేర్కొనడం జరిగింది. అదే లైన్ మీద ఆ దేశం ఉన్నది. ఇటీవలనే ఒకానొక సమయంలో కెనడాను తమ 51 రాష్ట్రంగా తీసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్న విషయం విధితమే! అమెరికా మీద చైనా కూడా టారిఫ్ పెట్టేసింది. కెనడా కూడా పెట్టేస్తుంది.

**మోడీజీ స్పందించాలి**

భారతదేశం ఇప్పటికైనా ట్రంపు దూకుడు మాటలు దేశాన్ని అవమానించే మాటలపై స్పందించాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడాలి. మనకు గౌరవం ఇవ్వడం లేదు. చాలా చులకన భావంతో ట్రంప్ మాట్లాడుతున్నారు. మోడీజీ కుచ్తో బోలో.. నోరు తెరవండి. మాట్లాడండి. దేశం పరేషాన్ లో ఉంది. మోడీజీ మీ మౌనం మంచిది కాదు. మాట్లాడాలి. కనీసం మేము ఎవరికీ భయపడేది లేదని పేర్కొనాలి. దేశం మీ సమాధానం కోసం ఎదురు చూస్తున్నది.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

## వలస పక్షులు

కాలం కలిసిరాకపోతే
కొన్ని జీవితాలకు వెలుగు వుండదు
ఇరుకైన గూడులో ఒదిగి వుండలేక
కరుకైన మాటలతో కుదురు లేక
కొన్ని జీవనాలకు జీవం పోయింది
ఎండాకాలం ఎడకాలం ఒకటైనాక
కరువు కోరలు చాచిన కాలంతో
తగువులాడే సమయం వచ్చింది
వలస పక్షులమై బతుకు మార్గంలో
ఎగిరిపోవాల్సిన తరుణమొచ్చింది
ఎండిన పేగుల్ని మెడలో వేసుకుని
బిడ్డా పాపల్ని చంకలో పెట్టుకొని
ఎండిన నేలపైన అడుగులు వేస్తూ
పట్నం దారి పట్టే పరిస్థితి ఎదురైంది
ఎండిన పంటల్ని ఓదార్చి
బీడు నేలకు ధైర్యం చెప్పి
పిచ్చి మొక్కల దాడి నుంచి తప్పుకుని
వలసెళ్ళుతున్న కాలమొచ్చింది
దళారుల దండయాత్రలో
ఓడిపోయిన పంటను అక్కున చేర్చి
అనావృష్టి ఆవేశానికి బలైపోయిన
చిగురు మొక్కల కన్నీళ్ళను తుడిచి
గిట్టుబాటు గ్రహపాటైనాక
అలసిపోయిన దేహాలను కదుపుతూ
వలసెళ్ళిపోయే కర్మ కాలికి తగిలింది
పుక్కిట పెట్టే వక్కపొడి తిత్తి పక్కనెట్టి
మూడుకాళ్ళు మంచం సరిచేసి
ముదుసలి ప్రాణాలను ఆడనే ఒగ్గేసి
కాళ్ళీడ్డే కలికాలం ముందుకొచ్చింది
ఎండిన గొంతును సవరించుకుంటూ
ఏకరువు రాగాన్ని ఆలపిస్తూ
వలసెళ్ళే రోజు ముంగిట్లోకొచ్చింది
ఎండమావుల ఎదురు దాడిలో
మాడిపోయిన ముఖాలను దాచుకుంటూ
చితికిపోయిన బతుకుల్ని మోసుకుంటూ
సగటు పాదం వలస దారి పట్టింది

జనంసాక్షి

నరెద్దుల రాజారెడ్డి, సెల్ : 9666016636

# స్క్రీన్ వ్యసనం

## పిల్లల భవిష్యత్తుకు ప్రమాద సూచిక



ప్రస్తుత డిజిటల్ యుగంలో, స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు, టీవీలు పిల్లల రోజువారీ జీవితంలో అనివార్యంగా మారాయి. అయితే, ఈ పరికరాల అధిక వినియోగం పిల్లల ఆరోగ్యం, అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావాలను చూపుతుంది.

**స్క్రీన్ సమయం, మెదడు అభివృద్ధి**

తాజా అధ్యయనాలు అధిక స్క్రీన్ సమయం పిల్లల మెదడు అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సూచిస్తున్నాయి. ఉదాహరణకు, స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల పిల్లల ఆరోగ్యానికి చాలా హానికరమని, ఇది 'వర్చువల్ ఆటిజం' ప్రమాదాన్ని పెంచుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

**స్క్రీన్ సమయం, మానసిక ఆరోగ్యం :**

2018లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం రోజుకు 7 గంటల కంటే ఎక్కువ స్క్రీన్ టైమ్ ఉన్న పిల్లల్లో మెదడు కార్టెక్స్ మందగించడం కనిపించింది. ఇది ఆలోచన, నిర్ణయాలు తీసుకోవడం, సృజనాత్మకత వంటి నైపుణ్యాలను ప్రభావితం చేస్తుంది. దీర్ఘకాలికంగా, ఇది మానసిక ఒత్తిడి, ఆత్మహత్యా ఆలోచనలు పెరుగుదలకు దారి తీస్తుంది. అధిక స్క్రీన్ సమయం, ముఖ్యంగా సోషల్ మీడియా వినియోగం, పిల్లల్లో ఆందోళన, ఒత్తిడి, ఒంటరితనం వంటి మానసిక ఆరోగ్య సమస్యలను పెంచుతుంది. భారతదేశంలో, 18–24 సంవత్సరాల వయస్సు గల వారిలో డిజిటల్ వ్యసనం మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడం, అధిక ఆత్మహత్య ధోరణులు మరియు నిద్రలేమి వంటి సమస్యలతో ముడిపడి ఉంది. 2019లో జామా పీడియాట్రిక్స్ జరిపిన అధ్యయనం ప్రకారం : 2–5 సంవత్సరాల పిల్లల్లో అధిక స్క్రీన్ టైమ్ కారణంగా తక్కువ మేధస్సు అభివృద్ధి, దృష్టి శక్తి తగ్గుదల కనిపించింది. టీనేజర్లలో ఎక్కువ స్క్రీన్ వినియోగం డిప్రెషన్, ఆందోళన, ఒంటరితనం పెరుగుదలకు దారి తీస్తుంది. సోషల్ మీడియా ఎక్కువ వాడకం ఆత్మహత్యా ఆలోచనలు పెరుగుదలకు కారణమవుతుంది.

**స్క్రీన్ సమయం, నిద్ర సమస్యలు**

పడుకునే ముందు స్క్రీన్ వినియోగం మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని తగ్గించి, నిద్రలో ఆటంకాలు కలిగిస్తుంది. దీని ఫలితంగా అలసట, ఒత్తిడి, దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. 2020లో టొరంటో విశ్వవిద్యాలయం నిర్వహించిన అధ్యయనం ప్రకారం పడుకునే ముందు స్క్రీన్ వాడకం మెలటోనిన్ స్థాయిలను తగ్గిస్తుంది. ఇది నిద్రలో ఆటంకం, అలసట, ఒత్తిడి పెరుగుదలకు దారి తీస్తుంది. దీర్ఘకాలంలో, ఇది ఆరోగ్య సమస్యలు (ఉదా: హై బీపీ, ఊబకాయం) వచ్చే అవకాశం ఉంటుంది.

జనంసాక్షి

**పిల్లల్లో స్క్రీన్ వ్యసనం లక్షణాలు**

– సోషల్ మీడియా లేకుండా అసహనం
–ఆన్‌లైన్ గేమ్స్ ఆడకపోతే చిరాకు, డిప్రెషన్
– స్క్రీన్ లేకుండా ఉండలేకపోవడం
– చదువుపై దృష్టి తగ్గడం, మార్కులు పడిపోవడం

**తల్లిదండ్రులకు సూచనలు**

1. స్క్రీన్ సమయం పరిమితం చేయండి : 5 ఏళ్లలోపు పిల్లలకు రోజుకు 1 గంట, టీనేజ్‌లో 2 గంటలకు మించకుండా స్క్రీన్ సమయం నియంత్రించండి.
2.ప్రత్యామ్నాయ కార్యకలాపాలు ప్రోత్సహించండి : బహిరంగ ఆటలు, పుస్తకాలు చదవడం, సృజనాత్మక హాబీలు ప్రోత్సహించండి.
3. నిద్రపూట స్క్రీన్ వినియోగం తగ్గించండిలి: పడుకునే ముందు కనీసం 1 గంట ముందే స్క్రీన్ వినియోగాన్ని ఆపండి.
4. మీరు ఆదర్శంగా ఉండండి : తల్లిదండ్రులు స్వయంగా ఫోన్ వినియోగాన్ని తగ్గించి, పిల్లలకు ఆదర్శంగా ఉండండి. పిల్లల స్క్రీన్ వినియోగంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల భవిష్యత్తు మెరుగు పరచడానికి, వారి ఆరోగ్యం, అభివృద్ధి కోసం సమయానుకూల చర్యలు తీసుకోవడం అత్యవసరం.

కొలను వెంకటేశ్వర రెడ్డి

# ప్రేమ చిన్న కథేం కాదు...

ఉదయం 5 గంటల సమయం రోజు లాగానే వాకిలివుడ్చి ముగ్గు పెట్టి ఇంట్లోకి వచ్చింది కాత్యాయని. గొంతులో కొంచెం కాఫీ పోసుకొని త్వరగా ఇంటి పని అంతా ముగించి ఆఫీసుకు బయలుదేరింది ఆర్టీసీ బస్సులు తోపులాటలతో మనసులో కూతురు పెల్లి గురించిన ఆలోచనలతో ఆఫీసుకు చేరుకుంది పక్క సీటు సీత “”మేడం గుడ్ మార్నింగ్”” అనే పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చింది కాత్యాయని “”గుడ్ మార్నింగ్ “”అని పరిష్కారం తెలిపి తన టేబుల్ పైన ఫైల్స్‌లో మునిగిపోయింది.

కాత్యాయని శంకర శాస్త్రి మంచి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు వారి గారాలపట్టి వైదేహి బీటెక్ ముగించుకొని ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. అమ్మాయికి తగిన వరుణ్ణి చూసి సాంప్రదాయ బద్ధంగా వివాహం జరపాలని ఆ దంపతుల ఆశ ,కానీ వైదేహి మాత్రం ఎందుకో పెళ్లి ప్రస్తావన చేయగానే నిశ్శబ్దంగా మారిపోతూ ఆ ప్రస్తావనను ముందుకు కొనసాగించడం ఇష్టం లేనట్లు ప్రవర్తిస్తుంది ,ఇలా రెండు మూడు సార్లు జరిగిన కాత్యాయని, శంకర శాస్త్రిలు ఆదివారం పూట కుమార్తెతో మాట్లాడాలి అని నిశ్చయించుకున్నారు ,దానిలో భాగంగా నిన్నటి ఆదివారం వైదేహి తో మాట్లాడారు. ఇన్ని రోజులు తల్లిదండ్రులకు తన ప్రేమ గురించి ఏమి చెప్పాలో ఎలా చెప్పాలో అర్థం కాక తలలో తానే సతమతమవుతున్న వైదేహి కి కాస్త ధైర్యం వచ్చింది...” అమ్మ నాన్న మీరు నిష్టగా సంప్రదాయం పాటిస్తూ అటు స్నేహితులను ఇటు బంధువులను అనుసరిస్తూ చక్కని గౌరవం పొందారు ,నేను ఒకరిని ప్రేమిస్తున్నానని అతనిది మరొక కులం అని తెలిస్తే ఎలా అర్థం చేసుకుంటారు తెలియక ఇన్నాళు ఏమి చెప్పలేకపోయాను ,మిమ్మల్ని ఎంతగా ప్రేమిస్తూ గౌరవిస్తాను విగ్నేష్ ని కూడా అంతగానే ప్రేమిస్తున్నాను. నాకు జీవితమంటే మీరు ముగ్గురే ,,అన్ని మనం అనుకున్నట్లుగానే అయిపోవు, మీకు ఈ పె ల్లి చేయడం ఇష్టం లేకపోతే ఏమీ బాధపడొద్దు మీతో మీ కూతురిగానే ఇక్కడే ఉండిపోతాను ,దానికి కూడా సిద్ధమే ,,నాన్న నువ్వు నా భద్రత ,క్షేమం ఎంతలా కోరుకుంటావో అదే పద్ధతిలో విగ్నేష్ నా గురించి ఆలోచిస్తాడు, అందుకే అతను అంటే ఇష్టం ఏర్పడింది”” అంది వైదేహి.

సోమవారం యధామాములుగానే ముగ్గురూ కూడా వారి వారి ఆఫీసులకు బయలుదేరారు ,సాయంత్రం ఆఫీసు నుండి ఇల్లు చేరుకున్న శంకర శాస్త్రి కాత్యాయణులకు, ఒకే సమస్య కూతురి ప్రేమను అంగీకరించాలా? లేక తనను వారి బంధువుల్లోనే ఒక మంచి అబ్బాయికి ఇచ్చి పెళ్లి చేయాలా? “కులాంతర వివాహం అంటేనిత్యనుష్టానం చేసే మీ నాన్నగారు అమ్మగారు ఒప్పుకుంటారా? మీ అన్నదమ్ములకు దగ్గర బంధువులకు ఏమని చెప్పి ఒప్పిస్తాం ?ఇదంతా జరిగే పనేనా “అంది కాత్యాయని ,”అందరికీ ఈ సమ్మతం కాదు నేను కూడా అర్థం చేసుకోగలను ,అయితే వైదేహి నిర్ణయం విన్నాక మరోసారి ఆలోచించాలి అనుకున్న కాత్యాయని “అన్నారు శంకర శాస్త్రి. “ఒక్కసారి ఆలోచించు మనం ఎంతమందిని చూడటం లేదుఇలా కులాంతర వివాహం చేసుకొని నేరుగా వచ్చి తల్లిదండ్రులకు కాళ్ళ మీద పడి ఆశీర్వదించమని అడగటం లేదు. కొంతకాలం క్రితం మా ఆఫీస్ క్లర్క్ సుబ్బారావు గారి అబ్బాయి అదే పని చేస్తే ఆయనకు ఏకంగా గుండెపోటు వచ్చింది కోలుకోవటానికి కూడా చాలా సమయం పట్టింది,, అమ్మాయి మన అనుమతి లేకపోతే ఇలానే ఉండిపోతాను అంటుంది ,అందుకే మరో మరోసారి ఆలోచించు కాత్యాయని” అన్నారు శంకర శాస్త్రి .”నాకైతే ఏ మాత్రం ఇష్టం లేదు ,తల్లి పెంపకం బాగాలేదని అందరూ నన్నే ఆడిపోసుకుంటారు, మనవాళ్లంతా వద్దంది””””అంది కాత్యాయని.. అలా ఇంట్లో నిశ్శబ్దం... కొన్ని వారాలు గడిచాయి ,చివరగా శంకర శాస్త్రి గారు వైదేహి ప్రేమను కాత్యాయనిని కూడా ఒప్పించి ,విగ్నేష్ వాళ్ళ అమ్మానాన్న లతో మాట్లాడారు. ఇరువురు కుటుంబాల్లోనూ ఎన్నో చర్చలు జరిగాక అందరి అంగీకారంతో వివాహం నిశ్చయమైంది ,వైదేహి విగ్నేష్ లకు పిల్లల ప్రేమ విషయంలో అందరూ తల్లిదండ్రులు ఎన్నో రకాలుగా ఆలోచించి ముందడుగు వేస్తూ పిల్లలకే ప్రాధాన్యత ఇస్తున్నారు, వారి ఇష్టాలు అభిరుచులు ఉన్నత శిఖరాల్లో ఉంటున్నాయి ,తల్లిదండ్రులే ఎక్కువగా సర్దుకుపోతూ పిల్లల కళ్ళల్లో తమ కలల్ని పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. ఘనంగా వైదేహి విగ్నేష్ ల పెళ్లి జరిగింది, 7 నెలల చర్చకు ,చర్చలు అనంతరం ఏడడుగుల బంధం ఏర్పడింది మీరు కుటుంబాల పెద్దలు తమపై ఉంచిన నమ్మకాన్ని వారి గుండెల్లో నింపుకొని వారి దీవెనలతో జీవితం సాఫీగా కొనసాగుతుందనే దృఢవిశ్వాసంతో ముందుకు సాగారు విగ్నేష్ వైదేహి..




వారి ప్రేమ కథ చిన్నది ఏం కాదు అస్సలు బాధ్యతాయుతమైన ప్రేమ ఇప్పుడే మొదలైంది వారి ఇద్దరిదీ ప్రేమ కాదు కదా! తల్లిదండ్రులు ,బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగువారు అందరి ప్రేమ ఆశీర్వాదాలు వీరి ప్రేమను బలపరిచాయి కదా !అందుకే ఈ ప్రేమను బలంగా నిలుపుకునేలా నేటితరం చేస్తున్న పొరపాట్లు వేరు చేయకుండా వారి జీవనం కొనసాగిస్తారని ఆశిస్తూ వారి అడుగులు ముందుకు కదిలాయి.

రచన
కుమ్ముదవల్లి

# చారిత్రక నిజాల వక్రీకరణ కోసమేనా 'చావా'..?

సినిమాల్లో చరిత్రను కేవలం కోపం, అసహ్యం, ద్వేషాన్ని రెచ్చగొట్టే సాధనంగా మారిస్తే, అది చరిత్రను పూర్తిస్థాయిలో అర్థం చేసుకోవడానికి వీలు లేకుండా చేస్తుంది. 'చావా' సినిమాలో హిందూ–ముస్లిం, భారతీయులు–విదేశీయుల మధ్య ద్వేష భావాన్ని పెంచే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది.

**'చావా' సినిమా చరిత్రను పాతర పెట్టే లక్ష్యమే..**

సమర్థ వీరుడిగా, పరిపాలనా దక్షుడిగా సంభాజి చరిత్రను సమర్థించాలనే లక్ష్యంతో ఈ చిత్రం రూపొందించి నప్పటికీ, అది హిందూ–ముస్లిం భేదాన్ని మరింతగా పెంచేగా... జాతీయ స్థాయిలో రాజకీయ ప్రాపగాండా సినిమా గా మారింది. గతంలో ఇదే లక్ష్యంతో తీసిన 'ది కాశ్మీర్ ఫైల్స్', 'ది కేరళ స్టోరీ', 'ఆర్టికల్ 370', 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్' వంటి అనేక ప్రాపగండా సినిమాల సరసన 'చావా' కూడా చేరిపోయింది. ప్రధానమంత్రితో సహా పలువురు మంత్రులు ఈ చిత్రాన్ని సమర్థించడమే కాకుండా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పన్ను మాఫీ కూడా చేసి ఈ సినిమా లాభాల బాటలో నడవడానికి సహకరించారు.

**హిందూ–ముస్లిం విభజన**

చావా సినిమాలో ముస్లిం పాలకుడైన ఔరంగజేబ్‌ను పూర్తిగా క్రూరుడిగా చిత్రీకరించేందుకు, చారిత్రక సత్యాలను విస్మరించి చరిత్రకు “మసిపూసి మారేడు కాయను చేయటం” జరిగింది. అంతకు మంచి ఈ సినిమాకు వేరే లక్ష్యం లేనట్టుగా ఉంది. ఔరంగజేబు హిందూ రాజపుత్రుల మద్దతుతో అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆయన పాలనలో మొఘల్ చరిత్రలోనే అత్యధిక సంఖ్యలో హిందూ మున్సబ్‌దార్లు (33 శాతం) ఉన్నారు. అలాగే, ఆయన కొన్ని ఆలయాలను కూల్చివేసినా, మరికొన్ని ఆలయాలను రక్షించారు. (ఆవిషయాన్ని చూపించి లేదు.) ఔరంగజేబ్‌ను పూర్తిగా మతతత్వవాదిగా చిత్రీకరించడమే కాకుండా, ఆయన పాలనలో షియా, మహదవీ, దావూదీ బోహ్రా, సూఫీల వంటి ముస్లిం వర్గాలే ఎక్కువగా బాధలు ఎదుర్కొన్నాయని చరిత్రకారులు స్పష్టం చేస్తున్నారు. అయితే, ఈ సంక్లిష్టతకు 'చావా' చిత్రంలో ఏమాత్రం స్థానం లేదు.

**చరిత్రలోని నిగూఢతకు చోటులేకపోవడం**

'చావా' చిత్రం చూపించిన 17వ శతాబ్దం వాస్తవానికి ఎన్నో సామ్రాజ్యాల మధ్య సంబంధాలు, కొత్తగా ఎదుగుతున్న యూరోపియన్ శక్తులతో కూడిన కాలం. ఆ కాలంలో జంజీరా సిద్దీలు (ఆఫ్రికా ముస్లింలు) ప్రబలమైన తీరప్రాంత శక్తిగా ఉండగా, 26 ఏళ్ల పాటు అహ్మద్‌నగర్ సుల్తానేట్‌కి పీష్వాగా ఈథియోపియన్ దేశస్థుడైన 'మాలిక్ అంబర్ ఉన్నాడు. శివాజీ తన తండ్రితో కలిసి బీజాపూర్ ఆదిల్ షాహీల పాలనలో ఉండేవారు. సంభాజీ కూడా హిందూ రాజులతో మాత్రమే కాకుండా, ముస్లిం సుల్తాన్ నేతలతో చేతులు కలిపారు. ఆయన మైసూరు చిక్కదేవరాజుతో పోరాడారు. 'చావా' చిత్రంలో ఈ వివరణకు సంబంధించిన ప్రస్తావన ఎంత మాత్రం చూపించ లేదు.

**వివాదాస్పద సత్యాలను దాచి వేసిన చిత్రం**

ఈ చిత్రంలో కేవలం ఔరంగజేబ్ దుష్టత్వాన్ని ముద్ర వేయడానికి మాత్రమే ప్రయత్నించినట్లు కథను అల్లారు.అంతే కానీ, సంభాజీ తన తండ్రి శివాజీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడమే కాకుండా,




కొంతకాలం ఔరంగజేబ్ పక్షాన చేరారు అనే చారిత్రాత్మక నిజాన్ని దాచిపెట్టారు. అలాగే, హిందూ రాజులైన కర్ణాటక నాయకులతో కూడా సంభాజీ యుద్ధాలు చేశారు. చరిత్రలో వివిధ సామ్రాజ్యాలు అధికారాన్ని సంపాదించడానికి చేసిన అనేక హింసాత్మక విధానాలను గమనిస్తే, 'చావా' లో చూపించిన మధ్య యుగపు క్రూరత్వం కొత్తదేమీ కాదు. మరాఠా సామ్రాజ్యం కూడా అనేక ఇతర హిందూ (ముస్లిం) భూస్వాములను (దేశ్ముఖ్‌లు, జాగీర్దార్లు)ను హింసించి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నాయి.ఇక్కడ పరిపాలకుని (రాజు) దృష్టి రాజ్యాధికారాన్ని సంపాదించడం, దాన్ని విస్తరింప జేయడం, పరిపాలన చేజార కుండా చూసుకోవడమే ఏరాజు లక్ష్యమైన. అంతేకానీ మతంతో సంబంధం లేదు.తన రాజ్యాధికారానికి ముప్పు వస్తే తన–పర బేధం ఏ పాలకుడూ చూపాడు.

(ఆవిషయాన్ని కూడా ఈ సినిమాలో కావాలనే చూపించ లేదనే విషయం చరిత్రను చదువుకున్న తరానికి తెలుసు. ఈ సినిమా నిర్మాతలు లక్ష్యం ఉద్యోగాల వేటలో ఉపాధి దొరికే సైన్స్, టెక్నాలజీ చదువుకున్న నేటి తరం యువతకు మనం దేశ చరిత్ర తెలియదు. కనీసం వినోదం కోసం సినిమాలకు వెళ్ళే వారికి కూడా వక్రీకరించిన చరిత్రను చూపించి తమ రాజకీయ లక్ష్యాల కోసం ఒక వర్గం ప్రజలపై యువతీ, యువకుల్లో ద్వేషాన్ని నింపటానికే ఈ సినిమాను కూడా తీసినట్టు అర్థం మవుతుంది. గతంలో ఇలాంటి సినిమాలను ప్రభుత్వం పరోక్షంగా పన్ను రాయితీలు ఇచ్చి నిర్మాతలకు లాభాలు కలిగేలా చేయటంతో, వ్యాపార లక్షణాలు, లాభం దృష్టి కలవారికి చారిత్రక నిజాలతో పనేంటి? )

**కులాన్ని పూర్తిగా విస్మరించడం**

హిందూ–ముస్లిం భేదాన్ని చూపించే ప్రయత్నంలో, 'చావా' చిత్రం కులవ్యవస్థను పూర్తిగా విస్మరించింది. చరిత్రను పరిశీలిస్తే, హిందూ మరియు ముస్లిం సామ్రాజ్యాల పాలనలో కిందిస్థాయి కులాలవారే అత్యధికంగా హింసకు గురయ్యారు. 1818లో జరిగిన కొరేగావ్ యుద్ధంలో ఈస్ట్ ఇండియా కంపెనీ తరఫున పోరాడిన దళిత మహర్లు, పేశ్వా నేతృత్వంలోని మరాఠా కూటమిని ఓడించడాన్ని అంబేద్కర్ కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రతీకగా భావించారు. ఒక ఆసక్తికరమైన విషయమేమిటంటే, గతంలో హిందుత్వ వాదులు సంభాజీని బలహీనుడిగా, నీతిగల పరిపాలకుడిగా చిత్రీకరించిన బ్రాహ్మణ వర్గాలే విచిత్రంగా ఆయనను 'మహనీయుడి' గా చూపించే ప్రయత్నం ఇప్పుడు చేస్తున్నారు. ఈ చిత్రం విడుదల తర్వాత మహారాష్ట్రలో మరాఠా–బ్రాహ్మణ విభేదాలు మళ్లీ చెలరేగుతున్నాయి. (ఇది కూడా ఒకందుకు మంచిదే. ఎందుకంటే హిందూ ఇజం పునాదులు కుల వ్యవస్థపై ఆధారపడి ఉంది.ఆ వ్యవస్థ ఏదో విధంగా నిమ్న వర్గాల చేతుల్లో కుప్పకూలడం మంచిదేగా. అసలు ఈ సినిమా నిర్మాతల రాజకీయ లక్ష్యం మెజార్టీ హిందువుల్లో ముస్లిం ప్రజల పట్ల ద్వేషాన్ని పెంచటం. అది మెజార్టీ అణగారిన కులాల వారి చేతుల్లో అల్ప సంఖ్యాక అగ్ర కులాలవారు అంతరించే దిశగా టర్న్ తీసుకోవడం ఈ చిత్ర నిర్మాతలు కానీ వారిని వెనుక ఉండి నడిపిస్తున్న అగ్రకుల , మెజార్టీ మతస్తుల రాజకీయ పార్టీ కానీ ఊహించి ఉండరు.)

**చారిత్రక వాస్తవాలను అపహాస్యం చేయడం**

చరిత్రను కేవలం ద్వేషం, రెచ్చగొట్టే సాధనంగా మార్చితే, అది సమగ్రమైన చారిత్రక అవగాహనను దెబ్బతీస్తుంది. 'చావా' వంటి సినిమాలు ప్రజలను భావోద్వేగ పరులను చేస్తూ, చరిత్రను వక్రీకరించి చూపించే ప్రమాదకర ధోరణికి ప్రతీకలుగా మారుతున్నాయి.ఇవి ప్రశాంత జీవితాలు గడిపే వారి మధ్య కుల,మతం విష బీజాలు నాటడమే.ఏదో రోజు ఈ కుల, మత, జాతి వైరాలు ఈ అగ్ర కుల మైనార్టీలు... మెజార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల చేతుల్లో అంతరించక తప్పదు. ఈ అల్ప సంఖ్యాక అగ్రకులాల వారికి నిప్పు రవ్వను రాజేయడమే తెలుసు.ఆ అగ్గిరాజుకుంటే ఎవరి ఇళ్ళు దహనం అవుతాయో ఊహించ లేరు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

# ఫోర్త్‌సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ప్రభుత్వం

- ప్రభుత్వం స్పందించకుంటే కార్యచరణను రూపొందిస్తాం
- ఫార్మా బాధిత గ్రామాల్లో 20, 21 తేదీల్లో సిపిఎం పాదయాత్ర
- జీపు జాత ద్వారా రైతులను ఏకం చేస్తాం
- స్థానిక ఎమ్మెల్యే ప్రజల పక్షాన ఉండాలి
- 21వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తాం
- ఫార్మసిటిపై సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలి
- కుర్మిద్ధలో ఫార్మాసిటీ బాధిత రైతులతో సిపిఎం సదస్సు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**యాచారం, మార్చి 11 (జనంసాక్షి) :** ఫార్మాసిటీ, ఫోర్త్ సిటీ, గ్రీన్ ఫీల్డ్ రకరకాల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం పేద రైతుల భూములను గుంజుకొని కార్పొరేటు శక్తులకు అప్పజెప్పే విధంగా కుట్రలు చేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని కుర్మిద్ధలో ఫార్మసిటీ బాధిత రైతులతో సిపిఎం సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జాన్ వెస్లీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో రైతులకు తక్కువ పరిహారం చెల్లించి వారిని మోసం చేసిందని, నాయకులు మాత్రం కోట్ల రూపాయలు దండుకున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని విస్మరించిందని ఆరోపించారు. ఫార్మా బాధిత రైతుల భూములను నిషేధిత జాబితాలో పెట్టి రాష్ట్ర ప్రభుత్వం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందని అన్నారు. ఫోర్త్ సిటీ పేరుతో వేలకోట్లు ఉన్న బడా బాబులు ఇక్కడ వ్యాపారం చేయడానికి వస్తే, ఈ ప్రాంతంలో వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేదలు ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాకు భూమినిచ్చిన రైతుల అభివృద్ధిని విస్మరించి నిబంధనలకు విరుద్ధంగా భూ సేకరణను జరుపుతుందని ఆరోపించారు. ఉన్న భూములను గుంజుకొని రైతులను కూలీలుగా మార్చే కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. ఫార్మాసిటీ కొరకు భూములు ఇచ్చిన ప్రతి రైతు కుటుంబానికి ప్రభుత్వం 500 గజాల నుంచి 800 గజాల ప్లాట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూ చట్టాన్ని అమలు చేసి రైతులందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయంతో పచ్చని పొలాలుగా వర్ధిల్లుతున్న ఈ ప్రాంతాన్ని విషతుల్యాన్ని నింపే విధంగా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములను ఎట్లా నిషేధిత జాబితాలో పెట్టిందో తేల్చుతామని హెచ్చరించారు. ప్రభుత్వం వారికి ఏ విధంగా రైతు భరోసా, రైతుబంధు, పంట లోన్లు ఇవ్వదో సంగతి చూస్తామని మండిపడ్డారు. ఫోర్త్ సిటీ పేరుతో రంగారెడ్డి జిల్లాలోని ఏడు మండలాలను, 70 గ్రామాలలో లక్షకు పైగా భూ సేకరణ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఈ ప్రాంత రైతులను కూలీలుగా మార్చే రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి రైతుల పక్షాన ఉండి వారికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**20, 21వ తేదీల్లో ఫార్మా గ్రామాల్లో సీపీఎం జీపు జాత**

ఫార్మాసిటీ బాధిత రైతుల సమస్యలపై ఈ నెల 20, 21వ తేదీల్లో సిపిఎం పార్టీ జీపు జాత చేపడుతుందని తెలిపారు. ఈ జీపు జాత ద్వారా కళాకారులతో రైతులను చైతన్యం చేసి సిపిఎం పోరాటాన్ని నడుపుతుందని చెప్పారు. దీనిలో భాగంగా రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతాంగాన్ని ఏకం చేస్తామని అన్నారు. ముందుగా రైతుల సమస్యలపై కలెక్టర్కు వినతి పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. కలెక్టర్ స్పందించి రైతులతో చర్చలు జరిపి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకుంటే ఈ పోరాటాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుతంగా ఫార్మాసిటీ బాధిత రైతుల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఈ కార్యక్రమాన్ని తీసుకుందని అన్నారు. 21వ తేదీన శాంతియుతంగా రైతులతో పాదయాత్రగా వెళ్లి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుబ్బాక రామచందర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు పి అంజయ్య, పార్టీ మండల కార్యవర్గ సభ్యులు పి బ్రహ్మయ్య, ఆలంపల్లి జంగయ్య, మండల కమిటీ సభ్యులు తావు నాయక్, పి వెంకటయ్య, దంతుక పెద్దయ్య, ముచ్చర్ల లాజర్, కావలి జగన్, విప్లవ కుమార్, ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ రైతులు కుందారపు నారాయణ, కనమోని గణేష్, మైపాల్ రెడ్డి, వినోద్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి అధిక రుణాలు మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 11 (జనం సాక్షి) :** ప్రాధాన్యత రంగాలైన అగ్రికల్చర్, ఎంఎస్ ఎం ఈ లకు త్వరితగతిన అధిక మొత్తంలో రుణాలు మంజూ౹ు చేసి నారాయణపేట జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన డీ సీ సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు.సమావేశంలో కన్వీనర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వార్షిక ప్రణాళిక 2024-25 డిసెంబర్ తో ముగిసిన త్రైమాసానికి 1984.54 కోట్ల తో త్రైమాసిక వృద్ధి అని, వార్షిక ప్రణాళికలో 60.62 శాతం అలాగే ఎస్ ఎం ఈ సెగ్మెంట్ కు సంబంధించి 123.06 కోట్లతో 48.80 శాతం ప్రగతి అని తెలిపారు.ప్రాధాన్యత రంగానికి 167 8.14 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఎల్‌బిసి ఏజీఎం శ్రీహరి, ప్రకాష్, ఆర్.బి.ఐ ఏజీఎం శ్రావ్య, నాబార్డ్ డీ డీ ఎం షణ్ముఖ చారి, ఎస్‌బిఐ ఏజీఎం అనిల్ కుమార్ తో పాటు వివిధ బ్యాంకుల ప్రతి నిధులు, జిల్లా అధికారులు పలు సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం నాబార్డు వారిచే పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ 2025-26 గాను 3,833.47 కోట్ల రుణ లక్ష్యంతో రూపొం దించిన పుస్తకాన్ని జిల్లా కలె క్టర్ చేతుల మీదుగా ఆవి ష్కరింపజేశారు.ఈ మొత్తం 2024-25 సంవత్సరం కంటే 25.23 శాతం అధికం కాగా, వ్యవ సాయ రంగానికి 34 70.93 కోట్లు, ఎం ఎస్ ఎం ఈ రంగానికి రూ.310.30 కోట్ల లక్ష్యాన్ని నిర్ధారించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యంగ్వార్, ట్రైని కలెక్టర్ గరిమా నరుల పాల్గొన్నారు.

# నిరుద్యోగులు సమయాన్ని వృథా చేసుకోవద్దు

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మార్చి 10 (జనంసాక్షి) :** నిరుద్యోగులు సమయాన్ని వృథా చేసుకోవద్దు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో మల్టి నేషనల్ కంపెనీ ఎంఎన్ సి మెగా జాబ్ మేళా మహిళల కార్యక్రమాన్ని ప్రారంభించిన చేవెళ్ల స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మహిళలు సమయాన్ని వృథా చేయకుండా వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం ఈ జాబ్ మేళాలో ఎంపికైన మహిళలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, తహశీల్దార్ కృష్ణయ్య, జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఎలుగంటీ మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల పిఎస్ఈఎస్ చైర్మన్ లు దేవర వెంకటరెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, శాబద్ దర్శన్, మండల ప్రెసిడెంట్ వీరేందర్ రెడ్డి, మల్గారి జనార్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ లు దావల్గారి గోపాల్ రెడ్డి, కేశారం శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, టిపిసిసి సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ పాండు యాదవ్, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, కంపెనీ సిబ్బంది మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములలో నిర్మాణాలు చేపడితే ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు పెడతాం




**శంషాబాద్, మార్చి 11 (జనంసాక్షి) :** శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 244 లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణకు గురైందని సమాచారం మేరకు ఎమ్మార్వో రవీందర్ దత్ ఆదేశాల అనుసారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణ తన సిబ్బందితో కలిసి సర్వే నెంబర్ 244 లో ఉన్న నిర్మాణాలను మంగళవారం తొలగించారు. సర్వే నెంబర్ 244 భూములలో ప్రభుత్వ బోర్డులను రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు చేపడితే ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు నమోదు చేస్తామని ఎమ్మార్వో రవీందర్ దత్ హెచ్చరించారు.

# అనుమానాస్పదంగా లా విద్యార్థి మృతి

- సింబియాసిస్ యూనివర్సిటీలో ఘటన



**నందిగామ, మార్చి 11 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మొదల్లగూడలో ఉన్న అంతర్జాతీయ విశ్వవిద్యాలయం సింబియాసిస్‌లో బిఎల్ఎల్‌బి మూడవ సంవత్సరం చదువుతున్న లా కళాశాల విద్యార్థి షగ్నిక్ బాసు(22) మృతి.. సోమవారం అర్ధరాత్రి సమయంలో బాత్రూం కి వెళ్ళిన విద్యార్థి ఎంతకీ బయటికి రాకపోవడంతో తోటి విద్యార్థులు వెంటిలేటర్ లోంచి గమనించగా కిందపడి ఉన్నాడు. వెంటనే కళాశాల సిబ్బందికి సమాచారం అందించారు. తలుపులు పగులగొట్టి బయటకు తీసి, చికిత్స నిమిత్తం శంషాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరిస్తే.. అక్కడి నుంచి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు ఇన్స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. మృతుని వివరాలు షగ్నిక్ బాసు వయసు (22) తండ్రి పార్థ బాసు ఘజియాబాద్ ఉత్తరప్రదేశ్ మృతుని తండ్రి పార్థ బాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు నందిగామ పోలీసులు తెలిపారు.

# జిల్లా జడ్జి వైఖరిని నిరసిస్తూ విధులు బహిష్కరించిన న్యాయవాదులు



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 11 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా జడ్జి అబ్దుల్ రఫి వైఖరిని నిరసిస్తూ మంగళవారం బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు.జిల్లా జడ్జి రఫీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని క్రమశిక్షణ రహితంగా క్లైంట్ లను,న్యాయవాదులను కించపరుస్తూన్నారని అందుకు నిరసనగా విధులు బహిష్కరించాలని వీధుల బహిష్కరణ బార్ అసోసియేషన్ అధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్,అసోసియేషన్ సభ్యులు తెలిపారు.జిల్లా జడ్జి వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోర్టు పోలియో జడ్జి మధుసూదన్ కు,రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నాగు రావునామాజీ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, కార్యదర్శి భీమ్రెడ్డి, న్యాయవాదులు రఘువీర్ యాదవ్, సీతారామారావు, సలీం, అమిరొద్దిన్, మల్లికార్జున్, సతీష్, మదన్, కూర్మన్న గౌడ్, విజయ భాస్కర్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

# రామలింగేశ్వర ఆలయంలో చోరీ కేసులో ఇద్దరునిందితుల అరెస్ట్

- చోరీ చేసిన సొమ్మును స్వాధీన పరుచుకున్న పోలీసులు



**కుత్బుల్లాపూర్, మార్చి 11 (జనం సాక్షి) :** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్ లోని రామలింగేశ్వర ఆలయంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన చోరీ కేసును 12 గంటలు గడవకముందే జీడిమెట్ల పోలీసులు చేదించారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు బాలానగర్ డిసిపి సురేష్ కుమార్, ఏసీబీ హనుమంతరావు లు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. డిసిపి సురేష్ కుమార్ తెలిపిన విరాల ప్రకారం గాంధీనగర్ లోని శివాలయంలో జరిగిన చోరీ ఛేదించడంలో సీసీటీవీ లు ఫుటేజ్ లు ఉపయోగపడ్డాయని తెలిపారు.సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తలుపులను బద్దలు కొట్టి ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించి నాగపడిగ, తొడుగు, దీపాలు, అయ్యప్ప ప్రతిమ, హారతి పళ్లెంతోపాటు పలు వస్తువులను నిందితులు దొంగలించారు. ఆలయ అధ్యక్షుడు వీర వెంకట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జీడిమెట్ల పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ ల ఆధారంగా జీడిమెట్ల సిఐ మల్లేష్ ఆధ్వర్యంలో డి ఎస్ ఐ కనకయ్య, ఎస్సైలు, కానిస్టేబులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఇద్దరు నిందితులను పట్టుకొని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి చోరీకి గురైన సొమ్మును స్వాధీన పరుచుకున్నారు. నిందితులు టోలిచౌకి, లంగర్ హౌస్ కు చెందిన ఇద్దరు పాత నేరస్తులుగా గుర్తించారు. నిందితులు గంజాయి సేవించి ఉన్నట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, మార్చి 11 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇళ్లను అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో నిర్మించేందుకు మేస్త్రీలు శిక్షణను సమర్థవంతంగా ఉపయోగించుకుని తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ సూచించారు. మంగళవారం పాత కలెక్టర్ కార్యాలయం వెనక నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ తో కలిసి నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని,మేస్త్రీలకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను అత్యుత్తమ నాణ్యతతో నిర్మించేందుకు, ప్రభుత్వం అందజేసే రూ.5 లక్షల నిధులతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు మేస్త్రీలకు శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ఇల్లు కట్టడంలో మేస్త్రీల ప్రాముఖ్యత చాలా ముఖ్యమని సూచించారు. తక్కువ ఖర్చుతో, ఉత్తమ నాణ్యతతో ఇళ్లు నిర్మించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ,ప్రతి మేస్త్రీ శిక్షణలో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వం ఈ ఆరు రోజుల శిక్షణలో పాల్గొనే ప్రతి మేస్త్రీకి రోజుకు రూ.300 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.శిక్షణ ద్వారా కొత్త నిర్మాణ పద్ధతులు, మెరుగైన సామగ్రి వినియోగం,భద్రతా ప్రమాణాలు వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. నేర్చుకున్న అంశాలను మీరు మాత్రమే కాకుండా ఇతర మేస్త్రీలకు కూడా తెలియజేయాలనీ అన్నారు. అధిక నాణ్యతతో ఇళ్లను నిర్మించేందుకు సహకరించాలని సూచించారు. అనంతరం మేస్త్రీలకు నిర్మాణానికి అవసరమైన టీ-షర్ట్స్,కిట్‌లను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వహించాలని మేస్త్రీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ భాస్కర్,డి.ఈ నరేందర్,ఎ.ఈ ప్రకాష్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అధికారి శివ శంకర్, మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

# కచ్చా లే అవుట్ ప్లాట్‌లను ఎవరు కొనుగోలు చేయవద్దు

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, మార్చి 11 (జనంసాక్షి) :** 2020 తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్ లు తీసుకున్నవారు జిల్లాలో 29 వేల మంది ఎల్.ఆర్.ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్నారని, వారి నుండి డబ్బులు వసూలు చేసి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఎల్.ఆర్.ఎస్ లే అవుట్ లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పై మంగళవారం ఉదయం కలక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ కమిషనర్లు, లైసెన్స్ టౌన్ ప్లానర్ లు, టౌన్ ప్లానింగ్ ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ ఎల్.ఆర్. ఎస్ పురోగతి పై సమీక్ష నిర్వహించారు.ఇప్పటికే జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల ద్వారా దాదాపు 25 వేల మందికి నోటీస్ లు జారీ చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో క్రమబద్ధీకరణ జరగటం లేదని ప్రశ్నించారులే అవుట్ లు చేసిన వారు, ఓనర్లు, రైటర్ లు, బిల్డర్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారితో వార్డు ఆఫీసర్ల ద్వారా ఫోన్ చేయించి డబ్బులు కట్టించే ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు.ఎల్.ఆర్.ఎస్ చేయించుకోకుంటే రేపటినాడు ఎప్పుడైనా ఎల్.ఆర్.ఎస్ ఆమోదం లేని ప్లాటు పై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూ పై ప్రో రేటా ఫీజు తో పాటు 14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని అదేవిధంగా లే అవుట్లు, ప్లాట్ల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మార్చి 31 నాటికి కచ్చా లే అవుట్ లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికిని చివరి నిమిషంలో సర్వర్ పనిచేయకుంటే లబ్ధిదారులు నష్టపోతారని అందువల్ల వెంటనే డబ్బులు కట్టి క్రనబద్ధికరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్.ఆర్.ఎస్ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎట్టి పరిస్థితిలోనూ ఎల్.ఆర్.ఎస్ లేని ప్లాట్లను ప్రజలు లోగోలు చేయవద్దని జిల్లా ప్రజలను సూచించారు. ఎల్.ఆర్.ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోడానికి అవకాశం ఉండదని అదేవిధంగా లే అవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్.ఆర్ ఎస్ ఉన్న ప్లాటు కు మంచి డిమాండు ఉంటుందని తెలియజేశారు.ఎల్.ఆర్.ఎస్.కు డబ్బులు కట్టిన ప్లాటు యజమానులకు కలక్టర్ క్రమబద్ధీకరణ ఉత్తర్వు కాపీలను అందజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్లు, లైసెన్స్ లేఔట్ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనపురం రైతుల జల హారతి

- కేసీఆర్, హరీశ్ రావుల ఫ్లెక్సీకి పాలాభిషేకం



**నంగునూరు, మార్చి 11 (జనం సాక్షి) :** రంగనాయక సాగర్ కుడి కాలువ ద్వారా గోదావరి జలాలు మోయ తుమ్మెద వాగు(అక్కెనపల్లి పెద్దవాగు)లోకి ప్రవహించి గణపురం చెక్ డ్యామ్ మత్తడి దూకి నంగునూరు, అక్కెనపల్లి చెక్ డ్యాంలలోకి ప్రవహిస్తుండడంతో రైతులు మంగళవారం జల హారతి కార్యక్రమం నిర్వహించారు. బీ ఆర్ ఎస్ నాయకులు కరెడ్ల లక్ష్మారెడ్డి, అల్లూరి విజయేందర్ రెడ్డి, అల్లూరి అనిల్ రెడ్డి, కలువల రాజు, చిటికెల శేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రఘుపతి రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో రైతులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుల ఫ్లెకీలతో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేసీఆర్, హరీశ్ రావు చిత్ర పటాలతో కూడిన ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రి తన్నీరు హరీశ్ రావుల కృషి వల్ల మోయ తుమ్మెద వాగులో చెక్ డ్యామ్ ల నిర్మాణం జరిగి భూగర్భ జలమట్టంపెరిగిందన్నారు. కేసీఆర్, హరీశ్ రావులు పట్టించుకోకపోతే ఈ ప్రాంతం ఏనాడో ఎడారిగా మారి రైతుల బతుకులు దుర్భరంగా తయారయ్యే పరిస్థితి ఉండేది అన్నారు. వారి కృషి వల్లనే ఒకప్పుడు కనీసం ఒక్క పంటను కూడా పండించుకోలేని పరిస్థితుల్లో ఉన్న తాము ప్రస్తుతం రెండు పంటలు సాగు చేస్తున్నామని తెలిపారు.

# డంపింగ్ యార్డ్‌కు పరిష్కారం ఏది..?

- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..
- మూడు రోజుల క్రితం డబ్బింగ్ యార్డ్‌కు నిప్పు
- అధికారులు కష్టపడుతున్న అదుపులోకి రాని మంటలు
- డంపింగ్ యార్డ్ దుర్వాసనతో ఆరోగ్యానికి ముప్పు
- ఎన్కెపల్లి గ్రామాల ప్రజలు ఆందోళన





**సదాశివపేట, మార్చి 11 (జనం సాక్షి) :** డంపింగ్ యార్డ్‌కు పరిష్కారం చూపాలని అధికారులను వేడుకున్న పట్టించుకోవడంలేదని ఎన్కెపల్లి గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. సదాశివపేట మండలంలోని ఎన్కెపల్లి గ్రామ శివారులో గల డంపింగ్ యార్డ్‌లో నిప్పు అంటుకుంది. గత మూడు రోజులుగా అగ్నిమాపక శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు రేయింబవల్లు కష్టపడుతున్న మంటలు అదుపులోకి రావడం లేదు. మంటలను అదుపులోకి తీసుకువచ్చిన, లోపల నిప్పు కనికలతో మళ్ళీ రాజుకుంటుంది. ఎకరాల మేర డంపింగ్ యార్డ్ లో మంటలు విస్తరించడంతో ప్రాంతమంతా పొగ కమ్ముకుంది. దీంతో ప్రమాదకరమైన విషవాయువులు గాలిలో కలుస్తున్నాయి. ఎన్కెపల్లి గ్రామాల ప్రజలు శ్వాస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రాణాలు పోతున్న పట్టించుకోరా..

గ్రామ ప్రజల ప్రాణాలు పోతున్న పట్టించుకోవడంలేదని ఎన్కెపల్లి గ్రామ ప్రజలు ఆవేదం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారు నుంచి డంపింగ్ యార్డ్‌ను తరలించాలని డిమాండ్ చాలా రోజుల నుండి వ్యక్తం చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆందోళనకు దిగారు. ఆందోళన చేసే సమయంలో డంపింగ్ యార్డ్ మారుస్తామని హామీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. తాజాగా జరిగిన అగ్ని ప్రమాదంతో మరోసారి డంపింగ్ యార్డ్ గ్రామ శివారు నుంచి తరలించాలని గ్రామ ప్రజలు ఆందోళన దిగారు. చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్న పట్టించుకోవడం లేదని, కాలుష్యం కాటేస్తున్న ప్రభుత్వానికి పట్టదా అని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి మున్సిపల్ కమిషనర్‌కు డంపింగ్ యార్డ్‌ను తరలించాలని వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్ మారుస్తామని అధికారులు మరోసారి హామీ ఇచ్చిన మాటమీద నిలబడతారో లేదు వేచి చూడాల్సి ఉంది.

## కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం బోల్తా

- 10 మంది కూలీలకు స్వల్పగాయాలు



**అయిజ/రాజోలి, మార్చి 11 (జనంసాక్షి) :** పొట్ట చేతపట్టుకొని బతుకుదెరువు కోసం వెళ్తున్న కూలీలపైనే విధి వెక్కిరించినట్టుగా బొలెరో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 10మందికి స్వల్ప గాయలయ్యాయి. అయిజ ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..రాజోలి మండలంలోని నసనూర్ గ్రామానికి చెందిన బొలెరో ఆటో రోజు మాదిరిగానే చిన్న ధన్వాడ, నసనూర్ గ్రామాల 36 మంది వ్యవసాయ కూలీలతో ఇటిక్యాల మండలంలోని శాతర్ల గ్రామానికి మిర్చి తోటలో కూలీ పనికి వెళ్లి వస్తున్న క్రమంలో మధ్యాహ్నం కిష్టపురం వద్ద సుమారు 36 మంది కూలీలతో కూడిన బొలొరో ఆటో అతివేగంతో బోల్తా పడడంతో కూలీలంతా చెల్లాచెదురుగా పడిపోయారు. విషయాన్ని స్థానికులు ఫోన్లొ 108కు సమాచారం అందించగా హుటాహుటిన వచ్చి గాయపడిన క్షతగాత్రులను గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్థ్యానికి మించి ఆటోలో కూలీలు ప్రయాణించడం వల్లే ఆటో అదుపు తప్పిందని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. కష్టజీవుల ప్రాణాలతో చెలగాటమాడే డ్రైవర్లపై ఇకనుంచి ఆటోలో పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

# జ్యోతిష్యం పేరుతో ఘరానా మోసం

- డబ్బులు వసూలు చేసిన యువకుడి అరెస్ట్



**చేర్యాల, మార్చి 11 (జనంసాక్షి) :** కమలాయపల్లి గ్రామానికి చెందిన ధర్మోజీ నారాయణ చారి అనే వ్యక్తి 2025 జనవరి నెలలో టీవీ చూస్తుండగా కింద జ్యోతిష్యం చెప్పబడును అని ఒక ఫోన్ నెంబర్ కింద స్క్రోలింగ్ రాగా.. ఆ స్క్రోలింగ్ గమనించినటువంటి నారాయణచారి తనకి ఇంట్లో ఇబ్బందులు ఉన్నాయని, మనశాంతి ఉండట్లేదని, ఇవన్నీ జ్యోతిషం చెప్పించుకుంటే పోతాయని నమ్మి ఆ నెంబరు కాల్ కాల్ చేయగానే నిందితుడు ఫోన్ లేపి మాట్లాడి పూజలు చేస్తా అంత మంచి జరుగుతది చెప్పగానే అది నమ్మిన బాధితుడు నిందితుడు చెప్పిన విధంగా మొదట యాభై వేల రూపాయలు అతని ఇచ్చిన అకౌంట్ కు డిపాజిట్ చేయడం జరిగింది. ఒక వారం రోజుల తర్వాత నిందితుడు ఫోన్ చేసి డబ్బులు సరిపోలేదు పూజ సగంలో ఉంది పూర్తి కావాలంటే ఇంకొక 50 వేల రూపాయలు కావాలంటే మిగతా యాభై వేలు కూడా పంపించిండు. మళ్ళీ ఇంకొక వారం రోజుల తర్వాత మళ్లీ ఫోన్ చేసి ఇంకా డబ్బులు కావాలి ఇంకా ఎక్కువ డబ్బులు కావాలి పూజ పూర్తిగా అవ్వాలని, లేకపోతే మీకు చెడు జరుగుతుంది అని చెప్పటంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసు వారు చేసే ప్రచారాన్ని గమనించి 1930 అనే నెంబర్ కాల్ చేసి నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్లో అతను రిపోర్టు చేయడం జరిగింది. నేషనల్ క్రైమ్ డిపార్ట్మెంట్ నుండి చేర్యాల సిఐ ఆఫీస్ కి సమాచారం రాగానే నారాయణ దగ్గర పిర్యాదు తీసుకొని సైబర్ క్రైమ్ ప్రకారంగా కేసు నమోదు చేసి పరిశోధన చేస్తుండగా, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా జాతకాల పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నానని ఒప్పుకున్నాడు. నేరస్థుని వద్ద ఉన్న సెల్ ఫోన్ సీజ్ చేసి నిందితుని వద్దనుండి బాధితుడికి లక్ష రూపాయలు రిఫండ్ చేసి,నిందితున్ని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపించారు. ప్రజలు ఎవరు యాడ్స్ చూసి మోసపోవద్దని, జ్యోతిష్యాల వల్ల మంచిగా అయితదనో, ఫోన్లో పూజలు చేస్తే అదృష్టం కలిసి వస్తుందని చెప్తే నమ్మొద్దు, ప్రజలందరూ అప్రమత్తంగా వుండాలని, ఇలాంటి మీకు ఎవరైనా చేస్తే 1930 నెంబర్ కు ఫోన్ చేసి సైబర్ క్రైమ్ లో రిపోర్ట్ చేయాల్సిందిగా చేర్యాల సిఐ శ్రీను తెలిపారు.

## అత్యాశకు వెళ్లి సైబర్ నేరస్తుల ప్రలోభానికి గురి కావొద్దు

- జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి రజని



**వనపర్తి క్రైమ్, మార్చి 11 (జనంసాక్షి) :** అత్యాశకు వెళ్లి సైబర్ నేరస్తుల ప్రలోభానికి గురి కావద్దని తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు అర్జించాలనే మన అత్యాశను సైబర్ నేరగాళ్లు లాభాలుగా మార్చుకుంటారని, అపరిచిత వెబ్సైట్లో లాగిన్ అయ్యి బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులను పోగొట్టుకోవద్దు ,చైన్ సిస్టం వంటి స్కాంలో మోసపోవద్దు అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి రజని అన్నారు. మంగళవారం వనపర్తి లోని ప్రధానమంత్రి కౌశల్ యోజన కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటున్న విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు జిల్లా న్యాయ సేవ సంస్థ పనితీరు గురించి ,ఏ విధముగా సంస్థ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలలో, విద్యార్థులలో చట్టాలపై అవగాహన కల్పిస్తుందో తెలియజేశారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశమైన చట్టాలను వివరించడంలో భాగంగా బాల్యవివాహాల చట్టం, పోక్సో యాక్ట్, మోటార్ వెహికల్ యాక్ట్, బాల కార్మికుల చట్టం గురించి తెలియజేశారు ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో కేంద్రం మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# పెబ్బేరు ఎస్సై ఆగడాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

- పేద ప్రజల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదు
- మార్నింగ్ వాక్ లో రాచాల యుగంధర్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు



**పెబ్బేరు, మార్చి 11 (జనం సాక్షి) :** గత ప్రభుత్వ హయంలో నిర్మించ తలపెట్టిన స్కూళ్ల భవన నిర్మాణాలు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయని, ఒకే గదిలో అన్ని క్లాసుల విద్యార్థులకు బోధన చేయడంతో వారి చదువులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని రాష్ట్ర బీసీ పొలిటికల్ జేఏసీ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పెబ్బేరు పురపాలక పరిధిలో నిర్వహించిన మార్నింగ్ వాక్ లో భాగంగా పలు సమస్యలపై మాట్లాడారు. గ్రామాలు, పట్టణాల్లో సమస్యలను తెలుసుకొనేందుకు చేపట్టిన మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆయన మంగళవారం పెబ్బేరు మున్సిపాలిటీలోని 5, 6 వార్డులలో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా కిష్టారెడ్డిపేట వేణుగోపాల స్వామి అలయం, చెలిమిల్లలోని ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం కిష్టారెడ్డిపేట స్కూలును పరిశీలించారు. ఒకే గదిలో 101 మందికి బోధిస్తుండటంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడును ఫోన్లో విచారించగా.. స్కూలు బిల్డింగ్ బిల్లులు రాక మధ్యలోనే ఆగడంతో తప్పని పరిస్థితుల్లో అందరినీ ఒకే దగ్గర కూర్చోబెట్టి బోధిస్తున్నామని చెప్పారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అదేవిధంగా చెల్లిమిల్ల ప్రైమరీ స్కూల్ ప్రేయర్ సమయంలో విజిట్ చేయగా అక్కడ ఇద్దరు టీచర్లు హాజరుకాకపోవడంపై ఆరా తీయగా హెచ్ఎం కింది స్థాయి టీచర్లను కాపాడే విధంగా సమాధానం చెప్పారని అన్నారు. అదేవిధంగా స్కూలు బిల్డింగ్ ను పరిశీలించి కొద్దిసేపు విద్యార్థులతో మాట్లాడారు. బిల్డింగ్ అసంపూర్తి నిర్మాణం గురించి ఎమ్మెల్యేకు వివరిస్తామని చెప్పారు. అక్కడి నుంచి 6వ వార్డులోని గాంధీనగర్లో పర్యటించి అక్కడి కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీలో సీసీ రోడ్లు వేయడం సంతోషించాల్సిన విషయమే అయినా డ్రైనేజీ లేక పోవడంతో వర్షాకాలం నీళ్లన్నీ ఇళ్లముందు ఆగి ఇబ్బందులు పడుతున్నామని చెప్పగా గత ప్రభుత్వ హయాంలో అన్నీ సగం సగం పనులే జరిగాయని తమ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వినాయకనగర్ వద్ద ఉన్న డీలర్ షాపునకు వెళ్లి డీలర్‌తో మాట్లాడారు. పర్యటనలో చెలిమిల్ల గౌడ కులస్థులు రాచాలను కలిసి గ్రామంలో ఉన్న 6 గురు లైసెన్సుదారులు తమను కల్లు అమ్మనివ్వడంలేదని దీని శాశ్వత పరిష్కానికి కృషి చేయాలని కోరగా.. చెలిమిల్ల కల్లు మాముల పంచాయతీలో రాష్ట్ర కేబినెట్ పదవిలో ఉన్న ఒక నాయకుడు జోక్యం చేసుకున్నారని, కొన్నేళ్లుగా గౌడ కులస్థులు కల్లు అమ్ముకోకుండా జీవనాధారం కోల్పోతుంటే ఆయన మధ్యలో వచ్చి సమస్య పరిష్కారం కకుండా అడ్డుపడుతున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని చెప్పారు.

### పెబ్బేర్ ఎస్సై పై డీజీపీకి ఫిర్యాదు చేస్తా...

పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి ఆగడాలు రోజురోజుకు ఎక్కువయ్యాయని, ప్రతి దాంట్లో కలుగజేసుకొని తప్పు చేసిన వారికి కొమ్ము కాస్తూ వారిచ్చే డబ్బులకు ఆశపడి బాధితులకు నరకం చూపిస్తున్నారని ఫైర్ అయ్యారు. రాష్ట్ర డీజీపీకి ఎస్సై చిట్టా మొత్తం తీసుకెళ్లి ఆయనపై చర్యలు తీసుకునేదాకా తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామన్ గౌడ్, మాజీ సర్పంచ్ అక్కి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ రాచాలకు మద్దతు తెలిపి సన్మానించి, సర్వాయి పాపన్న చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజమాని వెంకటన్న గౌడ్, జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, నాయకులు రాఘవేందర్ గౌడ్, నరసింహ యాదవ్, మహిందర్ నాయుడు,దేవర శివ,నాగరాజు యాదవ్, తెలుగు నాగరాజు, సురేందర్, మ్యాదరి రాజు, చెలిమిల్ల రామన్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు,

## హజ్ యాత్ర కోసం ఆరోగ్య మార్గదర్శకాలు విడుదల



**ఖైరతాబాద్, మార్చి 11 (జనం సాక్షి) :** మెనింజిటిస్ అనేది మెదడు, మెదడు నుంచి వెనుక నరాల వరకు వ్యాపించే పరిరక్షణ పొరల్లో ఏర్ప డే ప్రాణాంతకమైన వాపు అని అంకురా హాస్పిటల్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ కన్సల్టెంట్ పీడియాట్రిషి యన్, నియోనాటాలజిస్ట్ డా.అంకుశ్ కొమ్మావార్ అన్నారు. హజ్ యాత్ర కోసం ముఖ్యమైన ఆరోగ్య మార్గదర్శకాలు విడుదల చేశారు. ఆయన మాట్లా డుతూ ఇది బాక్టీరియా, వైరస్, ఫంగస్ లేదా పరా న్న జీవుల వల్ల సంభవించవచ్చున్నారు. ముఖ్యంగా, నెయిస్సీరియా మెనింజిటిడిస్ అనే బాక్టీరియం కారణంగా వచ్చే మెనింజోకోకల్ మెనింజిటిస్ అ త్యంత ప్రమాదకరమైనదిగా పరిగణించబడుతుందన్నారు. ఇది అధికంగా జనసాంద్రత కలిగిన ప్రదే శాల్లో వేగంగా వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. మెనింజోకోకల్ మెనింజిటిస్ నివారణ కోసం మెనింజోకోకల్ టీకాను అందిస్తున్నారన్నారు. ఈ టీకా హజ్ వంటి భారీ జన సమూహాలు ఏర్పడే సందర్భాలలో తప్పనిసరి రక్షణగా పనిచేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి లక్షలాది మంది భక్తులు హజ్కు వెళ్లడం వల్ల వ్యాధి వ్యాప్తి అవకాశాలు పెరుగుతాయన్నారు. కాబట్టి, హజ్ యాత్రికులు తప్పనిసరిగా ఈ టీకా వేయించుకోవాలన్నారు. అందుకే, సౌదీ ఆరోగ్య మంత్రిత్వ శాఖ హజ్ యాత్రికులకు ఈ టీకా వేయించడం తప్పనిసరిగా అమలు చేయిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ ఆరోగ్య నియమాల ప్రకారం, రెండు సంవత్సరాలు పైబడి ఉన్న ప్రతి యాత్రికుడు ఈ టీకా వేయించుకోవాలన్నారు. ఈ టీకా మూడేళ్ల పాటు ప్రామాణికంగా ఉండగా, హజ్కు బయలుదే రే కనీసం 10 రోజుల ముందు టీకా వేయించుకోవడం అవసరం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని నాంపల్లి, మలక్పేట్, కింగ్ కోటి వంటి ప్రధాన ఆసుపత్రులను అధికారిక టీకా కేంద్రాలుగా గుర్తించిందన్నారు. అంతేకాకుండా, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) ఆధ్వర్యంలో ప్రత్యేక టీకా శిబిరాలు నిర్వహించి మరింత మందికి టీకా అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు.

## కలెక్టర్ చొరవతో ఎంఆర్ఎఫ్ కార్మికుల సమస్య పరిష్కారం

- ఎంఆర్ఎఫ్ యాజమాన్యం ట్రైనీ కార్మికుల మధ్య చర్చలు
- కాంట్రాక్టు కార్మికులుగా తీసుకోవడానికి అంగీకరించిన యాజమాన్యం
- గ్రాట్యూటీ చట్టం ప్రకారం గ్రాట్యూటీ డబ్బులు చెల్లించాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, మర్చి 11 (జనం సాక్షి) :** జిల్లాలోని సదాశివపేట లోగల ఎంఆర్ఎఫ్ కంపెనీ యాజమాన్యం కంపెనీలో పనిచేస్తున్న ట్రైయిని కార్మికుల మధ్య తలెత్తిన వివాదం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు జోక్యంతో జరిగిన చర్చలు ఫలించాయి. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తన కార్యాలయంలో ఎంఆర్ఎఫ్ ట్రైయిని కార్మికులు, కంపెనీ యజమాన్యంతో చర్చలు జరిపారు. ట్రైనీ కార్మికుల తమ ఇష్టా పూర్వకంగా కంపెనీలో పనిచేయదలుచుకుంటే వారిని కాంట్రాక్ట్ కార్మికులుగా తీసుకోవడానికి కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. సమాన పనికి సమాన వేతనం చట్టం ప్రకారం తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. వారి పనితీరు అర్హతలను బట్టి వారికి వేతనం రూ. 18 వేల నుండి రూ.24 వేల వరకు ఇవ్వడానికి కంపెనీ యజమాన్యం అంగీకరించింది. కాంట్రాక్టు కార్మికులుగా 10 సంవత్సరాలకు పైగా పనిచేసిన ట్రైనీ కార్మికులకు గతంలో యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు గ్రాట్యూటీ చట్టం ప్రకారం గ్రాట్యూటీ డబ్బులు చెల్లించాలని జిల్లా కలెక్టర్ యాజమాన్యంకు ఆదేశాలు జారి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప కార్మిక కమీషనర్ రవీంధర్ రెడ్డి , కార్మిక సంఘం ప్రతినిధులు ,తదితరులు పాల్గొన్నారు.

# పందుల దోపిడి కేసును చేధించిన పోలీసులు

- దోపిడీ కేసులో నలుగురి నిందితుల రిమాండ్
- ఒక బొలేరో వాహనం, 90 వేలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



**వనపర్తి క్రైమ్, మార్చి 11 (జనంసాక్షి) :** ఆత్మకూరు పట్టణంలోని పరమేశ్వర స్వామి చెరువు కట్ట దగ్గర ఉన్న పందుల షెడ్డుపై ఆకస్మికంగా దాడి చేసి పందుల దొంగతనానికి పాల్పడిన నిందితులను పోలీసులు చాకచక్యంగా గుర్తించి అదుపులోకి తీసుకోని అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ గిరిధర్ తెలిపారు. పరమేశ్వర స్వామి చెరువు కట్ట సమీపంలో నీటి వసతి ఉన్నందున చెన్నయ్య అనే వ్యక్తి సెడ్డు వేసుకొని 73 పందులను పెంచుకుంటున్నాడు. అ క్రమంలో ఫిబ్రవరి 16న ఆత్మకూరు లోని చెరువు కట్ట దగ్గర బ్రిడ్జి కింద ఉన్న పందులను నేరస్తులు బింగిదొడ్డి అంజి(ఏ4), మాదిరే మహేష్ (ఏ8) నందవరం బాలరాజు(ఏ9) లు ముగ్గురు వచ్చి రెక్కి నిర్వహించారు. అక్కడ పందులు ఉన్నట్లు ఎరుకలి భీమన్న, కందేనతి సుంకన్నలకు సమాచారాన్ని చెరవేశారు. ఫిబ్రవరి 17న నేరస్తులు అందరు కలిసి పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకొన్నారు. ఎరుకలి సిద్దప్ప (ఏ1) తన బొలెరో వాహనం తీసుకొని సింధానూర్ లో బయలుదేరి మార్గమధ్యలో ఎరుకలి అంజి (ఏ2) ఎరుకలి నాగరాజు ఏ3ను ఎక్కించుకొని ఎమ్మిగనూర్‌కు వచ్చి అక్కడ ఎరుకలి భీమన్న, గుల్లి నాగరాజు, కందేనతి సుంకన్న, మదిరె మహేష్, హొలిగుంది అంజిలు ఫిబ్రవరి 17న అందరు కలిసి రాత్రి 01:10 గంటల సమయంలో ఆత్మకూరులోని పందుల షెడ్డు వద్దకు వచ్చి 30 పందులను బొలెరోలో ఎక్కిస్తుండగా పందుల అరుపులు విని పందుల వద్ద కాపలాగా ఉన్న ఇద్దరు వ్యక్తులు నిద్రలోనుండి లేచి ఎవరు మీరు మా పందుల వద్ద ఏం చేస్తున్నారు అని అరుస్తూ పందుల దగ్గరకు వస్తుండగా అప్పటికే బొలెరో బండిలో ఉన్న నేరస్తులు భీమ హొలిగొంది అంజి, సుంకన్న మదిరె మహేష్, సిరిగెరి నాగరాజు పందుల వద్దకు వస్తున్న ఇద్దరు వ్యక్తుల పైకి బొలెరో బండిలో వాళ్ళ వెంట తెచుకున్న గాజు సీసాలతో, రాళ్ళతో ఇద్దరి పైకి విసరగా ఇద్దరు వ్యక్తులకు కుడా బలమైన గాయాలు అయినాయి. వారి వద్ద ఉన్న సెల్ ఫోన్‌లను గుంజుకొని తీసుకొని పోతూ ఫోన్‌లను మార్గమధ్యలో జూరాల డ్యాంలో పడేసి పందులను తీసుకొని సిద్ధప్ప అందరిని ఎమ్మిగనూర్ నందు వదిలిపెట్టి సిద్ధప్ప (ఏ1) బెంగుళూరు వెళ్లి 90వేలకు పందులను అమ్ముకున్నాడు. ఇట్టి నేరస్తులు ఇంతకుముందు వనపర్తి జిల్లా ఏదుట్ల గ్రామం గోపాల్ పేట మండలం, దొడగుంటపల్లి గ్రామం పెద్దమందడి మండలంలో, గద్వాల జిల్లాలో అలంపూర్, శాంతినగర్, ఐజా, కర్నూల్ జిల్లలో మంత్రాలయం, ఎమ్మిగనూర్, నందవరం మాధవరం, కర్ణాటకలో బళ్ళారి, రాయచూర్, మస్కి, హుబ్లి, సిందనూర్ ఏరియాలలో పందుల దొంగతనం చేసినారు.

### నేరస్తులను పట్టుకున్న విధానం

ఎస్పీ వనపర్తి, డీఎస్పీ వనపర్తి పర్యవేక్షణలో ఆత్మకూరు సీఐ,శివకుమార్, అత్మకూరు ఎస్సై,నరేందర్, అమరచింత ఎస్సై,సురేష్, అధ్వర్యంలో సిబ్బంది భీమయ్య, సత్యనారాయణ గౌడ్, పురుషోత్తం, క్రాంతి, మరియు టెక్నికల్ టీం గోవిందు, మురళి ప్రత్యేక టీం లను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మార్చి 11 నాడు ఉదయం 10 గంటల సమయలంలో మళ్ళీ సిద్దప్ప (ఏ1) యొక్క బొలెరో తీసుకొని హొలిగుంది అంజి, సిరిగెరి నాగరాజు బింగిదొడ్డి అంజి అందరు కలుసుకొని దొంగతనం చేయడం కోసం అని అమరచింత వైపు వస్తుండగా మస్తీపూర్ దాటిన తరువాత చౌరస్తాలో పోలీస్ వారు వాహనాల తనిఖీ చేస్తుండగా వారిని గమనించి నేరస్తులు బొలెరో తిప్పుకొని పారిపోతుండగా పోలీసు వారు వారిని కొద్దిదూరం వెంబడించి పట్టుకొని ఇక్కడకు ఆత్మకూర్ సిఐ ఆఫీస్ దగ్గరకు పట్టుకొని వచ్చినారు. పోలీస్ వారు అట్టి నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి 1బొలెరో వాహనం 90వేల రూపాయలు, 3 సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనంలో చేసుకున్నారు. ఈ పత్రిక సమావేశంలో వనపర్తి డిసిఆర్బి డీఎస్పీ, అదనపు ఎస్పీ, ఉమామహేశ్వరరావు,ఆత్మకూరు సీఐ, శివకుమార్, ఆత్మకూరు ఎస్సై,నరేందర్, అమరచింత ఎస్సై, సురేష్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# భూపాలపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి రూ.200 కోట్లు మంజూరు



**భూపాలపల్లి, మార్చి 11 ( జనం సాక్షి ):**

పేద, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహిం చిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణ రావు మాట్లాడుతూ. .ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు లో భాగంగా మన భూపాలపల్లికి అవకాశం లభించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి రూ.200 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ, ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లుగా ఎమ్మెల్యే తెలిపారు . సుమారు 20 నుంచి 25 ఎకరా ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో అద్భుతమైన క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం రూ. 43,04,988 విలువైన కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్దిదారులకు భూపాలపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 43 మంది కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ లబ్దిదారులకు రూ.43,04,988/- విలువైన చెక్కులను అందజేశారు. అనంతరంజిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సార్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో భూపాలపల్లి పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అందులో భాగంగా మహిళలకు ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పీసీసీ సభ్యులు దుబ్బేట రమేష్ సినియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పేదింటి ఆడపిల్లలకు కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ**

**ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్**

**భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ**



# జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఢీ

**యువకుడి మృతి, మరో యువకుడికి తీవ్ర గాయాలు**

**నల్లబెల్లి, మార్చ్ 11 (జనంసాక్షి):**



కారు, ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో యువకుడు మృతి చెంది మరో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గుండ్లపాడ్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన మడుగుల రజిత శ్రీనివాస్ దంపతులకు కుమారుడు మడుగుల అజయ్ (22) తన స్నేహితుడు జొన్న అజయ్ తో కలిసి ద్విచక్ర వాహనంపై నారక్కపేట నుండి నల్లబెల్లి వైపు వెళ్తుండగా జాతీయ రహదారి గుండ్లపాడ్ స్టేజ్ వద్దకు రాగానే ఏపీ 23 జి 3666 నెంబర్ గల కారు అజాగ్రత్తగా అతివేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో మడుగుల అజయ్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా జన్ను అజయ్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రున్ని స్థానికులు చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. మృతిని తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. యువకుడి మృతితో నారక్క పేట గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి.

# ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచడం వల్లే పౌష్టికాహారం

**గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేసిన సుడా ఛైర్మన్**

**కరీంనగర్ బ్యూరో, మార్చి 11 (జనంసాక్షి)**



: నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే బలహీన వర్గాల సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులతో సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సహపంక్తి భోజనం చేశారు. ముందుగా వంటశాలలోని సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెస్ చార్జీలు పెంచడం వల్ల పౌష్టికాహారం అందించగలుగుచున్నామని గతంలో ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. భోజనం చేస్తూ విద్యార్థినులతో మెనూ పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని కాంట్రాక్టర్ సరఫరా చేసే సరుకులు నాణ్యతతో ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని నరేందర్ రెడ్డి సూచించారు. చిన్న చిన్న లోపాలు గుర్తించామని వాటన్నిటిని సరిచేసు కోవాలని ప్రభుత్వం నిర్ణయించిన మెనూను నాణ్యతతో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు మెండి చంద్రశేఖర్, మిరాజ్, జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, కుర్ర పోచయ్య, పెద్దిగారి తిరుపతి, కొట్టె ప్రభాకర్, కీర్తి కుమార్, అష్రఫ్ ఖురేషి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విజిబుల్ పోలిసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

**రాచకొండ సిపిని కలిసిన భువనగిరి జోన్ నూతన డిసిపి అక్షంశ్ యాదవ్**

**భువనగిరి కలెక్టరేట్, మార్చ్ 11 (జనం సాక్షి)**




జిల్లా నూతన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గా నియమితులైన అక్షాంశ్ యాదవ్ సిపి సుధీర్ బాబును కలిశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని యాదాద్రి భువనగిరి జోన్ నూతన డిసిపి గా నియమితులైన అక్షాంశ్ యాదవ్ కమిషనర్ సుధీర్ బాబును ఎల్ బి నగర్ క్యాంప్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భువనగిరి జోన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, నేర శాతం తగ్గింపు కు అన్ని రకాల చర్యలు చేపట్టాలని కమిషనర్ డిసిపి కి సూచించారు. విజిబుల్ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఆవుపై పెద్దపులి దాడిలో ఆవు మృతి

**కాటారం, మార్చి 11( జనం సాక్షి)**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తూ అధికారులను ముప్పు తిప్పలు పెడుతూ ఇబ్బందుల కు గురిచేస్తోంది. 20 రోజుల నుండి కాటారం, మహాదేవపూర్ మండలాల సరిహద్దు పరిసర ప్రాంతాలలో పెద్దపులి సంచరిస్తుండగా, తాజాగా మంగళవారం కాటారం మండలం రఘుపెల్లిలో ఆవుపై పెద్దపులి దాడి చేసిన సమాచారం సంచలనం కలిగించింది. కాటారం మండలం ప్రతాపగిరి, గంగారం, దామరకుంట, తదితర ప్రాంతాలతో పాటు, సమీప మహ దేవపూర్ సరిహద్దు ప్రాంతాల్లో సంచరించినట్లు కాటారం అటవీ క్షేత్రాధికారి జాడి స్వాతి విలేకరులకు తెలిపారు. సోమవారం సాయంత్రం రఘుపెల్లి శివారు అటవీ ప్రాంతంలో ఆవుపై పెద్దపులి దాడి చేసి నట్లు అనుమానిస్తున్నారు. ఆవు మృతి చెందింది. దీంతో మంగళవారం ఉదయం రైతులు, గ్రామస్తులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఆవు మృతి చెందగా మనుషులకు కూడా అపాయాన్ని తలపెట్టే అవకాశం ఉందని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

# పాలకుర్తి కీర్తిని ప్రపంచానికి చాటాలి

**జాతీయ స్థాయి కరాటేలో బంగారు పతకం సాధించడం గర్వకారణం**

**శ్రీ చైతన్యను అభినందించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**పాలకుర్తి, మార్చి 11 (జనంసాక్షి)**



చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటుతూ పాలకుర్తి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళ వారం పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే నివాస వసతిగృహంలో పాలకుర్తి మండలంలోని లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్చార్జ్ గూడ రవీందర్ కూతురు శ్రీ చైతన్య జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాన్ల ఝాన్సీ రెడ్డి తో కలిసి శ్రీ చైతన్యను అభినందించి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి క్రీడాకారులను ప్రోత్సహిం చేందుకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి శ్రీ చైతన్యకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు శ్రీ చైతన్యను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ శ్రీ చైతన్యకు తమ ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు, ఈ సన్మాన కార్యక్రమంలో లక్ష్మీనారాయణ పురం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మజ్జిగ కొమురయ్య, గూడ రవీందర్, పులి గణేష్, పన్నీరు వెంకన్న, కిషన్ నాయక్,ఉన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం ..



**వరంగల్ ప్రతినిధి, మార్చి11 ( జనం సాక్షి)**

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం గీసుగొండ మండలం కొనయమాకుల రైతు వేదికలో 15,16వ డివిజన్, గీసుగొండ మండలా లకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ ద్వారా ఆర్థిక సహాయం 1556మందికి 15 కోట్ల 57 లక్షల 78వేల 496 రూపాయలు,సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా 1173 మంది లబ్ధిదారులకు 3కోట్ల 68 లక్షల 61 వేల రూపాయలను,ఎల్ఓసి పథకం ద్వారా 69 మందికి 1 కోటి 33 లక్షల 91వేల రూపాయల విలువ గల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో పంపిణీ చేసామని అన్నారు.పేద ప్రజలకు అండగా కళ్యాణ లక్ష్మీ , షాదీ ముబారక్ , ముఖ్యమంత్రి సహాయనివి పథకాలు నిలుస్తున్నాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని,ఇది పేదల ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చిన్న కాళేశ్వర భూనిర్వాసితుల అభిప్రాయ సేకరణ

**కాటారం, మార్చి 11 (జనం సాక్షి )**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధిలోని పలు గ్రామాలలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ నిర్వాసితుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ నాగరాజు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం కాటారం మండలం జాదరావుపేటలో అభిప్రాయ సేకరణ బహిరంగ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ హాజరయ్యారు. కాగా ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు తగిన న్యాయం చేకూరుస్తామని, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సహాయ సహకారాలు అందిస్తామని సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్ పేర్కొన్నారు. కాలువల నిర్మాణానికి భూ నిర్వాసితులు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# మేడారం శ్రీ సమ్మక్క, సారలమ్మ



## వనదేవతలను దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్..

**ములుగు ప్రతినిధి, మార్చి 11(జనంసాక్షి)**

మంగళవారం శ్రీ సమ్మక్క, సారలమ్మ ములుగు జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ మేడారం సమ్మక్క – సారలమ్మ కు మొక్కులు, నిలువెత్తు బంగా రం సమర్పించి, అమ్మ వారిని దర్శించుకున్నారు, మంత్రి సీతక్క, శ్రీ సమ్మక్క సారలమ్మ ల ప్రాశస్త్యం గురించి గవర్నర్ కీ వివరించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో గవర్నర్ మాట్లాడుతూ, ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం కొండపర్తి, గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగిందని, గ్రామం తనను ఎంతగానో ప్రభావితం చేసిందని గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, పాఠశాల వాతావరణం అంతర్గత రోడ్లు నిర్మాణం అన్ని మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు.



ఆయన వెంట రాష్ట్ర పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ దివాకర టిఎస్, ఏటూరు నాగారం, ఐటీడీఏ పి ఓ చిత్ర మిశ్రా, ఎస్పీ శబరిష్, తదితరులున్నారు.

# భూపాలపల్లి కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



**భూపాలపల్లి, మార్చి 11 (జనం సాక్షి)**

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అద్వర్యం లో క్రీడలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాలతో క్రీడలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి హాజరయ్యారు. క్రీడలు మానసికంగా ఉత్సాహం కలిగిస్తాయని అదేవిధంగా శారీరకంగా కూడా ఉపయోగపడతాయని క్రీడలలో గెలుపు ఓటములు సహజమని తెలియజేశారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ ఓటమి చెందితే బాధపడొద్దని గెలుపు వస్తే ఉప్పొంగి పోవద్దని ప్రతి దానిలో గెలుపోటములు సహజమని , తెలియజేశారు . ఈ కార్యక్రమంలో సిడిపిఓ రాధిక గారు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ,అంగన్వాడీ టీచర్లు, కలెక్టరేట్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
12 మార్చి 2025

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో అవకాశం కల్పించాలి
- ప్రతి నెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్, అధికారులకు అభినందనలు తెలిపిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 11 (జనంసాక్షి) :** జిల్లాలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ భాదితులకి సత్వర న్యాయం జరిగేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో ఎస్సి, ఎస్టి అభివృద్ధి సంక్షేమ పథకాలపై తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు నీలాదేవి, శంకర్, రాంబాబు నాయక్, లక్ష్మి నారాయణతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ఎస్టీ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని అన్నారు.ఎస్సీ ఎస్టీ లకు సంబదించిన భూములపై కేసులు త్వరగా పరిష్కరించాలని అన్నారు. పీఎం అజయ్ పథకం కింద లబ్ధిదారులను త్వరగా ఎంపిక చేసి వారికి బోర్లు ద్వారా భూములకి సాగునీటి వసతి ఏర్పాటు చేయాలని అన్నారు.ఎస్సీ, ఎస్టీ వారికి ఎంప్లాయ్ మెంట్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ లలో అవకాశం కల్పించాలని సూచించారు.ఇటీవల పరువు హత్యకి గురైన మాల బంటి అలియాస్ కృష్ణ కేసు గురించి చైర్మన్ మాట్లాడుతూ పాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని, నిందుతులకి వెంటనే శిక్ష పడేలా చూడాలని,బాధితరాలైన భార్గవికి ఉద్యోగం, ఇల్లు, పెంక్షన్, భద్రత, వ్యవసాయ భూమి లాంటివి కల్పించాలని సూచించారు.ఇట్టి కేసు విషయంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చాలా మంచిగా పనిచేసి భార్గవికి వెంటనే ఆర్థిక సహాయం చేశారని, కేసులో పురోగతి తెస్తున్నారని తెలిపారు.ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత బంధు రాని అర్హులైన 8 కుటుంబాలకి వెంటనే అందేలా చూడాలని అన్నారు.పోలీస్ లు స్టేషన్ కి వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా కూర్చోబెట్టి మాట్లాడితే సగం కేసు పూర్తి అవుతుందని,ఎస్సి, ఎస్టి అట్రాసిటీ చట్టంపై అధికారులు ప్రజలకి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతినెల చివరి రోజున ఖచ్చితంగా పౌర హక్కుల దినోత్సవం జరిగేలా చూడాలని, హెడ్ కానిస్టేబుల్ ఆర్ఐల ద్వారా నిర్వహిస్తున్నారని అలా చేయకుండా తహసీల్దార్, ఎస్ఐలు పౌరహక్కుల దినోత్సవంకు హాజరై ప్రజలకి చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు.ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులను కేవలం వారి ప్రాంతాలలో మాత్రమే ఉపయోగించాలని సూచించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ జిల్లాలోని వివిధ శాఖలచే ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషన్ చైర్మన్‌కి వివరించారు. మాలబంటి అలియాస్ కృష్ణ కేసు వివరిస్తూ భార్గవి విద్య అర్హత మేరకు సర్టిఫికెట్ పరిశీలించి ఉద్యోగం కల్పిస్తామని, కేసారంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని, వారి ఇంటి వద్ద 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పోలీస్ భద్రత కల్పిస్తున్నామని తెలిపారు.అనంతరం కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 25 జిల్లాలలో సమావేశాలు నిర్వహించామని, ఇంత చక్కగా అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ మంచిగా ఎస్సి, ఎస్టి సంక్షేమంపై పిపిటి, బుక్ లెట్ తయారు చేసింది సూర్యాపేట జిల్లా కలెక్టర్ మాత్రమేనని అభినందిస్తూ ఇలాగే అధికారులు కష్టపడి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని తెలుపుతూ కలెక్టర్ ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ, ఏఎస్పి నాగేశ్వరావు, కమిషన్ సభ్యులు రాములు నాయక్, శంకర్, ఎస్సి అభివృద్ధి అధికారి లత, ఎస్టి అభివృద్ధి అధికారి శంకర్, ఎస్సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్, ఎల్డిఎం బాపూజీ, జీఏం సీతారాం నాయక్, డిఎస్పిలు, ఆర్డీఓలు, తహసీల్దార్లు,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సాంస్కృతిక విభాగంలో విద్యార్థినికి ప్రథమ బహుమతి



**మల్కాజిగిరి, మార్చి 11 (జనంసాక్షి) :** ఒరిస్సాలోని బరంపూర్‌లో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో మల్కాజిగిరి డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎన్ఎస్ఎస్ వాలంటీర్ శిరీష చక్కని ప్రతిభతో ప్రథమ బహుమతి పొందారు,ఈనెల 3 నుంచి 9 వరకు ఒరిస్సాలోని బరంపూర్ యూనివర్సిటీ వేదికగా ఎల్ ఎస్ ఎస్ క్యాంపులో వివిధ రాష్ట్రాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ మల్కాజిగిరి విద్యార్థిని శిరీషతోపాటు ఆరుగురు విద్యార్థుల బృందం రాష్ట్రం తరఫున శిబిరంలో భాగస్వాములయ్యారు, తెలంగాణ సాంస్కృతిని చాటుతూ బోనాలు బతుకమ్మ పోతురాజుల నృత్యాలు విన్యాసాలను ప్రదర్శించారు. సాంస్కృతిక విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బండి రాజు శిరీషను శాలువాలతో సత్కరించి అభినందించారు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అడవి రాజు మరియు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు శిరీషను అభినందించారు.

# దుర్గం చెరువు శుద్ధి నీటితో నిండిపోవాలి

- బల్దియా కమిషనర్ ఇలంబర్తి



**శేరిలింగంపల్లి, మార్చి 11 (జనంసాక్షి) :** హైదరాబాద్ మహానగరంలో చారిత్రక నేపథ్యాన్ని కలిగి ఉన్న దుర్గం చెరువు పూర్తిగా సిద్ధినీటితో నిండిపోవాలని, దశలవారీగా మురుగును తొలగించి పూర్తి మంచినీటి చెరువుగా మార్చాల్సిన అవసరం ఉందని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. నగరం పరిధిలో చెరువుల సుందరీకరణ ప్రక్రియలో భాగంగా మంగళవారం ఆయన శేర్లింగంపల్లి పరిధి దుర్గం చెరువును శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఐటి జోన్ కారిడార్ పరిధిలో అత్యంత కీలకమైన చెరువుగా బాసిల్లుతున్న దుర్గం చెరువును పూర్తిగా శుద్ధి చేసి మంచినీటితో కళకళలాడేలా మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. దుర్గం చెరువులో పరిశుభ్రమైన జలాలు నింపి ఆహ్లాదకరమైన పరిసరాలను నగర ప్రజానీకానికి అందించేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా చూసుకోవాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు.

# బోడుప్పల్‌లో కనుమరుగువుతున్న ప్రభుత్వ భూమి

- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ



**బోడుప్పల్, మార్చి 11 (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని ప్రభుత్వ భూమిని ఆక్రమణ చేసి నిర్మాణాలు కొనసాగిస్తున్నారని నగర బీఆర్ఎస్ పార్టీ ప్రదాన కార్యదర్శి మీసాల కృష్ణ అన్నారు.కార్పోరేషన్ పరిదిలోని సర్వేనంబర్ 63/1 నుండి 63/39 లలో గల ప్రభుత్వ భూమి కబ్జాలపై మంగళవారం గౌతమ్ నగర్ లో బీఆర్ఎస్ పార్టీ ప్రదాన కార్యదర్శి మీసాల,పన్నెండవ డివిజన్ ఇంచార్జ్ చంటి శ్రీనుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మీసాల కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పది సంవత్సరాలు ప్రభుత్వ భూములను పరిరక్షించి భవిష్యత్తు తరాలకు ఉండేలా చర్యలు తీసుకున్నామని,కానీ కాంగ్రెస్ అధికారం చేపట్టిన నుండి కబ్జాల పర్వం ఎక్కువైందని తెలిపారు.గత మూడు నెలల నుండి గౌతమ్ నగర్,అంబేద్కర్ నగర్ దేవేందర్ నగర్ కాలనీలలో వందల సంఖ్యలో నిర్మాణాలు చేపడుతున్నారని వీటిపై రెవిన్యూ అధికారులకు వందల సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోవడం లేదని వాపోయారు. మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ స్థానికుడే కాబట్టి ఆయనకు అన్ని విషయాలు తెలుసు కాబట్టి అధికారులకు తెలిపి అరికట్టాలని కోరారు.అనంతరం చంటి శ్రీను మాట్లాడుతూ పదుల సంఖ్యలో కబ్జాదారులు ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే వచ్చి తూతూ మంత్రంగా గేటును,ప్రహరీ గోడ కూల్చడం వెళ్లడం జరుగుతుంది. మరలా తెల్లారితే యాదవిదిగా ఇంటిని పూర్తచేసుకొని నివాసం ఉంటున్నారు. ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే మౌనం వహించడ తప్పా ఎలాంటి సమాదానం ఉండదని ఇదంత అదికార పార్టీ నాయకుల అండదండలతో నడుస్తుందని అన్నారు.విచిత్రం ఏందంటే రెండు రోజులలోనే ఇంటిని నిర్మించి అందులో నివాసం ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బోడగళ్ల సదానంద్,శ్రీకాంత్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

# భార్య కాపురానికి రావటం లేదని మనస్థాపం చెంది భర్త ఆత్మహత్య



**నర్సింగి, మార్చి 11 (జనంసాక్షి) :** భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగ్ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. నార్సింగ్ ఎస్సై అహ్మద్ మోహిఉద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం నార్సింగ్ పట్టణానికి చెందిన వట్టేపు స్వామి(32) చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన శిరీష తో గత మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం కలగలేదు. భార్య భర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవని గతంలో పెద్దలు సక్షంలో పంచాయతీ నిర్వహించి శిరీషను అత్తవారింటికి నార్సింగి తీసుకువచ్చారు. ఇటీవల అన్న మృతి చెందాడని వడియారం పుట్టింటికి వెళ్ళిన శిరీష 20 రోజులైనా భార్య రాలేదని, మనస్థాపం చెందిన స్వామి ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ ద్వారా తన తమ్ముడి శ్రీకాంత్ కు సమాచారం ఇచ్చాడు, అమ్మ నాన్న జాగ్రత్త అని చెప్పాడని, విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నార్సింగ్ మండలం వల్లూరు అడవి ప్రాంతంకు వెళ్లి చూసేసరికి చెట్టుకు ఊరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు స్వామిని నార్సింగ్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే స్వామి మృతి చెందినట్లు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# అతివేగంతో విద్యుత్‌స్తంభం ఢీకొని ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



**రాజేంద్రనగర్, మార్చి 11 (జనం సాక్షి) :** అతివేగం, నిర్లక్ష్యం తో కారు నడుపుతూ ఇంజనీరింగ్ విద్యార్థి విద్యుత్ స్తంభం ఢీకొని దుర్మరణం చెందాడు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరిగింది. నార్సింగ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గండిపేట మండలం నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంజీఐటీ కళాశాలకు చెందిన 6గురు విద్యార్థులు టిఎస్08ఇజి4929 నంబర్ గల స్విఫ్ట్ కారులో కళాశాల నుంచి ఇంటికి చేరుకునేందుకు కారులో ప్రయాణిస్తున్నారు. రాజపుష్ప కన్స్ట్రక్షన్స్‌లోని ప్లాట్ 01 సమీపంలోని నియోపోలిస్ రోడ్డు వద్ద అలిగెట్ శ్రీకర్ కారు వేగంగా నడుపుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో శ్రీకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో శ్రీకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వీరంతా 18,19 సంవత్సరాల వారేనని పోలీసులు తెలిపారు. మరో 5 మంది హేమసాయి, వివేక్, సృజన్, కార్తికేయ, హర్షలు గాయపడ్డారు. వీరందరిని చికిత్స నిమిత్తం కాంటినెంట్ హాస్పిటల్‌కి తరలించిన పోలీసులు హర్ష పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

# రహదారులను నిర్మాణం చేపట్టి ప్రాణాలను కాపాడాలి

- ప్రాణాంతకంగా కనుముక్కల వలిగొండ రోడ్డు




**భువనగిరి కలెక్టరేట్, మార్చి 11 (జనం సాక్షి) :** రహదారుల నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు బ్రిడ్జిలు సక్రమంగా లేక కనుముక్కల, వలిగొండ వెల్లె రోడ్డు మార్గంలో ఆషిగాని కుంట కోతకు గురై, ఇరువైపులున్న రైతులు అక్రమంగా తవ్విన రోడ్డును వెంటనే పూడ్చి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా భూదాన్ పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామంలో నెలకొన్న సమస్యలను సర్వే చేసి నిరసన తెలియజేయడం జరిగింది. కనుముక్కుల నుంచి చౌటుప్పల్‌కు వెళ్లే మార్గంలో కూడా బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బకా జగన్, పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, శాఖ కార్యదర్శి జంగయ్య, గ్రామ నాయకులు జంగారెడ్డి, జనార్ధన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, పాండురంగారెడ్డి, నర్సిరెడ్డి, సాయిరెడ్డి, సూరమ్మ, అమురమ్మ, సుగుణమ్మ, శోభ, జయమ్మ, అలివేల, యాదమ్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.

# కస్తాల శ్రావణ్ కుమార్ మరణం పట్ల మంత్రి ఉత్తమ్ దిగ్భ్రాంతి

- మాజీ కౌన్సిలర్ కస్తాల శ్రవణ్ కుమార్ మరణం పట్టణ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు
- పార్థివ దేహంపై పూలమాలవేసి నివాళులు
- రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్‌నగర్, మార్చి 11 (జనంసాక్షి) :** హుజూర్ నగర్ పట్టణానికి చెందిన 11వ వార్డు మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రవణ్ కుమార్ సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మరణించగా ఈ విషయం తెలిసిన తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిగ్భ్రాంతి కి గురయ్యారు. మంగళవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాదు నుండి హుజూర్ నగర్ కు చేరుకొని మాజీ కౌన్సిలర్ కస్తాల శ్రవణ్ కుమార్ పార్థివ దేహం పై మూడు రంగుల జెండా ఉంచి, పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ శ్రావణ్ కుమార్ మరణం పార్టీకి తీరని లోటని, కాంగ్రెస్ పార్టీ కష్టకాలం ఉన్న రోజుల్లో ఆయన ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీ కోసం పని చేశారని, మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని అలాంటి వ్యక్తి మనకు దూరం అవటం చాలా బాధాకరమని అన్నారు. అనంతరం కస్తాల శ్రవణ్ కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రావణ్ కుమార్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్



**అచ్చంపేట, మార్చి 11 (జనం సాక్షి) :** సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి భూమిలో సారాన్ని పెంచుదామని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని సింగారం గ్రామం బొడ్డుపల్లి కృష్ణయ్య వ్యవసాయ క్షేత్రంలో గో ఆధారిత వ్యవసాయం పై గో సేవ విభాగం, గ్రామ భారతి సంయుక్తంగా నిర్వహించిన శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రసాయన మందులు ఎరువులు అధిక మోతాదులో వాడడం వల్లలో భూమిలో సారం నశించిపోయిందని రైతులు తమకు తామే ఎక్కువగా రసాయన ఎరువుల మందులను వాడి పంచాంగం ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 50వేల ఎకరాల మొక్కజొన్న విస్తీర్ణం పెరిగిందని ఒక పంటకు దాదాపు 9 సంచుల యూరియా వాడినట్లు వెల్లడైందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత లోకసాని పద్మా రెడ్డి, నాగర్ కర్నూల్ వ్యవసాయ సహాయ సంచాలకులు వాసు, మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య, 12 క్లస్టర్ల ఏఈవోలు లక్ష్మణ్ సింగ్, విజయకుమార్, ప్రియా, అనూష, నిర్వాహకులు రాజ వర్ధన్ రెడ్డి, అశోక్ రెడ్డి, యాదవ రెడ్డి, సత్యాలు, ఊర్మిళమ్మ, మధుసూదన్ రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణయ్య, రైతులు నారాయణ శ్యాంసుందర్, శరత్ బాబు, సురేష్ బాబు, శేఖర్, రమేష్, సత్యమయ్యతో పాటు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పంటలకు నీటిని సక్రమంగా అందించాలి


- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**పాపన్నపేట, మార్చి 11 (జనంసాక్షి) :** ఇరిగేషన్ ఆయకట్టు ద్వారా నీటి వనరులను వ్యవసాయ వరి పంటకు సక్రమంగా అందించాలని ఆశాఖ అధికారులకు కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు.మంగళవారం శానాయిపల్లి,పొడ్చన్ పల్లి,గ్రామాల లోని ఎఫ్ఎన్ కెనాల్ ఆయకట్టు చివరి నీటి పారుదల వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు.ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా వరి పంటకు నీటి వనరులు, కెనాల్ కాలువలు, రైతులు సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. బోరుబావుల కింద సాగవుతున్న వరి పైరు ఏ స్థితిలో ఉంది,సాగునీటి లభ్యత అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వరిపంట సాగు,ఎంత మేరకు నీటి అవసరం, దిగుబడులు,గతేడాది యాసంగిలో పంటల పరిస్థితి,ఏరకం ధాన్యం సాగు చేస్తున్నారని కలెక్టర్ ఆరా తీశారు.పంటలకు నీరు వస్తుందా అని రైతులను అడిగారు.కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఏ.ఈ విజయ్ కుమార్ ఉన్నారు.

# శిక్షణ పొందిన మహిళా డ్రైవర్లకు లైసెన్స్‌లు ఇప్పించాలి

- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి




**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 11 (జనం సాక్షి) :** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన 33 మంది మహిళా డ్రైవర్లకు వెంటనే ఆర్టిఏ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అధికారుల ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళ డ్రైవర్లకు ఆర్టిఏ ద్వారా లైసెన్స్ ఇప్పించడంతోపాటు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలతో కార్లు కొనుగోలు చేసేలా చూడాలని, కొనుగోలు చేసిన కార్లను కార్పోరేట్ కంపెనీలలో అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేసి మహిళా డ్రైవర్లకు స్థిర ఆదాయం ప్రతి నెల వచ్చేలా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం సిమెంట్ ఇటుకల తయారీ, నిర్మించడానికి శిక్షణ పొందిన 115 మంది మహిళలతో 50 మందికి మౌలిక వసతుల కల్పన కోసం సిమెంట్ ఇటుకల తయారీ మిషన్లు, ఇతర సామాగ్రిని సమకూర్చుకొవలన్నారు. ఇటుకల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసి గృహ నిర్మాణ శాఖ పిడితో అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో చేపడుతున్న క్యాంటీన్ల నిర్వహణపై ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్ష జరిపారు. జిల్లా మహిళా సమాఖ్య ద్వారా చేపడుతున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంకులు మార్చి 31లోగా ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చే కార్యక్రమం మార్చి 18వ తేదీ లోగా వంద శాంతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ అదనపు పీడీలు జంగారెడ్డి , మెప్మా పీడీ బాలరాజ్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కార్పొరేషన్ల అధికారులు, పీడీ హౌసింగ్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.




## రూ.349 లక్షల కోట్లు.. హాంఫట్

### ట్రంప్ చర్యలతో అమెరికా మార్కెట్లు గజగజ!

**న్యూయార్క్(జనంసాక్షి):**అమెరికా స్టాక్ మార్కెట్లు దాదాపు 20 రోజుల వ్యవధిలోనే భారీగా పతనం అయ్యాయి. స్టాక్స్‌లోని మదుపర్ల సంపద 4 ట్రిలియన్ డాలర్ల (రూ.349 లక్షల కోట్లు) మేరకు ఆవిరైపోయింది. ఇది యూకే, ఫ్రాన్స్ వంటి దేశాల జీడీపీ కంటే ఎక్కువ కావడం గమనార్హం. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ భయాలు సూచీలను వెంటాడుతున్నాయి. దీనికి ట్రంప్ అస్థిర విధానాలు తోడయ్యాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ ఫిబ్రవరి 19వ తేదీన నమోదు చేసిన ఆల్‌టైమ్ హై నుంచి ఇప్పటికి 8 శాతానికిపైగా విలువ కోల్పోయింది. నాస్‌డాక్ కాంపోజిట్ డిసెంబర్‌లో నమోదుచేసిన అత్యధిక విలువ నుంచి 10శాతం పతనమైంది. ఇక ఒక్క సోమవారమే 1.7 ట్రిలియన్ డాలర్ల సంపద కరిగిపోయింది. 2022 సెప్టెంబర్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఇక మస్క్ నేతృత్వంలోని టెస్లా షేర్ ధర 15శాతం పతనం కావడం గమనార్హం. డిసెంబర్ 17 నుంచి ఈ సంస్థ షేరు విలువ 50శాతం ఆవిరైంది. నాడు అత్యధికంగా 479.86 డాలర్లు ఉండగా.. నేడు అది 222.15 డాలర్లకు చేరింది.వివిధ కారణాలు కలిసి ఓ ప్యాకేజీలా మార్కెట్లను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య విధానాల్లో హఠాత్తుగా వస్తున్న మార్పులు, ఆర్థిక మాంద్యం భయాలు, స్టాక్స్ అధిక విలువలు వంటివి కారణమవుతున్నాయని లాజర్డ్ సీఈవో పీటర్ ఓర్స్‌జాగ్ వెల్లడించారు. ముఖ్యంగా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో, ఐరోపాతో వాణిజ్య యుద్ధాల వల్ల చాలా కంపెనీలు తమ వ్యాపార వ్యూహాలను పునఃపరిశీలిస్తున్నాయన్నారు. అమెరికాలోని భారీ సంపన్నులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటోంది. అక్కడి మార్కెట్లలో 50 శాతం విలువైన సంపద 1శాతం మంది వద్ద ఉంటుంది. ఇక 37శాతం విలువైన సంపద 10శాతం మంది వద్ద ఉంటుంది. 12శాతం వాటా 40శాతం మంది వద్ద కేంద్రీకృతమైంది. మిగిలిన 1శాతం వాటా 50శాతం మంది ప్రజల చేతిలో ఉందని ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ సెయింట్ లూయిస్ డేటా పేర్కొంది.ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశం మార్పు దశలో ఉందని ఓ టీవీ షోలో అభివర్ణించారు.

## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

- ఇండస్ ఇండ్ షేర్లు 27% డౌన్

**ముంబయి(జనంసాక్షి)** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. అమెరికాలో నెలకొన్న మాంద్యం భయాలతో నిన్న ఆ దేశ స్టాక్ మార్కెట్లు కుదేలవ్వగా నేడు ఆసియా స్టాక్ మార్కెట్లపైనా ప్రతికూల ప్రభావం పడింది. దేశీయ మార్కెట్లపైనా ఆరంభంలో ఆ ప్రభావం కనిపించినప్పటికీ.. తర్వాత సూచీలు క్రమంగా కోలుకున్నాయి. చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లలో విక్రయాలు సూచీలను పడేయగా.. ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ షేర్లు నిలబెట్టాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 73,743.88 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,115.17) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా దాదాపు నష్టాల్లోనే కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత స్వల్ప లాభాల్లోకి వచ్చిన సూచీ 74,195.17 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 12.85 పాయింట్ల నష్టంతో 74,102.32 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 37.60 పాయింట్ల నష్టంతో




22,497.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 9 పైసలు కోలుకుని 87.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, జొమాటో షేర్లు నష్టాల్లో ముగిశాయి. సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2916 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ప్రముఖ ప్రైవేటురంగ బ్యాంక్ ఇండస్ ఇండ్ షేర్లు నేడు భారీగా కుంగాయి. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 27 శాతం మేర క్షీణించాయి. బ్యాంక్‌కు చెందిన డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలు ఉన్నట్లు అంతర్గత సమీక్షలో తేలడం ఇందుక్కారణం. దీంతో బ్యాంక్ నికర విలువపై దాదాపు 2.35 శాతం ప్రతికూల ప్రభావం పడనున్నట్లు బ్యాంక్ అంచనా వేసింది. అంటే ఏకంగా రూ.1,500 కోట్ల నష్టానికి సమానం. ఈ ప్రకటన షేర్లపై ప్రతికూల ప్రభావం చూపింది. ప్రస్తుత సీఈఓ సుమంత్ కత్పలియా పదవీకాలాన్ని మూడేళ్లు కాకుండా ఒక సంవత్సరం పాటే పొడిగించేందుకు ఆర్‌బీఐ అనుమతించడంతో సోమవారం బీఎస్ఈలో 3.86 శాతం నష్టంతో రూ.900.70 వద్ద ముగిశాయి. బ్యాంక్ నుంచి తాజా ప్రకటన వెలువడడంతో మంగళవారం మరో 27 శాతం క్షీణించి రూ.655.95కి చేరింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.10 | ₹ 4.12 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹80,500 | ₹87,820 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,08,000



## జిందాల్ భారీ పెట్టుబడి

2050 నాటికి నికర-సున్నా ఉద్గార లక్ష్యాన్ని సాధించడానికి..రాబోయే అయిదేళ్లలో డీకార్బనైజేషన్ ప్రాజెక్టులలో రూ.700 కోట్లు పెట్టుబడి పెట్టే ప్రక్రియలో కంపెనీ ఉందని జిందాల్ స్టెయిన్‌లెస్ లిమిటెడ్(ఏూఒ) మంగళవారం తెలిపింది.పునరుత్పాదక శక్తి, గ్రీన్ హైడ్రోజన్, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, కార్బన్ సంగ్రహ సాంకేతికతలను స్వీకరించడం వంటి వివిధ పర్యావరణ అనుకూల ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి వచ్చే అయిదు సంవత్సరాలలో ఈ పెట్టుబడులు కొనసాగుతాయని జిందాల్ స్టెయిన్‌లెస్ లిమిటెడ్ ఒక ప్రకటనలో పేర్కొంది. రాబోయే ఐదు సంవత్సరాలలో ఈ భారీ పెట్టుబడి పెట్టడం ద్వారా...ఆర్థిక, పర్యావరణ అనుకూలతలను సాధిస్తామని కంపెనీ తెలిపింది. ముందుగా 2035 ఆర్థిక సంవత్సరం నాటికి ఉఊఉ ఉద్గారాలను, కార్బన్ తీవ్రతను గణనీయంగా 50 శాతం వరకు తగ్గించి, 2050 నాటికి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని కంపెనీ భావిస్తోంది.



## షావోమీ నుంచి 15 సిరీస్‌లో రెండు ఫోన్స్..

**జనంసాక్షి:**చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ షావోమీ రెండు కొత్త ఫోన్లను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. షావోమీ 15, షావోమీ 15 అల్ట్రా పేరుతో వీటిని లాంచ్ చేసింది.షావోమీ 14, షావోమీ 14 అల్ట్రాకు కొనసాగింపుగా వీటిని తీసుకొచ్చారు. చైనాలో ఇప్పటికే ఈ ఫోన్లను విడుదల చేసిన కంపెనీ.. బార్సిలోనా వేదికగా జరిగిన ఓచిఅ ఈవెంట్‌లో గ్లోబల్‌గా అందుబాటులోకి తెచ్చింది. తాజాగా దేశీయ మార్కెట్లోనూ అడుగుపెట్టింది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్, లైకా కెమెరాలు, ఏఐ ఫీచర్లతో ఈ ఫోన్లు వస్తున్నాయి. 15 మోడల్ ధర రూ.60వేలు నిర్ణయించగా.. అల్ట్రా మోడల్ ధర రూ.లక్ష పైనే! షావోమీ 15లో 6.36 అంగుళాల ఓఎల్ఈడీ డిస్‌ప్లే ఇచ్చారు. 120ఊళి రిఫ్రెష్ రేటు ఉంది. హెచ్‌డీఆర్ 10, హెచ్‌డీఆర్ 10+, డాల్బీ విజన్ సపోర్ట్ ఉంది. క్వాల్‌కామ్‌కు చెందిన లేటెస్ట్ ప్రాసెసర్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్‌ను అమర్చారు.

## స్పేస్‌ఎక్స్‌తో ఎయిర్‌టెల్ డీల్




ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్.. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.స్టార్ లింక్ శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను భారత్‌లో అందించేందుకు ఈ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ మేరకు ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో ఎయిర్‌టెల్ మంగళవారం తెలిపింది. అయితే, భారత్‌లో స్టార్ లింక్‌కు అనుమతులకు లోబడి ఈ ఒప్పందం ఉంటుందని ఎయిర్‌టెల్ ఓ ప్రకటనలో తెలిపింది. ఎయిర్ టెల్, స్పేస్‌ఎక్స్ కలిసి పరస్పరం ఎలా సహకరించుకోవా లనే అంశాలపై ఇరు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై భారతీ ఎయిర్‌టెల్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మన్ గోపాల్ విత్తల్ మాట్లాడుతూ.. భారత్‌లోని ఎయిర్‌టెల్ కస్టమర్లకు స్టార్ లింక్ సేవలను అందించేందుకు స్పేస్ ఎక్స్‌తో కలిసి పనిచేయడం మైలురాయిగా అభివర్ణించారు. అత్యాధునిక శాటిలైట్ కనెక్టివిటీని అందించేందుకు కంపె నీ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ప్ర పంచ స్థాయి హై స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు సైతం అందించేందుకు వీలుపడుతుందని తెలిపారు. ఒప్పందంలో భాగంగా ఎయిర్‌టెల్, స్పేస్‌ఎక్స్.. ఎయిర్‌టెల్ రిటైల్ స్టోర్‌లలో స్టార్‌లింక్ పరికరాలను అందించడం, వ్యాపార వినియోగదారులకు ఎయిర్‌టెల్ ద్వారా స్టార్‌లింక్ సేవలు, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను అనుసంధానించే అవకాశాలను అన్వేషిస్తాయి.

## ఆధునిక ఫీచర్లతో యమహా నుంచి ఈజీ హైబ్రిడ్

**ముంబయి(జనంసాక్షి)**ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఇండియా యమహా మోటార్ ఇండియా.. తొలి హైబ్రిడ్ మోడల్ బైక్‌ను లాంచ్ చేసింది. యమహా ఎఫ్‌జెడ్- ఎస్ ఎఫ్ఐ హైబ్రిడ్ పేరుతో దీన్ని తీసుకొచ్చింది. దీని ధరను రూ.1,44,800 (ఎక్స్- షోరూమ్)గా కంపెనీ నిర్ణయించింది. గతంలో తీసుకొచ్చిన నాన్ హైబ్రిడ్ మోడల్ బైక్ కంటే దీని ధర రూ.10వేలు అధికం.యమహా ఎఫ్‌జెడ్- ఎస్ ఎఫ్ఐ.. 149 సీసీ బ్లూ కోర్ ఇంజిన్‌ను అమర్చారు. ాఃఆ-2ః ఉద్గార ప్రమాణాలకు అనుగు ణంగా ఈ ఇంజిన్‌ను రూపొందించారు. యమహా స్మార్ట్ మోటార్ జనరేటర్, స్టాప్ అండ్ స్టార్ట్ సిస్టమ్‌తో ఈ ఇంజిన్ తీసుకొచ్చారు. ఈ టెక్నాలజీల కారణంగా బైక్ స్టార్ట్ చేసే సమయంలో తక్కువ శబ్దం వెలువడుతుంది. ట్రాఫిక్ సిగ్నల్ సమయంలో బైక్‌ని ఎక్కువ సేపు ఆపాల్సి వస్తే (బైక్ ఐడిల్‌గా ఉన్నప్పుడు) ఆటోమేటిక్‌గా ఇంజిన్ ఆఫ్ అవుతుంది. తర్వాత క్లచ్ సాయంతో బండిని రీస్టార్ట్ చేయొచ్చు. మైలేజీ వివరాలను కంపెనీ వెల్లడించలేదు.యమహా తీసుకొచ్చిన కొత్త బైక్.. నాన్ హైబ్రిడ్ మోడల్‌ను పోలిన డిజైన్ ఉంటుంది. ముందువైపు టర్న్ సిగ్నల్స్‌ని మాత్రం ట్యాంక్‌కు ము?ందు భాగంలో జోడించారు. 4.2 అంగుళాల ఫుల్ కలర్ టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో వస్తోంది. యమహా వై- కనెక్ట్ యాప్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌లో అనుసంధానం చేయొచ్చు. టర్న్-బై-టర్న్ నావిగేషన్ సదుపాయం ఉంది. రేసింగ్ బ్లూ, సియాన్ మెటాలిక్ గ్రే రంగుల్లో ఈ బైక్ లభిస్తుంది. భారత్‌లోకి తొలి హైబ్రిడ్ బైక్‌ని తీసుకురావడంపై యమహా మోటార్ ఇండియా ఛైర్మన్ ఇటారు ఓటని ఆనందం వ్యక్తం చేశారు. "భారత్‌లో యమహా జర్నీలో ఎఫ్‌జెడ్ బ్రాండ్ కీలక పాత్ర పోషిస్తోంది. కస్టమర్ల అభిరుచికి తగ్గట్లు ఎప్పటికప్పుడు కొత్త హంగులతో వీటిని తీసుకొచ్చాం. తాజాగా ఎఫ్‌జెడ్‌లోనే హైబ్రిడ్ మోడల్‌ని పరిచయం చేశాం" అని ఆయన అన్నారు.



## తీవ్రమైన పైలట్ల కొరత

- 30 వేల మంది అవసరం
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**ఢిల్లీ,జనంసాక్షి:**భారత్‌లో పౌర విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోంది. ప్రయాణికుల సంఖ్య ఏటికేడు పెరుగుతుండడంతో అందుకు అనుగుణంగా విమానాలను సైతం ఆయా సంస్థలు సిద్ధం చేసుకుంటున్నాయి.ఈ క్రమంలో రాబోయే రోజుల్లో పైలట్లు కూడా పెద్ద సంఖ్యలో అవసరమవుతారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. రాబోయే 15-20 ఏళ్లలో సుమారు 30వేల మంది పైలట్లు అవసరం పడతారని పేర్కొన్నారు. 200 శిక్షణ విమానాల కొనుగోలుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. దేశీయంగా 800కు పైగా విమానాలు సేవలందిస్తున్నాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రస్తుతం 6,7 వేల మంది పైలట్లు పనిచేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే వివిధ కంపెనీలు 1700కు పైగా విమానాలకు ఆర్డర్ పెట్టాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అవి సేవలందించబోతున్నాయన్నారు. దీంతో రాబోయే 15-20 ఏళ్లలో 30 వేల మంది పైలట్లు అవసరమని చెప్పారు. భారత్‌ను ట్రైనింగ్ హబ్‌గా కూడా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. విమానయాన పరిశ్రమ కోసం మంత్రిత్వ శాఖ ఒక సమష్టి విధానంతో పనిచేస్తోందని చెప్పారు. 38 ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్స్‌ను తనిఖీ చేసి అధికారులు రేటింగ్ ఇవ్వబోతున్నట్లు చెప్పారు.




# జాతీయం అంతర్జాతీయం

## మారిషస్ అధ్యక్షుడికి బహుమతిగా కుంభమేళా పవిత్ర జలం

### ప్రత్యేక కానుకగా అందించిన మోదీ



**జనంసాక్షి:**భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మారిషస్‌లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆ దేశాధ్యక్షుడు ధరమ్ గోకుల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రధాని మోదీ అరుదైన కానుకను అందజేశారు. మహా కుంభమేళా నుంచి తీసుకెళ్లిన పవిత్ర గంగా జలాన్ని అందించారు. దీంతో పాటు పలు బహుమతులను అందజేశారు. అనంతరం అధ్యక్షుడు ఇచ్చిన ప్రత్యేక విందులో మోదీ పాల్గొన్నారు. అంతకుముందు మారిషస్ ప్రధాని నవీన్ రామ్‌గోలంతో ప్రధాని భేటీ అయ్యారు. వీరిద్దరూ కలిసి ఆ దేశ జాతిపిత సీవోసాగర్ రామ్‌గోలం పేరు మీదుగా ఏర్పాటు చేసిన బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. అక్కడ ఇరు దేశాల ప్రధానులు మొక్కలు నాటారు. ఈ ఫొటోను భారత ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరిట మొక్క) కార్యక్రమంలో నా మిత్రుడు నవీన్ కూడా పాలుపంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. ప్రకృతి, మాతృత్వం, స్థిరత్వానికి గుర్తుగా ఈ మొక్క నిలుస్తుంది" అని రాసుకొచ్చారు. భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టాక నిర్వహించిన తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ఈ వన మహోత్సవానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. భూమాతను రక్షించడం కోసం అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రధాని పిలుపునిచ్చారు.ఇక, ఈ ఉదయం మారిషస్ చేరుకున్న ప్రధాని మోదీకి అక్కడి ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారు. ఆ దేశ జాతీయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

## చైనా బయటే నా వారసుడు జన్మిస్తాడు: దలైలామా

**జనంసాక్షి:**చైనా బయటే తన వారసుడు జన్మిస్తాడని టిబెట్ బౌద్ధగురువు దలైలామా పేర్కొన్నారు. ఆయన కొత్తగా రాసిన పుస్తకంలో ఈ విషయాన్ని వెల్లడించారు.దీంతో దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో ఆయనకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. తన తర్వాత దలైలామా వారసత్వం కొనసాగాలని ఆయన రాసిన వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్‌లో కోరారు. నేడు విడుదల కానున్న ఈ పుస్తకాన్ని ఓ ఆంగ్ల వార్తా సంస్థ సమీక్షించింది.గతంలో ఓ సందర్భంలో దలైలామా మాట్లాడుతూ తన తర్వాత ఈ పరంపర ముగిసిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ, తాజా పుస్తకంలో మాత్రం చైనా బయట పుడతారని పేర్కొన్నారు. తన పునర్జన్మ టిబెట్ బయట జరగొచ్చని.. అది భారత్‌లో కూడా కావచ్చని ఆయన పేర్కొన్నారు. "పూర్వీకుల పనిని ముందుకు తీసుకెళ్లటానికి ఉద్దేశించిందే పునర్జన్మ. కొత్త దలైలామా చైనా బయట స్వేచ్ఛా ప్రపంచంలో జన్మిస్తాడు. అందుకే తన బాధ్యత అయిన విశ్వకరుణకు గొంతుకగా ఉంటారు" అని పేర్కొన్నారు.14వ దలైలామాగా మారిన టెంజియన్ గ్యాట్సో 23వ ఏటే టిబెట్ నుంచి భారత్‌కు వలసవచ్చారు. నాడు తమ ప్రాంతాన్ని ఆక్రమించిన చైనాకు వ్యతిరేకంగా ఆయన గళం విప్పారు. టిబెట్ వాదాన్ని సజీవంగా ఉంచినందుకు ఆయనకు 1989లో నోబెల్ శాంతి బహుమతి వచ్చింది. తన వారసుడిగా చైనా ప్రకటించే వ్యక్తికి ఎటువంటి గౌరవం లభించదని వెల్లడించారు.దలైలామా ప్రస్తుతం భారత్‌లోని ధర్మశాలలో ఆశ్రయం పొందుతున్నారు. ఆయన అక్కడి నుంచే తన వారసుడిని ఎంపిక చేయనున్నారు. ఇది చైనాకు గిట్టక తన గడ్డపైనే వారసుడిని గుర్తించాలంటోంది. టిబెటన్ బౌద్ధుల దృష్టిలో దలైలామా తరవాత రెండో స్థానం పాంచెన్ లామాది. ఈ పదవికి దలైలామా ఎంపిక చేసిన బాలుడిని కాదని చైనా తనే ఒక బాలుడిని నియమించినా, టిబెటన్ల ఆమోదం పొందడంలో అతడు విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొత్త వారసుడి ఎంపికపై ఆసక్తి నెలకొంది.



## ఉక్రెయిన్‌పై ట్రంప్ చర్యలను రష్యాకు అంత సానుకూలమేమీ కాదు

**జనంసాక్షి:**ఉక్రెయిన్‌పై ట్రంప్ కార్యవర్గం తీసుకొనే చర్యలను మరీ అంత సానుకూలంగా చూడాల్సిన అవసరం లేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ పేర్కొన్నారు. ఆయన మాస్కోలో జరిగిన హయ్యర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ సైన్యానికి స్టార్ లింక్ కమ్యూనికేషన్లు నిలిపేస్తానని మస్క్ హెచ్చరించడం, సైనిక సాయం ఆపేయాలని ట్రంప్ ఆదేశించడం వంటి విషయాలను చూసి రష్యన్లు ఉప్పొంగాల్సిందేమీ లేదన్నారు. 'ఆ చర్యలను గులాబీరంగు కళ్లద్దాల్లో చూసేందుకు ఆత్రపడొద్దు' అని అన్నారు. మనం అత్యున్నతమైన దానిని ఆశిస్తున్నాం.. దారుణమైన పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని పెస్కోవ్ హితవు పలికారు. మన ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉండా లన్నారు. అమెరికా నిర్ణయాలతో సంబంధం లేకుండా.. ఉక్రెయిన్ యుద్ధరంగంలో రష్యా తన లక్ష్యాలను సాధించిందని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో ఇప్పటికే ఉన్న అమెరికా ఆయుధాలతో కొన్ని నెలలపాటు నిరంతరాయంగా పోరాడొచ్చని చెప్పారు. మంగళవారం అమెరికా మంత్రులు, అధికారుల బృందం సౌదీలో ఉక్రెయిన్ ప్రతినిధుల బృందంతో భేటీ కానున్న నేపథ్యంలో పెస్కోవ్ నుంచి ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. ఉక్రెయిన్ శాంతికి సిద్ధంగా ఉందా..? రష్యాకు కొన్ని రాయితీలు ఇచ్చే విషయంలో అభిప్రాయం ఏమిటనేదీ నేటి చర్చల్లో తేలనుంది. శ్వేతసౌధంలో ట్రంప్, జెలెన్‌స్కీల మధ్య వాగ్వాదం తర్వాత జరుగుతున్న ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ చర్చల ద్వారా అమెరికా తనకు అందిస్తున్న సాయం కొనసాగుతుందన్న ఆశాభావం ఉక్రెయిన్ అధికారుల్లో ఉంది.అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇప్పటికే సౌదీ రాజధాని జెడ్డాకు చేరుకొన్నారు. ఇక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ఇప్పటికే అక్కడున్నారు.



## ఇంకా మిస్టరీగానే

### మారిన సుదీక్ష కోణంకి మిస్సింగ్ కేసు

**ప్యూర్టో రికో(జనంసాక్షి):**స్నేహితులతో కలిసి కరేబియన్ దేశానికి విహారయాత్రకు వెళ్లి అక్కడ అదృశ్యమైన భారత సంతతి విద్యార్థిని సుదీక్ష కోణంకి కేసు ఇంకా కొలిక్కి రాలేదు. ఐదు రోజులు గడిచినా ఆమె ఆచూకీ దొరక్క పోవడంతో పోలీసులు గాలింపు మరింత ముమ్మరం చేశారు. అయితే, ఈ కేసు ఇప్పుడు మరో మలుపు తిరిగింది. తమ కుమార్తెను కిడ్నాప్ చేసి ఉం టారని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మరోవైపు, సుదీక్షను చివరి సారిగా చూసిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచా రిస్తున్నారు. అసలేం జరిగింది..? వర్జీనియాకు చెందిన 20 ఏళ్ల సుదీక్ష కోణంకి గతవారం మరో ఐదుగురు అమ్మాయిలతో కలిసి డొమినికన్ రిపబ్లిక్ (ఆనీఎతినితిఇఃజీని ఖీవజూబీఎశ్రీతిఇః)లోని ప్రముఖ పర్యటక పట్టణమైన ప్యూంటా కానా ప్రాంతానికి వెకేషన్‌కు వెళ్లింది. మార్చి 6వ తేదీన స్థానికంగా ఉన్న రియూ రిపబ్లికా రిసార్ట్ వద్ద బీచ్ వద్ద చివరిసారిగా కన్పించింది. ఆ తర్వాత ఆమె గదికి తిరిగి రాకపోవడంతో స్నేహితులు పోలీసులను సంప్రదించారు. అప్పటి నుంచి పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు. డ్రోన్లు, హెలికాప్టర్లతో వెతుకుతున్నారు.అయితే, సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా.. మార్చి 6వ తేదీ తెల్లవారుజామున 3 గంటల వరకు సుదీక్ష ఆమె స్నేహితులతో కలిసి రిసార్ట్‌లో పార్టీ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమె ఐయోవాకు చెందిన 24 ఏళ్ల టూరిస్టు జాషువా స్టీవెన్ రిబెతో కలిసి బీచ్‌కు వెళ్లినట్లు తేలింది. దీంతో పోలీసులు అతడిని ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానాలు చెప్పాడు. సుదీక్షను భారీ అల లాక్కెళ్లిందని ఒకసారి.. తాను పడుకున్నా నని, ఏమీ తెలియదని మరోసారి చెప్పాడు.దీంతో తమ కుమార్తెను ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారని సుదీక్ష తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టాలని పోలీసులను అభ్యర్థించారు. "ఒకవేళ ఆమె బీచ్‌లో గల్లంతై ఉంటే.. ఇప్పటికే తీరానికి కొట్టుకురావాలి కదా. ఇప్పటివరకు ఆమె మృతదేహం లభించలేదు. సాధారణంగా మా కుమార్తె ఎప్పుడూ వెంట ఫోన్ తీసుకెళ్తుంది. కానీ, ఈసారి ఫోన్, వాలెట్ స్నేహితులకు ఇచ్చి వెళ్లడం అనుమానాస్పదంగా ఉంది. ఆమెను ఎవరైనా అపహరించి ఉంటారు" అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని డొమినికన్ పోలీసులు వెల్లడించారు.భారత్‌కు చెందిన సుదీక్ష తల్లిదండ్రులు అమెరికాకు వలస వెళ్లి అక్కడ శాశ్వత నివాస హోదా పొందారు. ప్రస్తుతం ఆమె పిట్స్‌బర్గ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ చదువుతోంది.



# రాష్ట్ర ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలి

**కార్మికుల సమస్యలు పరిష్కరించండి**

**వేములవాడ మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేత**



**వేములవాడ(జనంసాక్షి)**

తెలంగాణ మున్సిపల్ స్టాఫ్,ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్,ఏఐటీయూసీ అనుబందం, రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో వేములవాడ మున్సిపల్ కమిషర్ కి మంగళవారం కార్మిక సమస్యలపై విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులకు,కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు ట్రెజరీ ద్వారా ఇవ్వాలని,వేతనాలు పెంచే వరకు తాత్కాలిక భృతి కింద 4 వేల రూపాయలు అదనంగా ఇవ్వాలని అన్నారు.జి ఓ నెంబర్ 60 ప్రకారం పెంచిన వేతనంలోని బకాయిలు 3 నెలలవి చెల్లించాలని,వేతన సవరణ కాలం 2022 జుల్కె తో ముగిసింది వెంటనే వేతన సవరణ చేయలని కోరారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.25 లక్షలు ఇవ్వాలని,60 సంవత్సరాల వయసు దాటిన ఔట్ సోర్సింగ్ కార్మికులకు పదవీ విరమణ జరిగితే రూ.10 లక్షలు ఇవ్వాలని అన్నారు.వేములవాడ పర్యాటక కేంద్రం కాబట్టి భవన నిర్మాణాలు, అపార్టుమెంట్స్, సత్రములు ,రెస్టారెంట్లు, హొటల్స్, విపరీతంగా పెరుగుతున్న తరుణంలో రాజరాజేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్న సందర్భంగా వారు వాడినటువంటి వ్యర్థ పదార్థాల వలన చెత్త విపరీతంగా పెరుగుతున్నది, అందువలన ఇప్పుడున్న సిబ్బంది కంటే అధికంగా పారిశుధ్య కార్మికులను పెంచాలని కోరారు.ప్రతి కార్మికుని పిఎఫ్ లెక్కలు 6 నెలలకొకసారి నోటీస్ బోర్డులో పెట్టాలని, మున్సిపల్ కార్మికులు,ఉద్యోగులకు బట్టలు ,కుట్టుకూలీలు,ప్రతి కార్మికునికి మున్సిపల్ వారే భీమా పతకం అమలు చేయాలి ప్రతి 3 సంవత్సరాల కు ఒకసారి మున్సిపల్ వారే ఆరోగ్య పరీక్షలు చేయించాలి అన్నారు. పర్మినెంట్ కార్మికులకు ఇవ్వవలసిన డి ఎ లు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, పి.మల్లేశం, రాజయ్య, దుర్గయ్య,ఎస్. మల్లయ్య, బి.లక్ష్మిరాజం, చంద్రయ్య,ఎస్. రాజు,జి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య



**వేములవాడ (జనంసాక్షి)**

:ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.మంగళవారం వేములవాడ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అర్ బి ఎస్ కె వారి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కంటి అద్దాలను ప్రభుత్వ విప్ పంపిణీ చేసిన చేశారు.. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పెద విద్యార్థికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.రాష్ట్రంలో ఇప్పటికే 55 ఇంటిగ్రేటెడ్ నిర్మాణం కోసం 200 కొట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు.రాష్ట్రంలోని ఎస్సి, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సైతం ఇంటర్నేషనల్ స్థాయిలో విద్య అందిస్తున్నామన్నారు.మన ప్రాంతలో రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.గత పదేళ్ళుగా నిర్లక్ష్యంగా మారిన విద్యలో మార్పు తీసుకువచ్చి, పెద విద్యార్థులకు మంచి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగి తల్లిదండ్రుల ఆశాయలను నెరవేర్చాలన్నారు. కేజీవీబీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టి కంటి సమస్యలు గుర్తించి అద్దాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 338 మంది విద్యార్థులను గుర్తించి కంటి అద్దాలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.కేజీవీబి, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల యోగ క్షేమాలు చూసుకొనే బాధ్యత ప్రభుత్వాన్నిదని, రానున్న పదవ తరగతి పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు.

# న్యాయవాదుల సమస్యలను పరిష్కరించండి



**వేములవాడ (జనంసాక్షి)**

వేములవాడ కోర్టులో నెలకొన్న న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో న్యాయవాదులు రాజన్న సిరిసిల్ల జిల్లా ఫోర్ట్ పోలియో జడ్జి నామవరపు రాజేశ్వరరావు ను హైకోర్టులో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ వేములవాడకు అడిషనల్ కోర్టు మంజూరు చేయాలని, ప్రస్తుతమున్న కోర్టు బిల్డింగ్ పై అదనపు అంతస్తు నిర్మాణం చేయాలని, కక్ష దారులకు మౌలిక సదుపాయాలు కల్పనకై తదితర విషయాలపై పోర్ట్ పోలియో జడ్జికి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నక్క దివాకర్, పంపరి శంకరయ్య, గుజ్జే మనోహర్ తదితరులు ఉన్నారు.

# తక్కువ నీటితో సాగు పంటలపై అవగాహన కల్పించాలి



**పెన్ పహాడ్ మార్చి 11 (జనం సాక్షి)**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్**

**మండలంలో వరి పొలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**పంట చేతికందే వరకు నీటినందించాలని మొరపెట్టిన రైతులు**

తక్కువ నీటితో సాగు చేసే పంటలపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అన్నారు మంగళవారం మండలంలోని ధర్మాపురం,మేగ్య తండ, భక్తళాపురం గ్రామాలలో ఎస్ ఆర్ ఎస్ పి కాలువ ద్వారా సాగు చేస్తున్న వరి పొలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భూక్యా క్రాంతి అనే రైతు పొలంలోకి దిగి వరి పంటను పరిశీలించారు సాగు నీటి లభ్యత, బోర్ బావుల ద్వారా ఎంత మేర సాగు అవుతుందో క్షేత్ర స్థాయిలో రైతులను అడిగి తెలుసుకుని స్వయంగా పరిశీలన చేశారు బోర్ బావులలో నీరు సరిపోతుందా,ఇంకా ఎన్ని రోజులు నీరు సరఫరా చేస్తే పంట చేతికి వస్తుందని రైతులను అడగగా బోర్ బావుల్లో నీరు అడుగు అంటిందని ఇంకా 20 రోజులు కాల్వ ద్వారా సాగు నీరు వచ్చేలా చూస్తే బోరు బావుల్లో నీరు ఉంటుందని పంట కూడా చేతికి వస్తుందని నీరు వచ్చేలా చూడాలని రైతులు కలెక్టర్ కి విన్నవించారు మొదటగా మెగ్య తండా గ్రామం వద్ద ఎస్సారెస్పీ ప్రధాన కాలువను పరిశీలి స్తుండగా గ్రామానికి చెందిన రైతు లు ఆంగోత్తు నర్సింగ్ నాయక్, ఆంగోతు శ్రీరాములు, ఆంగోతి చిన్ని కలెక్టర్ వద్దకు వచ్చి మోతె మండలం కోటి నాయక్ తండ వద్ద ప్రధాన గేటు తెరవక పోవడంతో తాము సాగుచేసిన పంటలకు సరిపడా నీరు అందడం లేదని ఇంకా నాలుగు విడుదతల వరకు సాగు చేసిన పంట పొలాలకు నీళ్లు అందిస్తేనే పంట చేతికందు తుందని కలెక్టర్ కు మొర పెట్టారు దీంతో కలెక్టర్ తప్పకుండా పరిశీలిస్తామని రైతులకు తెలిపారు రబీ సీజన్ లో వరి కాకుండా నీరు తక్కువ తీసుకునే పంటలను వేసుకునేలా రైతులలో అవగాహన కల్పిం చాలని వ్యవసాయ అధికారులకి సూచించారు ఈ కార్యక్రమం లో తహసీల్దార్ లాలు, ఇరిగేషన్ ఎఈ లింగయ్య, ఎఓ అనిల్,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తప్పుడు సర్వే నెంబర్‌తో భూమి కబ్జా వ్యక్తి ఫిర్యాదు

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి)**



: తప్పుడు సర్వే నెంబర్ సాకుగా చూపిస్తూ కొందరు వ్యక్తులు తమకు సంబంధించిన స్థలాన్ని కబ్జా చేశారంటూ వ్యక్తి మంగళవారం మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. బాధితుడు కథనం ప్రకారం... గత 20 సంవత్సరాల క్రితం కె. కొండల్ రావు అనే వ్యక్తి మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి సర్వే ఆఫ్ ఇండియా లేఔట్ లోని ప్లాట్ నెంబర్ 495 నుండి 504 వరకు ఉన్న ఉన్న భూమిని కొనుగోలు చేయడం జరిగింది. సర్వేనెంబర్ 11/19, 11/20 మరియు 11/21 గా కారణంమేట్ రెవెన్యూ విలేజ్ లో ఇట్టి స్థలము నెలకొని ఉంది. కాగా గత నెలలో కొందరు ప్రైవేటు వ్యక్తులు వచ్చి సదరు స్థలము తమదిగా పేర్కొంటూ బెదిరింపులకు దిగడంతో తాము ఫిబ్రవరిలోనే మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపాడు. కాగా మరో మారు మంగళవారం సూర్యనారాయణ, జగన్ కుమార్, సుబ్బరాజు, శ్రీహరి రాజు తదితరులు తమ ప్లాట్ల వద్దకు చేరుకొని తమవి తప్పుడు ధృవపత్రాలు అని, అసలైన సర్వేనెంబర్ 11/37/ఏ అని అని చెబుతూ సదరు స్థలాన్ని కబ్జా చేయడంతో పాటు చుట్టూ గ్రానైట్ స్తంభాలను పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడం జరిగిందన్నారు. దీంతో తాము నియమించుకున్న సెక్యూరిటీ గార్డులు ఆక్రమణదారులను అడ్డుకోవడానికి ప్రయత్నించగా ఓం ప్రకాష్ రెడ్డి, అతని అనుచర బృందం సెక్యూరిటీ సిబ్బంది పై దాడికి పాల్పడి తమ స్థలంలో ఉన్న సిసి కెమెరాలను ధ్వంసం చేసి స్థానికంగా భయానక వాతావరణాన్ని సృష్టించడం జరిగిందన్నారు. దీంతో గత్యంతర లేని పరిస్థితిలో తాము మాదాపూర్ పోలీసులను ఆశ్రయించడం జరిగిందని, దీంతోపాటు శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించి తమ స్థలాల యొక్క నిజాలను నిగ్గు తేల్చాలని, అసలు ఆ స్థలము ఏ సర్వే నంబర్లలో నెలకొన్నదో బహిరంగంగా స్పష్టం చేయాలని తాము కోరడం జరిగిందన్నారు.

# గ్రూప్ 2 ఫలితాలలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు

**కోదాడ (జనంసాక్షి)**



కోదాడలోని కెఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. రమణారెడ్డి కుమారుడు నారు వెంకట హర్షవర్దన్ రెడ్డికి ప్రకటించిన గ్రూప్-2 ఫలితాలలో 447.080 మార్కులు పొంది రాష్ట్రస్థాయిలో "ప్రథమ ర్యాంకు" పొందిన సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. క్రమశిక్షణతో, పట్టుదలతో సబ్జెక్టుని అర్థం చేసుకొని, పోటీ పరీక్షలో ప్రతి ప్రశ్న అని అర్థం చేసుకొని వ్రాసి రాష్ట్రస్థాయిలో (గ్రూప్ 2లో) ప్రథమ స్థానం పొందడం అభినందనీయమని అన్నారు. అభినందించినవారిలో జి.లక్ష్మయ్య, ఆర్. పిచ్చి రెడ్డి, వేముల వెంకటేశ్వర్లు ,జి. యాదగిరి, వి. బల భీమ రావు,ఆర్. రమేష్ శర్మ, పి.రాజేష్, ఎం.రత్నకుమారి, బి. రమేష్ బాబు, జి. వెంకన్న, జి. నాగరాజు, పి.తిరుమల, ఎస్.గోపికృష్ణ, చంద్రశేఖర్, ఈ.నరసింహారెడ్డి,ఎస్. కే.ముస్తఫా,ఈ. సైదులు, ఎస్. కే.ఆరిఫ్,ఎన్. రాంబాబు,కే. శాంతయ్య,కే. జ్యోతిలక్ష్మి,ఆర్. చంద్రశేఖర్, ఎస్. వెంకటాచారి, టి. మమత, డి.ఎస్.రావు మొదలగువారు ఉన్నారు. హర్షవర్దన్ రెడ్డి.. 1, 2 సెంచరీ స్కూల్ ఖమ్మం, 3 నుంచి 7 వరకు ఖమ్మం కేంద్రీయ విద్యాలయ, 8 నుంచి 10 నలంద విద్యాలయ విజయవాడ, ఇంటర్ శ్రీచైతన్య విజయవాడ, బిటెక్ సీఎస్సీ, ఎన్ఐటీ తాడేపల్లిగూడెంలో విద్యాభ్యాసం కొనసాగించారు.

# త్వరలో మహిళా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



**గోదావరిఖని, జనంసాక్షి**

మహిళలకు వ్యాపార అభివృద్ధి, స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ అందించేందుకు జిల్లాలో మహిళా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను వీ-హబ్ సహకారంతో త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.
మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వశక్తి మహిళ సంఘాలకు నిర్వహించిన వ్యాపార అభివృద్ధి శిబిరం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. జిల్లాలో మహిళల వ్యాపార అభివృద్ధి, నైపుణ్య అభివృద్ధి, ఆర్థిక సాధికారతను ప్రోత్సహించేందుకు వీ-హబ్ సహకారంతో త్వరలో మహిళ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ప్రారంభిస్తామని తెలిపారు. స్వశక్తి మహిళ సంఘాలకు వ్యాపారాల అభివృద్ధి, ఎంఎస్ఎంఈ పై అవగాహన పెంచుకోవాలని, నైపుణ్య అభివృద్ధి అవకాశాలు, వీటి ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాన్ని తెలియజేశారు. వ్యాపార అభివృద్ధి శిక్షణలు భాగంగా ఉత్పత్తి తయారీ మార్కెటింగ్ బ్రాండింగ్ వ్యాపార నిర్వహణ అంశాల లో మహిళలకు శిక్షణకు ఇచ్చి వ్యాపారాన్ని పెంచుకునే మార్గాన్ని అందించనున్నట్లు తెలిపారు. నైపుణ అభివృద్ధిలో భాగంగా ఆహార ఉత్పత్తి కలలు హస్తకళలు టెక్స్టైల్స్ వంటి రంగాల్లో సేమ్ ఉపాధి సాధనకు కావాల్సిన శిక్షణ అందిస్తామని అన్నారు. మహిళలు తాము అనుకున్న రంగంలో ఓపికతో ఉంటే విజయాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఒక వ్యాపారం ప్రారంభించిన వెంటనే అధిక లాభాలు రావడం సాధ్యం కాదని, ఒక 6 నెలలు, సంవత్సరం పాటు కష్టతరంగా ఉన్న తట్టుకునే నిలబడినప్పుడే మన వ్యాపారం అభివృద్ధి పొందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీ-హబ్ సంచాలకులు జహీద్ అక్తర్ షేక్, వీ- హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, స్టూడెంట్ ప్రోగ్రామ్ లీడ్ జై, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సాయిరాం, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, జిల్లా పరిశ్రమల అధికారి కీర్తి కాంత్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మురళి, గోదావరిఖని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉష తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి



**నాగిరెడ్డిపేట్,మార్చి 11 (జనం సాక్షి)**

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ప్రభాకర్ చారి రివ్యూ సమావేశం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభాకర్ చారి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనుల్లో లేబర్ సంఖ్య పెంచాలని,ఇంటి పన్ను వసూళ్ల ఆన్లైన్ చేయాలని,కార్యదర్శులు అందరూ సమయానుసారం పాటించి గ్రామాలలోకి చేరుకొని డిఎస్ఆర్ చేయాలని ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని కార్యదర్శులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ సాయిలు ,కార్యదర్శులు పాల్గొన్నారు.

# రైతుల క్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మంత్రి సీతక్క సహకారంతో మరింత ముందుకు వెళ్తాం : కోరం కనకయ్య ఇల్లందు ఎమ్మెల్యే**

**కొత్తగూడ మార్చి 11 జనంసాక్షి**



:మహబూబాద్ జిల్లా కొత్త గూడ మండలంలో పర్యటించిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఇల్లందు నియోజకవర్గంలోని గార్ల బయ్యారం రైతులకు రెండు పంటలు అందించే విధంగా సాగునీటి కోసం పాకాలలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి అదనంగా మరో రెండు టీఎంసీల నీరు తీసుకొచ్చే విధంగా మంత్రి సీతక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కొత్తగూడ,గంగారం మండలాల తోపాటు గార్ల,బయ్యారం కు సాగు తాగునీరు అందించే విధంగా కృషి చేస్తామని అన్నారు.మంత్రి సీతక్క సహకారంతో మరింత ముందుకు వెళ్తామని ఇక్కడ ప్రాంతం పరిశీలించడం జరిగింది.పాకాల డబ్బా వాగు నుండి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుట్టల భూపతి ప్రాంతం లోని పంది పంపుల వాగులో నీరు పోయించడం ద్వారా బయ్యారం ద్వారా గార్ల ప్రాంతాలకు సులభంగా నీరు అందడం ద్వారా రెండు పంటలు రైతులు పండించుకోవడం జరుగుతుందని తెలిపారు.

# అటవీ గ్రామాల్లో పెద్దపులి సంచారం

**వణుకుతున్న పల్లె ప్రజలు**



**కాటారం మార్చి 11( జనం సాక్షి ):**

కాటారం మహాదేవపూర్ సబ్ డివిజన్ అటవీ గ్రామాల్లో పెద్దపులి సంచారం వలన గ్రామ ప్రజలు వణుకుతున్నారు. గత 20 రోజులుగా ఈ ప్రాంతంలో అన్నారం దామరకుంట, జాదవ్ రావు పేట , రఘుపల్లి, నస్తురుపల్లి, ప్రతాప్ గిరి, గ్రామ అటవీ ప్రాంతంలో తిరుగుతున్నడవలన ప్రజలు భయపడుతూ అటవీ సమీప పొలాల్లో పనిచేయడానికి భయపడుతున్నారు. అటవీ అధికారులు 20 రోజుల నుండి పాదముద్రలు పరిశీలిస్తూ తిరుగుతూనే ఉన్నారు. కానీ పులి సంచారం చేస్తూ అటవీ ప్రాంతం లో తిరుగుతూనే ఉంది . ఏదో ఒకచోట స్థావరం ఏర్పరచుకునేందుకు తిరుగు తున్నట్లు అధికారులు తెలిపారు . పశువులకు గాని ఈ గ్రామాల్లో ఉన్న రైతులు గాని పొలం పనులు చేసుకోలేక పనులు వెనుకబడుతున్నవి పత్తి తీయడం కానీ , పొలం కలుపు కొరకు కానీ పశువుల కాపర్లు వివిధ రకాలుగా పనిచేసుకొని జీవించే ప్రజానీకం ఇబ్బందులకు గురవు తున్నారు . అధికారులు పులిని జాడకను కొని మహారాష్ట్ర వైపు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 11 (జనం సాక్షి)**

దేవునిపల్లి మండలం అడ్లూరు గ్రామం,జడ్పిహెచ్ఎస్ హైస్కూల్ నందు కళాబృందం ప్రోగ్రాం నిర్వహించనైనది. కార్యక్రమములో షీటీం, సైబర్ క్రైమ్,గురించి అవగా హన కల్పించనైనది. షీటీం నెం. 8712686094, సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి వినియోగించుకోవలేనని చెబుతూ, అత్యవసర పరిస్థితుల టోల్ ఫ్రీ నెంబర్స్ 100, 108, 1930, 181 ల విలువలు తెలుపనైనది. ప్రతి మహిళ ఫోన్ నందు టి - సేఫ్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఇది మహిళలకు చాలా అత్యవ సరమైనదని తెలుపడం జరిగింది, ద్విచక్ర వాహనదారులు కచ్చితం గా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వారికి తెలిపారు. మరియు మారక ద్రవ్యాల వినియోగాన్ని అందరూ మానుకోవాలని తెలియజేయడం జరింగిందని ఈ కార్యక్రమంలో కళాబృందం, భరోసా టీం కళాశాల హెడ్మాస్టర్ సుమలత పాల్గొన్నారు.

# రైతుల శ్రేయస్సే ప్రభుత్వం లక్ష్యం

**•పంటలు ఎండుతున్న పాపం హరీష్ రావు కెసిఆర్ లదే**

**•టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి**



**నంగునూరు మార్చి11 (జనంసాక్షి)**

రైతుల శ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు.గోదావరి జలాలతో మోయ తుమ్మెద అక్కెనపల్లి పెద్దవాగు లోని గణపురం చెక్ డ్యాం నిండి అలుగు పారి నంగునూరు, అక్కెనపల్లి చెక్ డ్యాముల్లోకి ప్రవహిస్తున్న సందర్భంగా మంగళవారం గణపురం గ్రామ రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి గంగమ్మ పూజలు చేశారు. అనంతరం దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ వాగవ తలి ఐదు గ్రామాలలో భుగర్భజ లాలను పెంచడానికి తుమ్మెద వాగుపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై ఎస్ రాజశేఖర రెడ్డి చెక్ డ్యాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు మీద సాగునీటి సద్వినియోగంపై శ్రద్ధ చూపలేదని విమర్శించారు. ఫలితంగా కాలేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కాలువల నిర్మాణం పూర్తి కాలేదని తెలిపారు. అధికారంలో ఉన్నపుడు పట్టించుకోకుండా, అధికారం పోగానే బీ ఆర్ ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు బాగు శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచులు తిప్పని రమేష్, కర్ణకంటి రవీంద్ర చారి, చేర్యాల బాలయ్య, గాండ్ల రమేష్, అనరాజు నాగరాజు, రాగుల కృష్ణ, రాగుల కనకయ్య, మ్యాకల భాస్కర్, పీఏసీఎస్ డైరెక్టర్ కరెడ్ల వెంకట రెడ్డి, గోనెపల్లి శివ గౌడ్,
చల్ల శ్రీనివాస్ రెడ్డి, గణపురం శ్రీనివాస్, గణపురం భాను, రజినీకాంత్, రమేష్, కొడముంజ కరుణ, అల్లూరి మంగవ్వ, రాధిక, ఎల్లవ్వ, బుచ్చవ్వ, మమత, స్రవంతి, పల్లవి, పోచవ్వ పాల్గొన్నారు.

# గిరిజనుల భూములు వారికే దక్కాలి



**•గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తే ఊరుకునేది లేదు**

**•జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్**

**ఉర్కొండ, మార్చి 11 (జనంసాక్షి)**

మండలంలోని గుండ్ల గుంటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్యా తండా సమీపంలో ఉన్న ఊరుకొండ పేట రెవెన్యూ పరిధిలో ఉన్న 186 సర్వే నెంబర్ లో గల109 ఎకరాల అసైన్డ్ భూములను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ బృందం మంగళవారం రోజు సందర్శించారు . వివరాల్లోకి వెళితే రెడ్య తండా సమీపంలోని అసైన్డ్ భూములు గత మూడు తరాలుగా తండాకు చెందిన గిరిజనల ఆధీనంలో ఉందని వ్యవసాయం చేస్తూ అనుభవిస్తున్నారని, అట్టి భూమిపై ఇతరులు స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని జాతీయ ఎస్టీ కమిషన్ కు తండావాసులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నందుకున్న ఎస్టీ కమిషన్ సభ్యుల బృందం రెడ్యా తండాను సందర్శించి రెవెన్యూ అధికారుల తో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసుకుంటున్నటువంటి భూములు గిరిజనులకే దక్కాలని గత ప్రభుత్వాలు పేద ప్రజలకు పట్టాలు ఇస్తే వాస్తవంగా వారు ఏనాడు కూడా సేద్యం చేయలేదని ఇక్కడ ఉన్న గిరిజనులు సాగు చేస్తున్నారు కాబట్టి వారికే హక్కు ఉంటుందని తండావాసులను ఎవరైనా బెదిరించిన లేక భయభ్రాంతులకు గురి చేసిన వారికి తగిన గుణపాఠం చెప్తామని సందర్భంగా తెలియజేశారు. గిరిజనులకు రాజకీయ నాయకులు గానీ అధికారులు గానీ భయభ్రాంతులకు గురి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ వారికి ఎల్లప్పుడూ నా సహకారం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు .ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, తహశీల్దార్ రామకోటి, జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, ఓయూ జేఏసీ చైర్మెన్, బీఆర్ ఎస్ నాయకులు కరాటే రాజు నాయక్, తెలంగాణ సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రేమ్ నాయక్, నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, రమేష్ నాయక్, దుర్గాప్రసాద్, రాజేందర్ గౌడ్ తండావాసులు తదితరులు ఉన్నారు.

# బీహార్ దొంగల ముఠా అరెస్టు

**•ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)**

సైబర్ నేరాలను చేయాలని పథకం వేసిన ఘరానా దొంగల ముఠాను మంగళవారం ఆదిలాబాద్ రెండవ పట్టణ మరియు సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహజాన్ పలు విషయాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఆరుగురు నిందితులు ముఠాగా ఏర్పడి దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడడానికి వేసుకున్న ప్లాన్ లో భాగంగా ఏ వన్ తబరాగ్ అనే వ్యక్తి తో పాతో కొన్ని గ్యాంగులు కలిసి పట్టణంలో తిరుగుతున్నారన్నారు. ఐదుగురు నిందితులను బీహార్ రాష్ట్రం నుండి ఐదు బైకులతో పాటు తెలంగాణ రాష్ట్రానికి పంపి ద్విచక్ర వాహనాలలో తిరుగుతూ పాత మొబైల్ ఫోన్ లు, ప్లాస్టిక్ డబ్బాలను ఇస్తామంటూ తిరుగుతూ ఊర్లలో పట్టణాలలో ఉన్న పాత మొబైల్ ఫోన్ లను, సిమ్ కార్డులు మరియు బ్యాటరీలను సేకరించడం జరుగుతుందని తెలిపారు. వాటిలో లభ్యమైన సిమ్ కార్డుల ద్వారా, ఫోన్ల ద్వారా వివిధ రాష్ట్రాలలోని ప్రజలకు బ్యాంక్ అధికారులు అంటూ ఫోన్లు చేసి వారిని సైబర్ నేరం బారిన పడేవిధంగా చేసి డబ్బులు సంపాదించే ఒక ముఠా యొక్క కుట్రను భగ్నం చేశామని జిల్లా ఎస్పీ తెలిపారు ఈ సందర్భంగా వీరి వద్ద నుండి దాదాపు 2125 పాత మొబైల్ ఫోన్ లను, 107 సిమ్ కార్డులను వీరు ప్లాస్టిక్ డబ్బాలను అమ్మడానికి ట్రయ్ లో అమర్చి ఉన్న ఐదు ద్విచక్ర వాహనాలను మరియు వీరు వినియోగించే ఐదు మొబైల్ ఫోన్లను, 600 మొబైల్ బ్యాటరీలను వీరి వద్ద నుండి స్వాధీనం చేసుకొని ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయబడిందని తెలిపారు ముఖ్యంగా వీరు ఇదివరకే కర్ణాటక రాష్ట్రం నుంచి దాదాపు పది నుండి 12 వేల వరకు మొబైల్ ఫోన్లను



సేకరించి వాటి ద్వారా వివిధ సైబర్ నేరాలకు పాల్పడడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజల నుండి సేకరించిన మొబైల్ ఫోన్లను వాటి సిమ్ కార్డులను వాడి అమాయక ప్రజలను మోసం చేసి ఈ ముఠా సభ్యులు పోలీసులకు చిక్కకుండా వుండాలనే దురుద్దేశంతో పక్క ఒక గ్యాంగ్ గా ఏర్పడి ఈ కుట్రలను పాల్పడడం, అదేవిధంగా ఈ మొబైల్ ఫోన్లో సిమ్ కార్డులు అమాయక ప్రజల పేరుపై ఉండడంతో తమపై అనుమానం రాదు మరియు సులువుగా చట్టం నుంచి తప్పించుకోవాలని దురుద్దేశంతో ఇలాంటి నేరాలు చేస్తారని తెలిపారు. దేశవ్యాప్తంగా భారీ ఎత్తున సైబర్ నేరాలకు పాల్పడాలనే ఉద్దేశంతో ఈరోజు అరెస్టు అయిన ఏ2 నుండి ఏ6 పెద్ద ఎత్తున సెల్ ఫోన్లు, సిమ్ కార్డులు సేకరించి బీహార్ కు తీసుకెళ్లి ఏ వన్ తబ రాగ్ కు అప్పగించడం జరుగుతుంది. సేకరించిన ఈ సెల్ ఫోన్లు మరియు సిమ్ కార్డుల ద్వారా ఏ వన్ తబరాగ్ మరియు అతని అనుచరులు దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు బ్యాంకు అధికారులమని నమ్మించి లేదా ఉద్యోగాలు ఇప్పిస్తామని, లాటరీ గెలిచారని ఫోన్ చేస్తూ వివిధ రకాలుగా నమ్మిస్తూ మోసం చేస్తూ ఓటిపి తెలుసుకొని అమాయక ప్రజల యొక్క బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులను మళ్లించుకోవడం జరుగుతుంది. అన్నారు. స్వాధీనం చేసుకున్న ఫోన్ల ద్వారా ఎంతో మంది అమాయక ప్రజలను మోసగించాలని కుట్రపన్నడం జరిగింది. సైబర్ నేరస్తుల ఈ కుట్రను చాకచక్యంగా కనుక్కొని వారిని అరెస్ట్ చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

# తెలంగాణ సెక్రటేరియట్ మాజీ సీఎస్ఓ మృతి

**హైదరాబాద్ (జనంసాక్షి)**



తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్ మాజీ సీఎస్ఓ, సిరిసిల్ల బెటాలియన్ కమాండెంట్ టి.గంగారాం మృతి పట్ల తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మరణంపై సంతాపం మంత్రి సురేఖ ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కమాండెంట్ గంగారాం ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబీకులు ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు.

# మరమ్మతులు పూర్తి.. యథాతథంగా నీటి సరఫరా



**హైదరాబాద్ (జనంసాక్షి)**

ఓల్డ్ బాంబే హైవేలోని ముఘల్ రెస్టారెంట్ వద్ద 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్ కు మరమ్మతులు పూర్తయ్యాయి. జలమండలి అధికారులు నిరంతరాయంగా పనిచేసి ఈ రోజు అర్ధరాత్రి సమయంలో మరమ్మ తులు పూర్తి చేశారు. తెల్లవారుజామున ఆయా రిజర్వాయర్లలోకి నీటి సరఫరా జరగ్గా.. ఉదయం నుంచి మొదటగా ఆన్ లైన్ సప్లై చేశారు. తర్వాత డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్లకు సరఫరా పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో ఎండీ అశోక్ రెడ్డి సాహెబ్ నగర్ రిజర్వాయర్ ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. షట్ డౌన్ వల్ల నీటి సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశామని.. భారీ పైపు కావడం, 30 ఏళ్ల క్రితం నాటి పైపు కాబట్టి పనులు కాస్త ఆలస్యం అయ్యాయన్నారు. అయినా జలమండలి టెక్నికల్ టీమ్ సలహాలు, సూచనలతో వెల్డింగ్ సంబంధించిన యంత్రాలు, పనిముట్లు, నిర్మాణ సామగ్రిని అప్పటికే సమకూర్చుకుని పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. పనులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించిన ట్రాన్స్ మిషన్ అధికారులు, సిబ్బందిని ఎండీ ప్రశంసించారు. లీకేజీ వల్ల ప్రభావితమైన వాటిల్లో ఇంకా ఏ ప్రాంతానికైనా నీటి సరఫరా జరగక పోతే ట్యాంకర్ల ద్వారా సప్లై చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్.ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు అరవింద రెడ్డి, నారాయణ, జీఎంలు, ఓ అండ్ ఎం, ట్రాన్స్ మిషన్ అధికారులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**కాటారం మార్చ్ 10( జనం సాక్షి):**

హత్యకేసులో నిందితునికి భూపాలపల్లిలో కోర్టు జీవిత ఖైదు విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. కాటారం మండలం గంగారం గ్రామంలో మారుపాక అశోక్, మారుపాక నాగరాజు అన్నదమ్ములు. వీరికి వారి స్వగ్రామంలో ఇంటి స్థలం ఉండగా నిందితుడు, అతని అన్న మారుపాక నాగరాజు (మృతుడు), అతని తల్లి మారుపాక శంకరమ్మ సమానంగా పంచుకున్నారు. అట్టి స్థలంలో తన వాటాకు వచ్చిన స్థలంలో మారుపాక నాగరాజు చిన్న ఇల్లు నిర్మించుకున్నాడు . నిందితుడు మారుపాక అశోక్ తాగుడుకు అలవాటు పడి తన వాటాకు వచ్చిన భూమిని అమ్ముకొని ఖర్చు చేసుకున్నాడు. అప్పటి నుండి అశోక్ తన అన్నను తను కట్టుకున్న ఇంట్లో వాటా వస్తుందని, అతన్ని ఇబ్బందులకు గురిచేస్తూ చంపుతానని బెదిరించగా అతను గ్రామం నుండి కుటుంబంతో సహా వెళ్లిపోయి వేరే గ్రామంలో బతుకుతున్నారు. 2019 సంవత్సరం మే నెలలో 10 తారీకున ఎంపీటీసీ ఎలక్షన్ లో ఓటు వేయడానికి తన ఊరు గంగారం రాగా నిందితుడు ఇంటి స్థలం విషయంలో తన అన్నతో గొడవపడి ఖాళీ బీరు బాటిల్ పగులగొట్టి తన అన్న గొంతులో పొడవగా చనిపోయాడు. మృతుని భార్య మారుపాక సరిత కాటారం పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇచ్చింది. అప్పుడు కాటారం ఎస్ హెచ్ ఓగా ఉన్న హెడ్ కానిస్టేబుల్ మహేందర్ నిందితుని పై హత్య కేసు నమోదు చేశారు. తదుపరి అప్పటి



కాటారం సీఐ శివప్రసాద్ నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు . తదుపరి సీఐగా వచ్చిన బి.హతీరామ్ దర్యాప్తు పూర్తి చేసి సరైన సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ షీట్ ఫైల్ చేశారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కోర్టు లైజన్ ఆఫీసర ఏఎస్ఐ గాండ్ల వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్లు కె.రమేష్, కె.వినోద్ లు సాక్షులను సరిమైన సమయంలో కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితునిపై నేరం రుజువు అయినందున భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు నిందితుడికి జీవిత ఖైదు, 10వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కాటారం డీఎస్పీ రాంమోహన్ రెడ్డి, కాటారం సీఐ నాగార్జున రావు కాటారం ఎస్ఐ అభినవ్, అప్పటి దర్యాప్తు అధికారులను భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

# మహిళా ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



**ఆరోగ్య మహిళ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్ బ్యూరో, మార్చి 11 (జనంసాక్షి) :**

ఇంటి పనులతో పాటు ఉద్యోగ బాధ్యతల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్న మహిళా ఉద్యోగులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని టిఎన్జీవో భవన్లో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. ఈ క్యాంపును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహిళలు కుటుంబ పనులతో పాటు ఉద్యోగ జీవితంలో తీరిక లేకుండా ఉంటారని అన్నారు. కచ్చితంగా వారు ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. జిల్లా యంత్రాంగం తరపున అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. మహిళ ఉద్యోగులు ఈ పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చని తెలిపారు. సుమారు 50 వేలు ఖరీదు చేసే 45 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేకంగా ఉద్యోగుల కోసం ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బిపి పరీక్ష చేయించుకున్నారు.మహిళా ఉద్యోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో టీజీవో అధ్యక్ష కార్యదర్శులు కాళీ చరణ్, రవీందర్ రెడ్డి, టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంగెమ్ లక్ష్మణరావు, డిడబ్ల్యూఓ సబిత, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



**చిట్యాల, మార్చి11(జనంసాక్షి)**

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ మేరకు మంగళవారము ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించి పలు గ్రామాలల్లో రూ.9.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 48 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ముందుగా మండలంలోని గోపాలపూర్ గ్రామంలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ, గోపాలపూర్ నుండి శ్యామ్ నగర్ వరకు బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపన ,అనంతరం ముచినిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ముచినిపర్తి నుండి కొత్తపేట వరకు బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపన, చల్లగరిగ, జూకల్, తిరుమలాపూర్, నవాబుపేట, చింతకుంటరామయ్యపల్లి, బావుసింగ్ పల్లి, గాంధీనగర్, నైన్ పాక, చైన్ పాక గ్రామాల్లోని ఎస్సీ కాలనీలల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా, వెంకట్రావ్ పల్లి(సీ) లో మోడల్ స్కూల్ లో గ్రావెల్ ఫిల్లింగ్, గ్రౌండ్ లెవలింగ్ పనులకు శంకుస్థాపన, బావుసింగ్ పల్లి నుండి చెంచుకాలనీ, వెంచరామి నుండి కుర్మపల్లి వరకు బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపనలు చేశారు.అనంతరం ఆయా గ్రామాల్లో శంకుస్థాపనల అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం వచ్చిన వెనువెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ హేమ, ఎంపీడీవో జయశ్రీ, కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు ముకురాల మధువంశీకృష్ణ, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మూలశంకర్ గౌడ్, టేకుమట్ల మండల మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల మాజీ అధ్యక్షులు కామిడి రత్నాకర్ రెడ్డి, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొమురు, పుల్లూరు సతీష్, రాజ్ మహమ్మద్ ,మాజీ ఎంపీటీసీ అనిల్, తిరుపతి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

# ఇసుక లారీలు ఢీకొని మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా చెల్లించాలి



**మంథని, (జనంసాక్షి) :**

ఇసుక లారీలు ఢీకొని మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్ గ్రేషియాతో పాటు వారి కుటుంబాల్లో ఒక్కరికి ఉద్యోగం కేటాయించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. విచల విడిగా నడుస్తున్న ఇసుక లారీలతో రహదారులు రక్తసిక్తంగా మారుతూ ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గంలో ఇసుక రీచ్ ల నుండి పగలు రాత్రి అనే తేడా లేకుండా ప్రతి నిత్యం వేలాది ఇసుక లారీలు నడుస్తున్నాయన్నారు. ఈ ఇసుక లారీల వల్ల రహదారి పై ప్రయాణం ప్రమాధకరంగా మారిందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ శంకర్,

మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, యూత్ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, పెంచికల్ పేట్ మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, జూలపల్లి, సిద్దిపల్లె మాజీ ఉప సర్పంచులు పోలుదాసరి సాయి కుమార్, జాబు సతీష్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు కొయ్యడ కుమార్ యాదవ్, నాయకులు నీలం శ్రీనివాస్, సుధాకర్, తోట రాజ్ కుమార్, సాన సురేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
బుధవారం 12 మార్చి 2025

# ఆర్థిక ఇబ్బందులకు కుటుంబం బలి

- ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ భార్యాభర్తలు
- మంచంలో విగతజీవులుగా పడి ఉన్న ఇద్దరు పిల్లలు
- హబ్సిగూడలో విషాద ఘటన



హైదరాబాద్, మార్చి 11 (జనం సాక్షి) : ఓయూ ఆర్థిక ఇబ్బందులకు నలుగురు సభ్యుల కుటుంబం బలైన విషాద సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న భార్యాభర్తలు, అంతకుముందు తమ ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చినట్లుగా అనుమానం .ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగర్ కర్నల్ జిల్లా కల్వకుర్తి మండలం మోకురాలకు చెందిన చం ద్రశేఖర్రెడ్డి (40), కవితారెడ్డి (35) దంపతులు హబ్సిగూడ మహేశ్వరన గర్ లోని సెయింట్ జోసెఫ్ స్కూల్ సమీపంలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వారికి తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రీతరెడ్డి (13). ఐదవ తరగతి చదువుతున్న విశ్వంత్రెడ్డి (10) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. చంద్రశేఖర్రెడ్డి గతంలో నారాయణ కళాశాలలో లెక్చరర్గా పని చేశాడు. గత ఆరు నెలల నుంచి ఉద్యోగం లేకపోవడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది అని . సోమవారం రాత్రి సమీపంలో ఉండే బంధువులు ఫోన్ చేస్తే దంపతులు ఎత్తకపోవడం తో అనుమానం వచ్చి ఇంటికి రాగా చంద్రశేఖర్రెడ్డి, కవితారెడ్డి చెరొక గదిలో సీలింగ్ ఫ్యాన్లకు చున్నీతో ఉరి వేసుకుని కన్పించారు. ఓ గదిలో మంచంపై పిల్లలిద్దరూ చనిపోయి కన్పించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఓయూ పోలీసులు, నలుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీత అబిడ్స్ లోని ఫిట్జీ స్కూల్లో, విశ్వంత్ హబ్సిగూడలోని జాన్సన్ గ్రామర్ స్కూల్లో చదువుతున్నట్లు తెలిసింది.

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- రూ . 41.19 కోట్ల విలువ గల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, మార్చి 11 (జనంసాక్షి) : మౌలిక వసతుల కల్పనకు ప్రజాపాలన ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం ఎల్బీనగర్ జోన్ ఉప్పల్ సర్కిల్ లో రూ. 4119. లక్షల విలువ గల వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. రామంతపూర్ వార్డు ఇందిరా నగర్ మెట్ల గల్లి లో రూ. 88.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సివరేజ్, సి సి రోడ్డు పనులకు, కోటి రూపాయల వ్యయంతో రామంతపూర్ రజక సేవా సంఘం, అంబేద్కర్ సేవా సంఘం మొదటి అంతస్తు భవన నిర్మాణ పనులకు, బాలకృష్ణ నగర్, కె.టి.ఆర్ నగర్ లలో కోటి 20 లక్షల వ్యయంతో 450/300 దయా సీవరేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులకు, ఉప్పల్ భగాయత్ ఫేస్ 1 లో నీటి సరఫరా వ్యవస్థ, సీవరేజ్ సిస్టం పటిష్టత, మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 25.43 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 6.26 కోట్ల వ్యయంతో సూర్య నగర్, శ్రీరామ కాలనీ, లక్ష్మారెడ్డి కాలనీ, శేష సాయి నగర్, సౌత్ స్వరూప్ నగర్, స్వరూప్ నగర్, సత్య నగర్, టి.వి కాలనీ లలో సిసి రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు, ఉప్పల్ సర్కిల్ భరత్ నగర్ రామాలయం కాలనీ వద్ద రూ. 1.52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ రీమోడలింగ్, స్ట్రామ్ వాటర్ డ్రైన్, సి సి రోడ్డు పనులకు, ఉప్పల్ సర్కిల్ డివిజన్ 14 లోని పద్మావతి కాలనీ, ఆనంద్ నగర్, సౌత్ స్వరూప్ నగర్, 7హిల్స్ కాలనీ, వెంకటేశ్వర కాలనీలో రూ. 4.88 కోట్ల వ్యయంతో ప్రస్తుత సీవరేజ్ లైన్లను రీమోడలింగ్ చేసేందుకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన లు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఉప్పల్ - నారపల్లి ఫ్లైఓవర్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని, ఉప్పల్ నుండి ఘట్కేసర్ వరకు కొత్తగా ఐటీ కారిడార్ ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ నలుమూలలా మెట్రో రైలు, తీసుకువస్తామని, కాలుష్యం లేని బస్సులను తీసుకువస్తామని మంత్రి తెలిపారు. మూసీ నది ప్రక్షాళన చేయడంతో పాటు మూసీ పరివాహక ప్రాంత ప్రజల సమస్యలు తీరుస్తామన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా కలెక్ట్ గౌతం పొత్రు, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, స్థానిక కార్పొరేటర్లు రజిత, బండారు శ్రీవాణి, బొంతు శ్రీదేవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 40 నెలల్లో ఎస్టీపీపీ 800 మెగావాట్ల

# పవర్ ప్లాంట్ పూర్తి చేయాలి

- వచ్చే నెలలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి
- ప్లాంట్ నిర్మాణానికి బిహెచ్ఈఎల్తో ఒప్పందం సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్

(ఎండి. మునీర్, ప్రత్యేక ప్రతినిధి/జనం సాక్షి)



మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా సోమవారం సాయంత్రం ఈ నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బి.హెచ్. ఇ.ఎల్.) తో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరఫున సీఎండీ ఎన్.బలరామ్ తో పాటు డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్), ఎల్.వి.సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభానీ, సింగరేణి విద్యుత్ విభాగం ఉన్నతాధికారులు, బి.హెచ్.ఇ.ఎల్. నుంచి జనరల్ మేనేజర్, హెడ్ పార్థసారథి దాస్, జీఎం జోగేష్ గులాటి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందరభంగా సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. గరిష్టంగా నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని ఒప్పందం ఉన్నప్పటికీ, 40 నెలల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా వచ్చే నెల నుంచే పనులు ప్రారంభించాలన్నారు. ఇచ్చిన షెడ్యూల్ లోపే పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పవర్ ప్రాజెక్టు ప్రాంగణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకుని త్వరితగతిన ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బీహెచ్ఈఎల్ జీఎం అండ్ హెడ్ పార్థసారథి దాస్ మాట్లాడుతూ.. సింగరేణి పవర్ ప్లాంట్ను అతి ప్రాధాన్య ప్రాజెక్టుగా తమ బోర్డు నిర?యించిందని, ఈ నేపథ్యంలో పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. గతంలో చేపట్టిన 1200 మెగావాట్ల ప్రాజెక్టులో ఎదురైన సమస్యలను ముందే అధిగమించేలా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు.

### ప్లాంట్ పూర్తయితే ఏటా రూ.300 కోట్ల లాభాలు

ఈ ఒప్పందం ప్రకారం బి.హెచ్.ఇ.ఎల్. సంస్థ 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించి బాయిలర్స్, టర్బైన్స్, జనరేటర్ల (బిటీజి) ఏర్పాటుతోపాటు అన్ని రకాల సివిల్ తదితర అన్ని నిర్మాణాలను 48 నెలల్లో అనగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి సంస్థ 2016లో పూర్తయిన 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం విజయవంతంగా నడుస్తూ కంపెనీకి ప్రతి ఏడాది సుమారు 450 కోట్ల రూపాయల వరకు లాభాలను ఆర్జించి పెడుతుంది. ఇప్పటివరకు ఈ ప్లాంటు సుమారు 70 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ ను రాష్ట్ర అవసరాలకు అందించింది. ఈ నేపథ్యంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం పలుమార్లు దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలలో కెల్లా అత్యధికంగా ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీ.ఎల్.ఎఫ్.) సాధిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. ఈ ప్లాంట్ పనితీరుపై సంత ృప్తిని వ్యక్తం చేస్తూ ఇదే ప్రాంగణంలో సింగరేణి సంస్థ మరో యూనిట్ స్థాపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీనితో ఈ కొత్త ప్లాంట్ కు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులకు ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఈ ప్లాంట్ పూర్తయితే సింగరేణి సంస్థకు ఏడాదికి మరో 300 కోట్ల రూపాయల వరకు లాభాలు చేకూరే అవకాశం ఉంది. ఇది సింగరేణి ప్రగతికి ఎంతో దోహదపడుతుంది.

## తిరుమల దర్శనానికి సిఫార్సు లేఖలు

# చెల్లుబాటయ్యేలా చూడండి

- ఏపీ సీఎం మార్గదర్శకాలను టీటీడీ సిబ్బంది, అధికారులు సరిగ్గా పట్టించుకోవడం లేదు
- ఏపీ సీఎంకు లేఖ రాసిన తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, మార్చి 11 (జనంసాక్షి) : తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడి దర్శనం కోసం ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు. సిఫార్సు లేఖల వ్యవస్థను తిరిగి తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఆమె.. సిఎం చంద్రబాబు నాయకత్వంలో తీసుకున్న ఈ మంచి నిర్ణయానికి తెలంగాణ ప్రజా ప్రతినిధులందరికీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అయితే, తెలంగాణ నుండి తిరుమలను సందర్శించే భక్తుల సంఖ్య ఈ మధ్య బాగా పెరిగిందని, కానీ తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు వెంకన్న దర్శనం కోసం సిఫార్సు లేఖలు ఇస్తున్నా టీటీడీ అధికారులు, సిబ్బంది ఏపీ ముఖ్యమంత్రి ఆదేశాలను సరిగ్గా అమలు చేయడం లేదని ఆమె లేఖలో తెలిపారు. దీంతో తెలంగాణ ప్రజాప్రతినిధులు, తిరుమల వేంకటేశ్వరుడి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీటీడీ అధికారులు తెలంగాణ భక్తులను అనుమతించకపోవడంపై తీవ్ర గందరగోళం నెలకొంటుందని ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి మంత్రి సురేఖ తీసుకెళ్ళారు. ఈ విషయాన్ని వెంటనే ప్రత్యేకంగా పరిశీలించి, సదరు ఆదేశాలను సక్రమంగా పాటించేలా టిటిడి అధికారులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ఏపీ ముఖ్యమంత్రి జోక్యం తెలంగాణకు చెందిన చాలా మంది భక్తులలో ఆనందాన్ని నింపుతుందని, సత్వరమే చర్యలు తీసుకోవాలని లేఖలో మంత్రి సురేఖ కోరారు.

# నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం: ఏలేటి

హైదరాబాద్, మార్చి11 (జనంసాక్షి) : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిజెపి క్రియాశీల పాత్రపోషిస్తుందని బిజెపి స్పష్టం చేసింది. గవర్నర్ ప్రసంగంలో మంచిచెడులను విశ్లేషించి స్పందిస్తామని బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్లో మాట్లాడుతూ.. గడిచిన డిసెంబర్లో మొదటి సారి గవర్నర్ ప్రసంగంలోని అంశాల ఆధారంగా సీఎం రేవంత్ రెడ్డి సంగతి తేలుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మీద నెపం తెచ్చే ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలపై మాట్లాడాలన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..అంతకు ముందు కాళేశ్వరం మీద అఖిల పక్షం టూర్ పెట్టారని.. ఇప్పుడు ప్రభుత్వానికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో 12 వేలకు పైగా గ్రామాల్లో ప్రభుత్వ పనితనంపై అఖిల పక్షం టూర్ పెట్టాలని.. తాము వస్తామని అన్నారు.

# నిజామాబాద్ మార్కెట్కు పోటెత్తిన పసుపు

- గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదని రైతుల ఆందోళన
- 500 తగ్గించి కొనుగోలుకు వ్యాపారుల మెలిక
- చేసేది లేక ఆమోదించిన రైతులు



నిజామాబాద్, మార్చి10 (జనంసాక్షి) : నిజామాబాద్లోని మార్కెట్ యార్డుకు పసుపు పోటెత్తింది. 50 వేల బస్తాలకు పైగా అమ్మకానికి పసుపు రావడంతో రైతులతో మార్కెట్ యార్డ్ మొత్తం సందడిగా మారింది. కనీస మద్దతు ధరతో కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మార్కెట్ యార్డ్ ముట్టడించి అక్కడి నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ తీశారు. బస్టాండ్ ఎదుట రెండు గంటల పాటు ధర్నా చేపట్టారు. దీంతో.. నిన్న పసుపు కొనుగోళ్లు నిలిచిపోయాయి. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో వ్యాపారులు రైతులతో జరిపిన చర్చల ముగిశాయి. కటాఫ్కు 500 ధర తగ్గిస్తే పసుపు యథావిధిగా కొనుగోలు చేస్తామంటూ వ్యాపారులు తేల్చిచెప్పడంతో చేసేదేమీ లేక రైతులు ఒప్పుకున్నారు. దీంతో.. క్వింటాకు 500 ధర తగ్గిస్తూ, క్వింటాల్ పసుపు 9500 రూపాయలకు కొనుగోలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే మార్కెట్ యార్డుకు పసుపు రైతులు పోటెత్తారు. పసుపు కొనుగోళ్లపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సీజన్ ప్రారంభం నుంచి క్వింటాల్కు 2 వేలకు పైగా ధర పతనం అయ్యిందని పసుపు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం క్వింటాల్కు రూ.18000 వరకు ధర పలుకగా.. ఈసారి రూ. 10వేల లోపు కనీస ధర పలుకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత వంకతో ధరలు తగ్గుతున్నాయని మార్కెట్ చైర్మన్ చెబుతుండటంపై రైతులు తప్పు పట్టారు. వ్యాపారులు, మార్కెట్ కమిటీ అధికారులు కుమ్మక్కయ్యారని రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. పసుపునకు కనీస మద్దతు ధర చెల్లించాలని, దళారుల మోసాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిజామాబాద్ ప్రధాన బస్టాండ్ వద్ద పసుపు రైతులు మెరుపు ధర్నా చేపట్టారు. వరుసగా రెండోరోజూ మంగళవారం ఆందోళనకు దిగారు. పసుపు బోర్డు వచ్చినా లాభం లేకుండా పోయిందని అన్నారు. రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని, పసుపు బోర్డు పేరుతో దగా చేస్తున్నారని నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పేంతవరకు ధర్నాను విరమించబోమని మొండికేశారు. నిజామాబాద్ మార్కెట్ యార్డ్ మొత్తం దళారులు, వ్యాపారుల చేతిలో ఉందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి ధరలు నిర్ణయిస్తున్నారని, మార్కెట్లో వచ్చిన పసుపునకు నాణ్యత లేదని వంక చూపుతూ రైతును నిండా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చి వారం రోజులు గడుస్తున్నా కూడా పసుపు కొనడం లేదని ఆరోపించారు. దిక్కుతోచని పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన రేటుకు పసుపు విక్రయించి కన్నీటితో తిరిగి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో వందల కుప్పల పసుపు ఉన్నప్పటికీ కేవలం ఒకటి, రెండు కుప్పలను పరిశీలిస్తున్నారని, పూర్తిస్థాయిలో పసుపు పరిశీలించకుండానే నాణ్యత లేదని వంకతో కొనడానికి ఎవరు ముందుకు రావట్లేదని అన్నారు.

# కాంగ్రెస్ సోషల్ మీడియా దుష్ప్రచారం

- మండిపడ్డ బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, మార్చి11 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నా రాజకీయ భవిష్యత్పై గత రెండు రోజులుగా కాంగ్రెస్ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ చిల్లర వేషాలు మానుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆర్ఎస్పీ హెచ్చరించారు.నేను రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానో, ఏ వర్గాల భవిష్యత్ కోసం పనిచేయాల్నో నాకు క్లారిటీ ఉందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మీ లాగా పదవులకోసం ఢిల్లీకి మూటలు మోసే సంస్కృతి నాకు లేదు. అన్ని పైసలు కూడా నా దగ్గర లేవు. తెలంగాణలో తరతరాలుగా అణచివేతకు గురైన వర్గాల విముక్తికి కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ సరైన వేదిక అని బలంగా నమ్మి ముందుకు వెళ్తున్నానని పేర్కొన్నారు. రేపు బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చిన తరువాత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రోత్సాహంతో తెలంగాణ 2.0ను ఎలా సృష్టించాలన్న పనిలో బిజీగా ఉన్నానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

# కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

- దత్తత గ్రామంలో మంత్రి సీతక్కతో కలసి పర్యటన
- గిరిజనుల ఇంగ్లీష్ ప్రావీణ్యంపై ఆశ్చర్యం
- కొండపర్తిలో పర్యటించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ





ములుగు ప్రతినిధి, మార్చి 11 (జనంసాక్షి) : తాను దత్తత తీసుకున్న ములుగు జిల్లా కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోడ్డు మార్గాన చేరుకున్నారు. మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ కిషోర్ , కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలు వారి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధి నిమిత్తం రూ. కోటి 50 లక్షల విలువైన పనులు ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అగన్వాడీ కేంద్రంలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. మహిళల కొరకు మిర్చి యూనిట్, మసాల, పసుపు, పిండి యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ మాట్లాడుతూ.. 'ఆదివాసీలు వెనకబడి ఉన్నారు కాబట్టి అధికారులందరూ కలిసి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. ఇక్కడ పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడం చాలా ఆనందం అనిపించింది. ఈ కొండపర్తి గ్రామాన్ని దేశంలో రోల్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలి. నేను ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చాను. మా గ్రామం కూడా నా చిన్నప్పుడు కొండపర్తిలానే ఉండేది.కొండపర్తిలో తయారుచేసే మసాలా, కారం, పసుపు ఒక ప్రత్యేక బ్రాండ్ లు గా నిలవాలని ఆయన పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370